# మూసీ

# MUSI


◆ Samputi : 25 ◆ Sanchika : 07 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ May 2022

UGC Care List Approved Journals



- మరుగున పడిన కవి మారేపల్లి వెంకట కృష్ణయ్య
- దామోదర మావ్జో
- భూమ్యాకర్షణ గాణాపత్యం
- నిజామాబాద్ జిల్లా శతక కవులు
- పారమార్థిక గేయాలలో ఉయ్యాల పాటలు
- ఉత్తమ గ్రంథం (సాహిత్యం) అంటే ?
- ముద్దుపళని రాధికాసాంత్వనము - రాగాత్మిక భక్తి
- గానకోకిల 'లతా మంగేశ్కర్'






వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 25 సంచిక : 7
మే - 2022
'శుభకృత్' వైశాఖ మాసం
**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM
Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075
**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)
చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక'** (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


| | |
|---|---|
| మరుగున పడిన కవి మారేపల్లి వెంకట కృష్ణయ్య .... పెబ్బేటి మల్లికార్జున్ | 7 |
| దామోదర మావ్జో .... వేలూరి కృష్ణమూర్తి | 11 |
| కుంజీ (బందారం కథలు - 6) ... డా. నందిని సిధారెడ్డి | 13 |
| భూమ్యాకర్షణ గాణాపత్యం ... డా. సాగి కమలాకర శర్మ | 17 |
| పద్య మనోహరం - 29 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు | 20 |
| నిజామాబాద్ జిల్లా శతర కవులు ... పెరుమల కైలాస్ | 21 |
| పారమార్థిక గేయాలలో ఉయ్యాల పాటలు ... కె. ఎల్లప్ప | 26 |
| ఉత్తమ గ్రంథం (సాహిత్యం) అంటే? ... డా. శంకర్ అనంత | 28 |
| ముద్దుపళని రాధికాసాంత్వనము - రాగాత్మిక భక్తి ... డా. శిరీష ఈద్పుగంటి | 31 |
| గ్రంథాంతరంగం 12 - ఆధునికాంధ్ర కవిత్వం ... ఘట్టమరాజు | 35 |
| వికాస రేఖలు ... గురిజాల రామశేషయ్య | 40 |
| సినిమాకు ప్రాణం పోసిన సుద్దాల పాట ... ఎం. విప్లవ కుమార్ | 41 |
| గానకోకిల 'లతా మంగేశ్కర్' ... సామల రాజవర్ధన్ | 43 |
| తెలంగాణ భాష - సమాలోచనం : జాతీయ సదస్సు సమీక్ష ... సాగి తేజశ్రీ | 47 |
| కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 23 ... టి. లక్ష్మీనారాయణ | 51 |


### కవితలు

కార్మికా! నమోనమః !! ... అవుసుల భానుప్రకాశ్ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; ఆగిన పరుగు ... డా. పి. హంసమ్మ - 6; ప్రశ్న మొదలైంది ... తిరునగరి శరత్ చంద్ర - 10; న్యాయమూర్తి ... ముత్యంపేట గంగాధర్ - 30; సాహితీ తేజం దేవులపల్లి ప్రభాకరుడు ... సంకేపల్లి నాగేంద్రశర్మ - 39; జ్ఞాపకాల చేపపిల్లలు ... తండ హరీష్ గౌడ్ - 62.

### సమీక్షలు


| | |
|---|---|
| బమ్మెర పోతనకు అక్షర నీరాజనం ... డా. రాపోలు సత్యనారాయణ | 54 |
| ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి సంచిక.. అంతటి బాలస్వామి | 55 |
| సుధాముని 'తెమ్మెర' కవితా సంపుటి ... బి. శ్రీనివాస రెడ్డి | 58 |
| తెలుగు జాతి ప్రతినిధి మన పి.వి... ఘనపురం సుదర్శన్ | 59 |
| స్వీకృతి ... | 61 |



**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 4 హైదరాబాద్ మే : 2022

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**



## వికృతి

భూమి, భూమి చుట్టూ ఉండే పాంచభౌతిక ప్రకృతి ఏర్పడటానికి ఎన్నో వేల, లక్షల సంవత్సరాలు పట్టింది. భూమి, సూర్యుని చుట్టూ తిరగడం ద్వారా ఏర్పడే ఋతువులు, కాలగణన, ప్రకృతి మార్పులు అన్నీ ప్రస్తుత మన అధ్యయనాంశాలే. ఋతువులనే కాలంగా గుర్తిస్తూ అనేక పేర్లను మనం పెట్టుకుంటూ ఉన్నాం. సంవత్సరానికి వసంతాలు అనీ, వర్షాలు అనీ, శరత్తులు అనీ పేర్లు పెట్టుకొని ఋతువులను అధ్యయనం చేస్తున్నాం. ప్రకృతి ఇక్కడ కాలసూచిక అయింది. అబ్దము అనే సంస్కృత శబ్దాన్ని అనుసరించి సంవత్సరంలో ఒకసారి నీటిని (అప్) ఇచ్చునది అర్థంలో ఉపయోగిస్తున్నాం. నిత్యజీవితంలో ప్రకృతితో అనుబంధం లేకుండా మనం బ్రతుకలేని స్థితి. భారతీయ ప్రకృతిని అనుసరించి మనకు వేడి, చలి, వాన సమపాళ్ళలో కావాల్సిందే. అయితే మనం తట్టుకునే శక్తిని కోల్పోయి, మనం భరించలేక ఈ ప్రకృతిని మనం వ్యతిరేకిస్తున్న స్థితి నేడు మనకు కనిపిస్తుంది.

ఎండ తీవ్రమైతే దాని నుండి మనం జాగ్రత్త తీసుకోవాలి. వాన ఎక్కువైతే ఇబ్బంది కాకుండా మనమే కాపాడుకోవాలి. చలి తీవ్రమైతే తగిన రక్షణలు మనమే ఎంచుకోవాలి. ఏది ఏమైనా ప్రకృతికి అనుగుణంగా మనం వెళ్ళాలి కాని, ప్రకృతి వ్యతిరేకంగా మనం వెళ్ళకూడదు. దానిని మనం దూషించకూడదు. మన విధి నిర్వహణకు అడ్డం వస్తే ప్రకృతిని మనం తీవ్రంగా దూషిస్తున్నాం. వాన, ఎండ, చలి వల్ల మన శరీరాలు భరించలేకపోతే కూడా రోగాల పేర్లు కూడా ప్రకృతిని అనుసరించి మాత్రమే పెరుగుతున్నాయి. వడదెబ్బ, చలికాటు, పడిశం మొదలైనవన్నీ ఈ ప్రకృతికి మనం అనుగుణంగా ఉండలేకపోవడం వల్ల, మార్పును అనుసరించలేక పోవడం వల్ల కలిగే ఇబ్బందులే. ఇదే మన వికృతి. ఇంత పటిష్టమైన కృతిని మనం పట్టించుకోవడం లేదు. ఇంత ప్రభావవంతమైన పంచభూతాత్మక స్థితి (ప్రపంచం)లో ఉంటూ దానినే ద్వేషించడం, దూషించడం వల్ల కలిగే పర్యవసానాలు మనం అనుభవించక తప్పదు.

ప్రకృతి అంటే మన చుట్టూ ఉన్నదే కాదు, మనలోనూ అదే ప్రకృతి ఉంటుంది. అందువల్ల మన చుట్టూ ఉండే వాతావరణం మాత్రమే కాదు, మన చుట్టూ ఉండే జీవులలోనూ ఈ పాంచ భౌతిక ప్రకృతి ఉంటుంది. కొందరిలో అగ్నితత్త్వం, కొందరిలో వాయు తత్త్వం, కొందరిలో జల తత్త్వం ఎక్కువ ఉంటుంది. వారి తత్త్వాన్ని బట్టి ఆ యా కాలాల్లో వారు మరో తత్త్వానికి అనుగుణంగా మారడానికి ఇబ్బంది పడొచ్చు. ఆయుర్వేదం వాత, పిత్త, కఫ అనే అంశాలతో వైద్యం చేసేది ఈ అంశాల ఆధారంగానే.

మన చుట్టూ ఉండే వాతావరణాన్ని, మనతోటి వ్యక్తులను, మన చుట్టూ ఉండే జీవులను, వృక్షాలను ఏ రూపంలో ద్వేషించినా, వ్యతిరేకించినా అది మనకే ఇబ్బంది. మనని మనమే వ్యతిరేకించుకుంటున్నట్టు. ఇది అజ్ఞాన పూరితమే. అదే ఎండ, వాన, చలి లేకుండా మనం బ్రతుకగలమా? చుట్టూ ఉన్న జీవులను వ్యతిరేకించి ఉండగలమా? పశు పక్ష్యాదులు, క్రిమి కీటకాలు లేకుండా జీవన వ్యవహారం సాగుతుందా? ఈ విషయాలు మనకు ఎందుకు తెలియడం లేదు.

ప్రకృతి, వ్యక్తి, సమాజం, పశుపక్షులు మొదలైన వానిని వ్యతిరేకించడం, దూషించడమంటే తమ తల్లిని తాము ద్వేషించినట్లే. తాము పుట్టిన, పెరిగిన, తామే అయి ఉన్న ప్రకృతిని హింసించడం, ఇబ్బంది పెట్టడం, దూషించడం వికృతి. ఈ స్థితి అర్థం చేసుకోవాలి. అవగాహన పెంచుకోవాలి. కాలానుగుణంగా మనం మారాలి. మన శక్తి పెంచుకుంటే ప్రకృతి సహకరిస్తుంది. మన శక్తి తగ్గితే ప్రకృతి వల్ల ఇబ్బందులు వస్తాయి. మనలోని పంచభూతాలు, మన చుట్టూ ఉండే పంచభూతాలతో అనుసంధానం చేయడం అలవాటు చేసుకోవాలి. అదే మానవ సంస్కృతి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  UGC Care List Approved Journals
హైదరాబాద్ మే : 2022

# కార్మికా! నమో నమః !!




కరముల్ సేవల కాకరమ్ములయి, ప్రాకారమ్ములై నిల్చె । నా
కరముల్ ధాత్రికి శక్తి నింపు వరముల్ కారుణ్య భావమ్ము నా
దరమున్ గొల్వగ వారికంజలులిడన్ ధన్యత్వమే గల్గు నా
కరయుగ్మమ్ముల! చేవనింపు సదయుల్ కర్మిష్ఠులన్ మ్రొక్కగా
పరమామ్నాయ సుఖాబ్ది దేలు మనముల్ బాహుళ్యమౌ భక్తితో
చిరసేవారత దివ్యశక్తులు సదా సేమమ్ము కాంక్షించుచున్
పరమోదార కృతార్థులౌచు వరమున్ బాంధవ్యమా బాధలన్
నిరతమ్మున్ కృషి సల్పినారు మనమే నిత్యోత్సవమ్మొంద నీ
ధరణిన్ మానవజాతి వీరి పనికిన్ దాక్షిణ్యముం జూపదే
యిరుసున్నుండికి నున్న చందమున వీరీ దేశ వృద్ధింగనున్
అరయన్ శ్రామి శక్తులన్ని గనిలో నత్యంత జాగ్రత్తతో
మరణమ్మంచున నిల్చి సేవలిడరే మాహాత్మ్యభావమ్ముతో
మురికిన్ దీసెడు పారిశుద్ధ్యపు పనిన్ మోదమ్ముతో సల్పు! నా
వర కర్మీయుల దీక్ష నెన్నతరమా? వర్ధిల్లనారోగ్యమున్
పరుగుల్వేట్టుచు రోడ్లనూడ్చు ఘనులై భాసిల్లు దివ్యాత్ములై
మెరయున్ చెత్తను కాంతి రేఖలగుచున్ మేల్గోరు సేవారతుల్
ధర సేవావ్రతులెల్ల జేయు భువికిన్ ధన్యంపు సేవల్ సదా
మురికింబట్టలు మల్లెపూల వలె, తా మోదమ్ముతో జేయులే
పెరుగంగా తల వెంద్రుకల్ని మనకున్ పేర్మిన్ సుతారమ్ముగా
తరుగంజేసెడు కర్మవీరుడిలలో ధన్యుండు మాలీషుతోన్
పరసౌఖ్యమ్మును గోరుఆరలను నే భావింతుగా దేవతా
వరులంచున్నువి! వారి కంఠమున నీ పద్యమ్ము మాలాకృతిన్
విరియున్ కార్మిక వర్యులందరకు నావేశింతు నీ భావనన్
వరమౌ సేవల కంజలించి, చిరమౌ వైదగ్ధ్య భావమ్ముతో
సురమత్తేభము తోడ దెల్పితినిటన్ సొంపార చిత్సౌఖ్యమున్






అవ్వసుల భానుప్రకాశ్
సంగారెడ్డి, ఫోన్ : 9603204507

# ఆగిన పరుగు





అడుగడుగునా
అవమానాలు...
అంతకు మించిన
ఆకలి చావులు....
వెళ్ళిన ప్రతిచోట
అంటరానితనం....

కలానికంటే
కులం కావాలి
ఈ జనాలకు...

గబ్బిలానికే (జాషువా)
తప్పలేదు
మనమెంత
అనుకోవడమే తప్పు.....

ఈ కులం
నా కాళ్ళకు
కళ్లెం వేసి
నా పరుగును
ఆపేసింది....



నా కాళ్ళ బూట్లు
ఎక్కెక్కి ఏడ్చాయి
ఆటలో
ఓడినందుకు కాదు...
కులాన్ని గుర్తించిన
గురువులు (ఆటలో)
ఇంకా ఉన్నందుకు..

డా. పి.హంసమ్మ
ఫోన్ : 77300 47278

# తుకారాం అభంగం

పరబ్రహ్మను పట్టుకుంటిని
కల్పనలు మాయమయ్యాయి
తొందరపాటులో తప్పుడు త్రోవ
తొక్కవద్దు ఓ మానవా!

తొందర పడ్డావంటే నువ్వు
చెడు జరిగిపోవుచుండును
విచారించు నీతో నువ్వు
నీ హృదయ కుహరములో

నీలోనే నుండే ఈశ్వరుడు
అతని దర్శించి చూడుము
ఆత్మసుఖ అనుభవమును
పొందుదువు శాశ్వతముగా

ఆత్మనుండు అనంతుడు
నీ నిజకారణము
తుకా పలికే అతనిలోన
లీనమవుము ఓ మానవా!




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

# మరుగున పడిన కవి మారేపల్లి వెంకట కృష్ణయ్య

**పెబ్బేటి మల్లికార్జున్,** సహాయ ఆచార్యులు, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, నాగర్ కర్నూల్, ఫోన్ : **9491 881916**

పరిశోధన నిమిత్తం తెలంగాణా వ్యాప్తంగా క్షేత్ర పర్యటన చేస్తున్న సందర్భంలో వెంకటకృష్ణయ్య గారు రచించిన **'ఇందుర్తి నృకేసరీ శతకం'** అముద్రిత ప్రతిని కపిలవాయి అశోక్ గారు అందించారు. ఇది కోరుట్ల కాగితపు రాతప్రతి. ఇప్పటికి తెలంగాణాలో పరిష్కారంగాని రాత ప్రతులున్నాయి. నా క్షేత్ర పర్యటనలో కొన్నింటిని నేను చూశాను. ఈ కవి గురించి ఏ సాహిత్య చరిత్రలలో కూడాలేదు.

'ఇందుర్తి నృకేసరీ శతకం' పూర్తిగా లభించింది. ఈ శతకాన్ని మొత్తం చదివాను. రాతను గుర్తుపట్టటం కొంత క్లిష్టంగానే ఉంది. కవి తన నివాసం గురించి చెప్పుకోలేదు. ఈ ఇందుర్తి ఎక్కడ ఉందని తెలుసుకునే ప్రయత్నం చేశాను. అధ్యాపకుడు మండల స్వామి గారు ఇది నల్లగొండ జిల్లాలోని మర్రిగూడెం మండలంలో ఈ గ్రామం కలదని, అక్కడ ప్రాచీనమైన నరసింహ ఆలయం కూడా ఉందని సమాచారమివ్వడంతో ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించాను. శతకకర్త ఈ రచనా కాలాన్నిగాని, తాను పుట్టిన సంగరాన్ని గాని తెలుపలేదు. చివర్లో **'రాఘవరావు దేశపాండ్యా గారికి పోల్కంపల్లి రామకృష్ణారావు వ్రాసి యిచ్చిన నృసింహశతకం సంపూర్ణం'** అని ఉంది. చివరలో ఉర్దూ అరబీతో కలిపి రాసిన మూడు వాక్యాలున్నాయి. ఇందులో ఈ శతక ప్రతిని ఎత్తి రాసిన తేది ఉంది. బుధవారం మొదటి శవ్వాల్ 1263 హిజ్రీ అని ఉంది. ప్రస్తుతం 1443 హిజ్రీ షావాన్ నెల 24వ తేది (28-03-2022 నాటికి) నడుస్తుంది. అంటే 180 సంగల 10 నెలలకు పైగా అయింది. దీనిని బట్టి ఈ ప్రతి రచనా కాలం క్రీస్తు శకం 1842 అవుతుంది. అంటే ఈ రచన అంతకు ముందే జరిగింది. కాని శతక కర్త కాలం నిర్ణయించడానికి ఇందులో ఎటువంటి ఆధారాలు లేవు.

శతకం చివరలో తనవంశం పేరు గురించి ఒక పద్యంలో మాత్రం చెప్పుకున్నాడు.

**"పంకజ సంభవీనకుల భవ్యజునుండను మారెపల్లి, నా**
**మాంక కులాంబురాశి శశికాంతుడనంతు సుతుండ దాసుడన్**
**వెంకటకృష్ణ నామకుడ ప్రీతిగజేశితి నీకు నా చరి**
**త్రాంకితమైన పద్యములు సాష్టశతంబు హరీనృకేసరీ॥**
**(అముద్రిత ప్రతి పద్యం-108)**

ఈ శతకంలో మొత్తం 108 పద్యాలున్నాయి. మొదటి 9 పద్యాలలో నరసింహుని గురించి ప్రార్థన, వేడుకోలు ఉంది. 10 నుండి 50 పద్యాలలో అవతారాల గురించి, ఆ అవతారాల విశేషాల గురించి వర్ణించాడు. రామలీలా దశకం అని పేరు పెట్టి 51 నుండి 60 వరకు వర్ణించాడు. 'కృష్ణలీలలు' అని పేరు పెట్టి 61 నుండి 71 పద్యాలలో వర్ణించాడు. 71 నుండి 96 వరకు గల పద్యాలలో ఆయుధాలు మరియు పూజ గురించి వర్ణించాడు. తరువాత పద్యాలలో బంధకవిత్వం, నరసింహునిపై గల తన భక్తిని ప్రకటించుకున్నాడు.

మొదటి పద్యం శ్రీతో ప్రారంభం చేసి ప్రాచీన కవుల ఆచారాన్ని పాటించాడు.

**"శ్రీరమణీ కళత్ర సరసీరుహ బంధు మృగాంకనేత్ర సం**
**సారలతా లవిత్ర దివిషత్సముదాయవరేణ్య మిత్ర నా**
**గారి మనోజ్ఞ పత్ర చతురానన సంస్తుతి పాత్ర నారి భృ**
**ద్వార వినీల గాత్ర యదువంశ పవిత్ర హరీనృకేసరీ'**
**(అముద్రిత వ్రాత ప్రతి-పద్యం-01)**

**రెండవ పద్యం:**

**'ఇందుముఖీ మనోజ వసుధేశ సమర్చిత పాద గోజ పౌ**
**రందర నీలదీప్తి సువిరాజిత రమ్య శిరోజ శ్రవ్య కా**
**ళింద సురావనీజ విమలీకృత భక్త సరోజ గోపికా**
**నంద తనూజ యాదవజన ప్రజరాజ హరీనృకేసరీ'**

ప్రాచీన కవులు భక్తి పారవశ్యంతో భగవంతుని వేడుకోవడం తప్ప, ఇతర సంపదలేవి తమకు అవసరం లేదని వర్ణించినట్లుగానే ఈ శతకకర్త కూడా కన్నులనిండా నరసింహుని చూడటమే భాగ్యంగా చెప్పుకున్నాడు.

**"కన్నులనిండ నిన్గని సుఖంబున నుండినయంత సర్వసం**
**పన్నము నాకు నన్యమగు భాగ్యము పొల్లదియాల చాలు నా**
**పన్నుడ దీనుడన్ కృపకు పాత్రుడ దాసుడనన్నుగావు మీ**
**పన్నగదౌయి దీనజనపాలన నీల హరీనృకేసరీ"**

'రామలీలాదశకం'లో "దశరథ భూతలాధిపతి ధర్మతనూజాత రామనామమూ', "వసుధాత్మజాత కారకంబుజ మిత్రతనూజులైన సు" అనే పద్యాలతో పాటు మరో ఎనిమిది పద్యాలు రామావతారాన్ని గూర్చి చెప్పాయి. 'కృష్ణలీలాదశకం'లో వర్ణించిన 10 పద్యాలలో కృష్ణావతారం యొక్క పరమార్థాన్ని వర్ణించాడు.

**"ద్వాపరవేళయందు వసుధా వసుదేవుని నంద దేవకీ**
**గోపికలన్ ప్రమోదమున గూర్చగ దర్మద దైత్యసంచయా**
**టోపమతంచ్చ సద్బల పటుత్వము దోపగ కృష్ణదేవతా**
**రూపము దాల్చినాడవిల రుద్రసుపూజ్య హరీనృకేసరీ"**
**(అముద్రిత ప్రతి పద్యం -61)**

'నందుని మందలోన యదునందన రూపతనుండ పల్లవీ
మంద మరాళయాకయి నమంద ముదంబున విందొనర్పగా
నందరకన్ని రూపముల హర్షమునొందగ జేశినట్టు గో
విందరమాసతీ హృదరవిందమిళింద హరీనృకేసరీ'
(అముద్రిత ప్రతి పద్యం-65)

83 నుండి 93 వరకు గల పద్యాలలో పూజించే పద్ధతిని వర్ణించాడు. 87వ పద్యంలో **"సకల సుగంధ వస్తుచయనయ్యుతే ధూపము గోఘృత/ ప్రదీపకమగు దివ్యదీపము శుభ్రంబుగగైకొను భక్తమానస"** అనే వర్ణనలతో పాటు కోటి సూర్యులతో సమానంగా వెలిగేవాడా అని, 88వ పద్యంలో హస్తంలో కంకణాలతో, మస్తకమున కిరీటములు, మణికుండలములు ధరించినవాడా అని వర్ణించాడు.

నరసింహునికి ఆరగింపు చేసే రకరకాల ఆహార పదార్థాలను కూడా వర్ణించడం జరిగింది. 90వ పద్యంలో పూజా సమయంలో కండశక్కరల్, కొబ్బరితేనె, జీడిపప్పులు, పాలు, వెన్నతో పాటు 91వ పద్యంలో దధ్యోదనం, పులి ఓగిరం, ఘృతం అని 92వ పద్యంలో పాయసం, పుణుగులు సమర్పిస్తారని వర్ణించాడు.

ఈ శతకంలో త్రిపాద పుష్పమాలిక, ఖడ్గ, నాగ, గోమూత్రికా బంధాలు, నిరోష్ఠ్య, సార్వ విభక్తిస్తవంలో పద్యాలు రచించడం విశేషం. ఈ బంధ పద్యాలకు అలంపూర్ ప్రాంతంలో అధ్యాపకులుగా పని చేస్తున్న బైరోజు రాజశేఖర్‌గారు నేను కోరగానే చాలా శ్రమించి, ఓపికతో బొమ్మలు వేసి పంపారు.

**త్రిపాద పుష్పమాలికా బంధం:**

ச. 'హరదర శారదాభ్ర హరి హస్తి హరీశ్వర తారతారకే
శ్వర శరనారదాభ జల జద్రజ తలశైల ఫాలదృ
గ్ధర సురగోరద ప్రకర కల్పక చామరహార శారదా
హరినిభ కీర్తి మాల్యవహ - యాదవనాథహరీ నృకేసరీ
(అముద్రిత ప్రతి - పద్యం-99)

**ఖడ్గ బంధము:**

చ.'మురహర హస్తి హర్షదవి మోహభయ క్షయదాయకారమే
శ్వర సితకంజనేత్ర నవవారిద మేచక సచ్చరీక మం
దరధర శౌరి వామన సదాశ్రిత పాలక దేవనాయకా
పరమకృపానిధీ వరద వారి జనాభ హరీనృకేసరీ
(అముద్రిత ప్రతి -పద్యం-100)

**నాగబంధం:**


చ.'అజయభవాపయోజనయనా! యదిగణ్య మహారమాధవా
వ్రజజనపాలకా జయకరా! కలివర్మ పదూరనాగ హృ
ధ్వజ వరవాహభూజమురదారక సత్ఫలదాభదావనా
గజవరదా మనోజ జనకా! నయధర్మ హరీనృకేసరీ
(అముద్రిత ప్రతి-పద్యం-101)

**గోమూత్రికా బంధం:**


చ.'అరిదర ధారకావరద యాశరనాశన వారిజోదరా
వరవిన వినతావన పతగ వాహనవైరి కరీన కేసరీ
గిరిధర వారణావనద కేశవనాధనరారి ఖేదమా
వరవినతార్ధనా హిత వామన శౌరి హరీనృకేసరీ
(అముద్రిత ప్రతి-పద్యం-102)

200ల సం॥ల క్రితం రచించబడిన ఈ శతకం ఇప్పటి వరకు అసూర్యపశ్యంగా ఉండటం బాధాకరం. బంధ పద్యాల ద్వారా ఈ కవి గొప్ప పండితుడనే విషయం అర్థమవుతుంది. ఇతని ఇతర రచనలు మాత్రం తెలియవు. శతకరాజంగా ఉన్న ఈ రచనను పరిష్కారం చేస్తున్నాను. శుద్ధప్రతి తయారు అయిన వెంటనే ముద్రించడానికి ప్రయత్నం చేస్తాను.

గోమూత్రికా బంధం




త్రిపాద పుష్ప మాలికా బంధం




"ఇందుర్తి నృకేసరిశతకం" - మారేపల్లి వేంకటకృష్ణ కవి

నాగబంధం



ఖడ్గ బంధం



# ప్రశ్న మొదలైంది??

ఎంత నడిచినా
అందని గమ్యం
ఒక సమస్యగా
నన్ను వెంటాడుతున్నప్పుడు
ప్రశ్న మొదలైంది..

ప్రశ్న వేల ప్రశ్నలుగా
జవాబు దొరకని
కథలుగా, కవితలుగా
దృశ్యాలుగా..
కనబడుతున్నాయి.

చిరునామా లేని
ఎడారిగుండెలను
ఎక్కడని వెతికేది?
చెలమలుగా దొర్లిపడుతున్న
కన్నీటి చుక్కల రూపాన్ని
ఎలా కనిపెట్టేది?
అర్థవంతమైన అక్షరాలన్ని
అర్థంకాని వాక్యాలుగా నడిచొచ్చి
గుండెను మెలిపెట్టి
కరిగిస్తున్నప్పుడు
ప్రశ్నలు సుడిగుండాలై
నన్ను చుట్టుకుంటున్నాయి..

ఆవిరైపోయిన ఆలోచనలతో
చెల్లాచెదరై పడి ఉన్న
కొన్ని చూపులు
నన్ను గాలిలా తాకినప్పుడు
చింతలాంటి చీకట్లు
ముసురుకొచ్చిన ప్రశ్నల్లా
అనిపిస్తుంటాయి..

ఎడారిగుండె వేసిన ప్రశ్నైనా,
తడారిపోయిన చూపులు విసిరిన
ప్రశ్నైనా,
వేడిని తోడిపోసి
ఆలోచింపజేసే ప్రశ్నైనా నాకొక్కటే..

అయినా,
ప్రశ్నలన్ని నన్ను
వెక్కిరిస్తూ వేధించినా..
ఆ చిక్కుప్రశ్నలనే విచ్చుకత్తులుగా
నెత్తికెత్తుకుని
జవాబుగా ఎక్కుపెట్టుకుంటాను..
నేనే జవాబుగా
ఎక్కుపెట్టుకుంటున్నాను.

ప్రశ్నలపరంపరలో
పాదులు వేసుకున్న
జవాబులాగా...
నేను నిక్కచ్చిగా నిలబడుతున్నాను..



**తిరునగరి శరత్‌చంద్ర**
ఫోన్ : 630987682


## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం **'కదంబం'.**
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 11 UGC Care List Approved Journals
హైదరాబాద్ మే : 2022

# దామోదర మావ్జో (2021 సం. జ్ఞానపీఠ పురస్కారం పొందిన కొంకణి రచయిత)

వేలూరి కృష్ణమూర్తి, మైసూరు, ఫోన్ : 9448977877



దేవనాగరి లిపిలో కొంకణి భాషలో రచనలు చేసే ఎంతోమంది రచయితలున్నారు. అలాంటివారిలో ముఖ్యులు చంద్రకాంత కేణి, పుండలీక నాయక, మీనా కాకోడ్కర్, లక్ష్మణరావ్ సర్దేశాయి, ఆ.నా. మ్హామో, ఎన్. సదాశివ, దామోదర మావ్జో, మహాబలేశ్వర సైల, గోకులదాస ప్రభు, శీలా కోళంబకార్, జయమాలా దణాయత్, దిలీప్ బోర్కార్, దేవీదాస కదం, డా. జయంతి నాయక మొదలైనవారు. కొంకణి భాషలో వేలకొద్ది పుస్తకాలు ప్రకటించబడ్డాయి. ప్రతి సంవత్సరం ప్రకటించబడుతూనే వున్నాయి. ఇప్పటివరకూ కొంకణి రచయితలలో ఒకరికి సరస్వతీసమ్మాన్ పురస్కారం, దామోదర మావ్జోతో కలిపి ఇద్దరికి జ్ఞానపీఠ పురస్కారం లభించినది. మొట్ట మొదటి సారి జ్ఞానపీఠ పురస్కారం 2006లో గాంధీ సాహిత్యాన్ని అనువదించిన రచయిత రవీంద్ర కాళేకార్‌కు లభించినది. 2021 సంవత్సరానికి గాను జ్ఞానపీఠ పురస్కారం ప్రసిద్ధ కథ, నవలా రచయిత దామోదర మావ్జోకు లభించినది. కర్ణాటక సముద్రతీరం ప్రజలు మాట్లాడే భాషలలో కొంకణి కూడ ఒకటి. కొంకణి గోవా రాష్ట్ర ప్రజల భాష. కేంద్ర సాహిత్య అకాడెమీ కొంకణి భాషకు దేవనాగరి లిపిని అంగీకరించింది.

దామోదర మావ్జో వృత్తిరీత్యా వ్యాపారస్థుడు. అతడి తండ్రి ఒక కిరాణ కొట్టును చాలా ఏళ్ళనుండి నడుపుకొంటూ వచ్చాడు. కాని, గత కొద్ది సంవత్సరాలుగా వ్యాపారాన్ని నిలిపివేశారు. మడగావ్ నగరానికి సమీపంలో మాజోర్డ్ అన్న ఒక పల్లెలో దామోదర మావ్జో స్వగృహం వున్నది. ఇప్పటికీ తను అక్కడే నివసిస్తున్నాడు.

దామోదర మావ్జో 1944లో గోవాలోని ఒక గౌడ సారస్వత అవిభక్త కుటుంబంలో జన్మించాడు. అతడి తల్లి నిరక్షరాస్యురాలు. కాని, ఆమెలో ఒక కథల కణజముండేది. కొడుకు దామోదరును ఎంతగానో ప్రేమించే ఆ తల్లి రకరకాల కథలు చెప్పేది. ఆ కథలు ముఖ్యంగా జానపద మూలానికి సంబంధించినవై వుండేవి. అతని తల్లికి కథలు చెప్పడంలోనూ, అలాగే కథలు వినడంలోనూ చాలా ఆసక్తి వుండేది. బాలుడు దామోదర్ తన యింటిలోవున్న ఈసోప్ నీతి కథలు, అక్బర్–బీర్బల్ కథలు, అరేబియన్ నైట్స్ కథల పుస్తకాలలోని కథలను తన తల్లి ఎదుట చదువుతుండేవాడు. ఈ కారణంతో తల్లికి కథలు చెప్పే నైపుణ్యం పెరిగింది. దామోదర్ తండ్రి ఎక్కువగా చదివినవాడు కాదు. వ్యాపారంలోని జంఝాటంలో తనకు చదవడానికి సమయం కూడ లభించేది కాదు. కాని తండ్రి కథల పుస్తకాలను కొని యింటిలో వుంచేవాడు. ఆ కారణంతో ఇంటి నిండా ఎన్నో పుస్తకాలు వుండేవి. తన తల్లికి ఆ కథలను చదివి చెప్పే నెపంతో క్రమంగా దామోదర్‌లో కథలను గురించిన ఆకర్షణ ఎక్కువైంది. ఒకమారు తను అనారోగ్యంతో పడక చేరినపుడు సమయం కడపడానికి తండ్రి 'బాల రామాయణం', 'బాల మహాభారతం' పుస్తకాలను కొనితెచ్చి అతనితో వాటిని చదవమని అన్నాడు. ఆ రెండు పుస్తకాలను దామోదర్ ఒక నూరు మార్లైనా చదివివుంటాడట. ఈ విధంగా బాల్యంలోనే కథలు చెప్పే, కథలు వినే అభిరుచిని పెంచుకొన్నాడు.

దామోదర్ ప్రాథమిక శిక్షణ మార్జోడ్‌లోనే జరిగింది. హైస్కూల్ శిక్షణకు మడ్గావ్‌లోని 'న్యూ ఎరా' హైస్కూలు చేరాడు. తను అక్కడున్న స్కూలు గ్రంథాలయంలోని పుస్తకాల రాశిని చూచి ఉప్పొంగిపోయాడు. స్కూలు గ్రంథాలయంలో వున్న శరత్‌చంద్ర చటర్జీ, రవీంద్రనాథ్ టాగూర్, ప్రేమచంద్, మరాఠీ రచయిత నా.సి. ఫడకె, వి.ఎస్. ఖండేకర్, పు.ల.దేశపాండె లాంటి రచయితల రచనలు చదివి దామోదర్ చాలా ప్రభావితుడయ్యాడు. దామోదర్ 12 ఏళ్ళ వయసులో తన తండ్రిని పోగొట్టుకొన్నాడు. ఇంటి బాధ్యత తన తల్లి చూచుకొనేది. అయినా కిరాణా కొట్టు వ్యాపారం, ఇంటి పనులలో తల్లికి సహాయంగా వుండేవాడు.

ఒక సమయంలో తాను చదువుతున్న తరగతి పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు కూడ చదవమని తల్లి కొడుకును ప్రోత్సహించేది. కాని దామోదర్ తండ్రి చనిపోయిన మీదట కథలు, నవలలు చదవడానికి తల్లి తన కొడుకును వదలలేదు. దానికి కారణమూ వుండేది. అతడికి స్కూలు పరీక్షలలో భాషా శాస్త్రంలో మంచి మార్కులు వచ్చేవి. ఇతర విషయాలలో మార్కులు అంతంత మాత్రమే. ఇలాగైతే కుమారుడి భవిష్యత్తు చీకటైపోతుందని భావించిన తల్లి క్లాసు పుస్తకాలు తప్ప ఇతర పుస్తకాలు చదువకూడదని నిబంధన వేసినది. కాని కథలు, నవలలు చదవడంలో వున్న రుచి అనుభవించిన దామోదర్ పాఠ్య పుస్తకాల మధ్య కథ, నవలల పుస్తకాలను వుంచుకొని చదువుతూ ఒక మారు తల్లి కళ్ళలో పడ్డాడు. స్కూలులో నిర్బంధంగా పోర్చుగీసు భాష చదవాల్సివచ్చేది. ద్వితీయ భాషగా మరాఠి చదివే అవకాశం

లభించింది. మరాఠీ, హిందీ భాషల సాహిత్యం విరివిగా లభిస్తున్నందున పోర్చుగీసు భాష నిర్బంధమున్నా మరాఠీ, హిందీ భాషలపై అభిమానం పెంచుకొన్నాడు. దామోదర్ 14 ఏళ్ళ వయసులో వున్నపుడు అధ్యాపకుడు ఒక విషయం యిచ్చి వ్యాసం వ్రాయమన్నాడు. ఆ వ్యాసం వ్రాసి చూపినపుడు **'నువ్వు మరాఠి భాషలో బాగా వ్రాస్తావు. నీలో మంచి రచయిత అయ్యే లక్షణాలు వున్నాయి. ఇలాగే ముందుకు పో,'** అని ఆశీర్వదించారు. ఆ గురువుగారి ఆశీర్వాదం దామోదర్ పాలిట అమృతవాణి అయినది. ఆ ఉపాధ్యాయుడి మాటలే అతడికి దారి దివ్వె అయినది. మాస్టారు చెప్పిన మార్గం పట్టిన దామోదర్‌ను ఇపుడు దేశం లోని అత్యున్నత సాహిత్య పురస్కారం అతడిని వరించింది.

1961 లో ఎస్.ఎస్.సి (మెట్రిక్) పరీక్ష ఉత్తీర్ణుడైన దామోదర్ బొంబాయిలోని పోద్దార్ కాలేజిలో పి.యు.సి. అలాగే బి.కాం. డిగ్రీని గడించాడు. కాలేజి చదువు సమయంలో బొంబాయిలో నాలుగేళ్ళు వున్నపుడు బొంబాయిలోని గోవా ప్రజలను ఒకచోట చేర్చి గోవా విముక్తి కోసం చేసిన పోరాటంలో పాల్గొన్నాడు. అప్పటివరకు కొంకణి భాషలో రచయితలున్నారు, ఆ భాషలో పుస్తకాలు ప్రకటింప బడుతున్నాయని దామోదర్‌కు తెలియదు. కొంకణి భాష ఆచార్య పురుషుడనిపించుకొన్న రఘునాథ వర్దె వాలావలీకర్ ఆ సమయంలో బొంబాయిలో భాషా పరిశోధన చేస్తూ సాహిత్య కృషిలో లీనమై వున్నారు. అతని ప్రభావం దామోదర్‌పై పడడంతో కొంకణిభాషలో చిన్న చిన్న కథలు వ్రాయడం ప్రారంభించాడు. అవి ఆ కాలంలో వస్తున్న వార, మాస పత్రికల్లో ప్రకటింపబడేవి. వాటికి పాఠకులనుండి మంచి ప్రతిక్రియ రాసాగింది.

అదే సమయానికి దామోదర్ తన చదువు ముగించి యింటి వ్యాపారం కొనసాగించడానికి మాడ్గోవ్ రావాల్సి పడింది. అతను నివసిస్తున్న ఊరిలో క్రిస్టియన్ల సంఖ్య ఎక్కువ. వారి యింటి చుట్టు ప్రక్కలవారు, దుకాణానికి వచ్చే గ్రాహకులు, స్నేహితులు అందరూ చాలామటుకు క్రిస్టియన్లు అయినందున వారు మాట్లాడే మాటల శైలి దామోదర్ సాహిత్య రచనలకు ప్రాణం పోసింది. కథలకు విషయాలు కూడ ఇలా వచ్చిపోయే గ్రాహకుల ద్వారానే లభించేది. గోవా కొంకణి క్రిస్టియన్ సమాజాన్ని అత్యంత అద్భుతంగా ప్రతినిధించే సూక్ష్మ చిత్రాన్ని దామోదర్ తన సాహిత్య కృతులలో సృజించగలిగారు. దామోదర్ తన కథలలో క్రిస్టియన్ల మాటలు, వారి సంస్కృతిని ఎంత ఆప్యాయమానంగా రూపిస్తారంటే వీరు జన్మతః కాథలిక్ సంప్రదాయంలో జన్మించినవారేమో ననిపిస్తుంది. గోవాలోని కొంకణి క్రైస్తవుల జీవితాన్ని దామోదర్ తన కథలు, నవలలో చిత్రించినట్టు ఇతరులెవరూ చిత్రించలేదని కొంకణి పాఠకుల అభిమతం. మార్గోడ్ రైల్వే స్టేషన్ వెనుకే దామోదర్ మావ్జో కిరాణ కొట్టు వుండేది. ఉదయం తొమ్మిది గంటలకు దుకాణానికి వచ్చాడంటే అంగడి తలుపులు వేసి ఇల్లు చేరడం రాత్రి తొమ్మిది గంటలకే. వీటి మధ్య తన కథలకు విషయాలు లభించేవి. కథా రచన రాత్రి రెండు గంటలవరకు జరిగేది. ప్రారంభించిన ప్రతి ఒక కథా ఒకే వూపులో ముగించేవాడట దామోదర్!

దామోదర్ తన మొదటి కథ 'తూ వచూం నాకా,' (నువ్వు వెళ్ళకు) 1963–64 ల మధ్య వ్రాశారు. ఆ కథ 'నవెం గోయ్' అన్న పత్రికలో ప్రకటింపబడింది. ఆ కథకు ఎంత మంచి ప్రతిక్రియ వచ్చిందంటే దానిని Do not go away అన్న పేరుతో ఆ కాలంలో వస్తున్న Eves Weeklyలో ప్రకటింపబడింది. దామోదర్‌గారి మొదటి కథా సంకలనం 'గాంథన' 1971లో ప్రకటింపబడింది. ఇప్పటివరకు 'జాగరణం, రుమడపూల, భురగిం మగేలి తీ, చిత్ తరంగి అన్న ఐదు కథా సంపుటాలు ప్రకటించబడ్డాయి.

ఇప్పటివరకు ప్రకటించబడిన వారి ప్రముఖ నవలలంటే 'కార్మెలీన, సునామి సైమన, ఏక అశిల్లో బాబులో, జీవ దీవ్ కాయ్ చా మారూయ అన్నవి. వారి 'కార్మెలీన' నవలకు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. ఈ నవల హిందీ, మరాఠి, కన్నడ, బంగాలి, తములు. ఇంగ్లీషు, తమిళ, ఒడియా, మైథిలి మొదలైన భాషలకు అనువదింపబడింది.

దామోదర్ మావ్జో కథలు, నవలల్లో గోవాలోని అన్ని వర్గాల వాస్తవ జీవితాల కథలు తెరచుకోబడుతాయి. గోవా జన జీవితంలోని సంఘర్షణలు, సంభ్రమాలు చిత్రించబడ్డాయి. అక్కడి సామాజిక జీవితంలోని వ్యాకులతలు, మార్పులు చాలా బాగా అభివ్యక్తీకరించ బడ్డాయి. 'కార్మెలీన' నవలలో తన భవిష్యత్తును రూపించుకోవడానికి విదేశాలకు వెళ్ళిన ఒక స్త్రీ లైంగిక అత్యాచారాలకు లోనయ్యే దురంతచిత్రాన్ని పాఠకుల ముందు వుంచుతారు దామోదర్. దామోదర్ మావ్జో సాహిత్యం జాత్యాతీతం, ధర్మాతీతంలాంటి మనోభావాలపై నిలిచి వున్నది. దామోదర్ మావ్జో సూద్, ఓ మారియా, ఆలీశా, శిటూ, ఎనిమి అన్న కొంకణి భాష చిత్రాలకు చిత్ర కథలు, మాటలు వ్రాశారు.

దామోదర్ మావ్జో నాలుగు గోడల మధ్య కూర్చొని తన కల్పనా లోకంతో కథలు వ్రాసే రకం కాదు. తను వర్తమానంలో జరిగే స్థితి గతులను వ్యాఖ్యానిస్తూ వాటికి స్పందిస్తూ తన రచనలను చేస్తారు. 'మన సాహిత్యం వేరు వేరు భాషలకు అనువాదం చేయబడాలి. మనమూ ఇతర భాషలలో వచ్చిన సాహిత్యం చదవాలి. అపుడే మనం ఎక్కడున్నామని అర్థమవుతుంద'ని అంటారు దామోదర్ మావ్జో.

(కృష్ణారావ్ గారి వ్యాసం ఆధారంగా)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (13) UGC Care List Approved Journals
హైదరాబాద్ మే : 2022

బండారం కథలు – 6

# కుంజీ

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



"ఆ చెట్టు నాదే" అంటూ పరిగెత్తింది కమల. నాడు నేల మసకవేళ. వెన్నెల కాస్తున్నా మబ్బు అడ్డం వచ్చి మసక మసకగానే కనబడుతున్నది. కమల వెనుక "పువ్వు అందరిది" అంటూ విజయ, రాధ పరిగెత్తారు. కమల పువ్వు తెంపటానికి చెయి చాచి కొమ్మ వంచబోయింది. అంతే ముల్లు గీరుకున్నది. ముళ్ళు గీరితే గాని అది రేణి చెట్లని తెలియలేదు. మసక చీకట్లో చెట్టు కనిపిస్తున్నది గాని ఏ చెట్టో తెలియటంలేదు. పైగా రేణిచెట్టు ఎత్తు పెరిగింది. సౌదుమట్టి తరచుగా కొమ్మల మీద పడి పూలవలె భ్రమపెడుతున్నది. కమల ఆ చీకట్లో కనబడీ కనబడక తంగెడు చెట్టని భ్రమించింది. బతుకమ్మ పండుగదినాలు. తంగెడు పువ్వు కోసం చీకటి తేలిపోకముందే అందరూ కంచెలమీద పడుతారు. చలికాలం మొదలవటం వల్ల గడ్డి, అలం మీద మంచులో తడిసి ఇగంతో స్పర్శ తప్పుతున్నది. మెడకూ, తలకూ అరికంట్లం కట్టుకున్నా చలి తాకుతున్నది. పెద్ద బతుకమ్మ పేర్చటానికి తంగెడు పువ్వు ఎంత దొరికినా తక్కువే. ఎంత తెంపుకొస్తే అంత గొప్ప. పండుగొచ్చిందంటే చాలు పడుచువాళ్లంతా పోటీ పడతారు. పువ్వుకోసం వేట. కమల అయిదుగురు దోస్తులతో వచ్చింది. తెల్లారితే పువ్వు దొరకదని మసకచీకటయినా ఆరాటం.

"మబ్బు మోసం చేసిందే" కమల మాటలకు రాధ అడ్డమొచ్చింది. "మబ్బు మోసం చేస్తదా? మనుసులే మోసం జేస్తరు". "మబ్బో, వెన్నెలో, మనుసులో, చెట్లో ఎవలైతేంది మోసం చేసెతందుకు" వాళ్లలోనే వచ్చినా చడీచప్పుడు గాకుండా సరస్వతి అనసూర్యలు గుట్టుగా వెళ్ళి పువ్వు తెంపి తట్టలో నింపుతున్నారు.

వాళ్లు అయిదుగురూ దోస్తులే అయినా వీళ్లిద్దరిది విడిజట్టు. వీళ్లిద్దరి కాపురాలు కొంచెం నయం. అత్తగారింట్లో కలవరపెట్టేంత పెద్ద సమస్యలు లేవు. ఇద్దరి మొగుళ్లు కొంచెం సర్దుకుపోయే రకం. విజయ, రాధల కాపురాల్లో కలతలున్నాయి. వ్యవసాయ కుటుంబాలు. బండచాకిరీ. ఇంటికాడ తప్పదు. సేను పనీ తప్పదు. మీదికెల్లి అత్త సాధింపులు. శ్రుతి మించినప్పుడు మొగుళ్ల బుజ్జగింపులుండటం వల్ల కాపురాలు అటో ఇటో నడుస్తున్నాయి. ఎటొచ్చి కమలదే, పాపం కన్నీటి గాథ. అత్తముందు కూచోగూడదు. ఎదురుపడితే లేచి నిలబడాలి. అత్తముందు నవ్వగూడదు. నవ్వొచ్చినా ఆపుకోవాలి. తిట్లూ, తప్పులూ, శాపనార్థాలు కావలసినన్ని. అయినా కమల చాలా ఓపిక పట్టింది. మొగడు అమ్మ ముందు నోరు తెరువడు. తప్పులేకున్నా అత్త తిట్లు భరించలేక మొగున్ని నిలదీసింది. **"నోట్లె నాలుక లేనోనివి, తప్పును తప్పనలేనోనివి ఎందుకు పెండ్లి జేసుకున్నవు"** అన్నది. అనుడే గాదు చెయ్యిపట్టి సమాధానం చెప్పమని లాగింది. అంతే అత్త రెచ్చగొట్టింది. రెచ్చిపోయి వంగబెట్టి వీపుల ఇష్టమున్నట్లు కొట్టాడు. అత్త ఒగ్రుతునే ఉంది. అంతటితో ఆగక పటకారు తెచ్చి నాలుకకు పట్టి లాగాడు. మొగుడు అట్లా ఉంటే ఏ భార్యయినా ఎట్లా కాపురం జేస్తుంది? కమలకు ఉండాలనిపించలేదు. ఐదు కిలోమీటర్లే గదా ఏడ్చుకుంటూ తల్లిగారింటికొచ్చేసింది. రెండేండ్లయింది. అత్తగారింటినుంచి ఎవరూ రాలేదు. తోలుకపోలేదు. కాపురం కల్లోలమయింది. అయినా కమల గుండెధైర్యం కోల్పోలేదు. కన్నీళ్లు అణుచుకొని కాలం గడుపుతున్నది. లోపల మాత్రం మగడు ఆంజనేయులు మీద కోపం మరుగుతున్నది.

**"ఇది కచ్చితంగా తంగెడు చెట్టే. గుత్తులు గుత్తులు పువ్వు"** అరిచింది రాధ. అందరూ అటు పరుగెత్తారు. పువ్వుమడలు ఇరిచి తట్టలోకేస్తున్నారు. తెల్లవారుతుంది. చంద్రుడు వెళ్లిపోతున్నాడు. మబ్బులు వెళ్లిపోయాయి. చెట్లూ, పూలు, ముండ్లూ అన్నీ కనిపిస్తున్నాయి. గబగబా తట్టలు నింపుకుంటుంటే అవతల చెట్టు దగ్గరికి ఒక మగమనిషి పరిగెత్తుకుంటూ వచ్చాడు. కమల అటు చూసింది. అనుకున్నట్టే విజయ, రాధ అటు చూశారు. ఆంజనేయులు. కమల భర్త. ఫర్లాంగు దూరంలో మరికొందరు చెట్ల చుట్టూ ఉన్నారు. స్పష్టంగా కనబడుతున్నది. ఎర్రదాలు పడుతున్నది.

"పొయ్యి మాట్లాడించవే" ఒత్తిడి చేశారు స్నేహితులు. కమలకేమీ తోచలేదు. ఆలోచించే సమయం లేదు. దూరంగా ఉన్నవాళ్లు ఇటువైపు

వొస్తే ఆ అవకాశమూ ఉండదు. వాళ్లిద్దరి చేతులు పట్టుకొని కమల అడుగులు వేస్తున్నది. ఆంజనేయులు పూలు తెంపటంలో మునిగిపోయాడు. దగ్గరకు వెళ్లినపుడు గాజుల సప్పుడుకు తలెత్తాడు. ఎదురుగా కమల. ఆమె స్నేహితులు.

**"ఇగ రావా, తోల్కపోవా? పెండ్లాం అక్కరలేదా?"** అడిగింది కమల.

**"కావాలె. ఎందుకొద్దు"**

**"మరి ఎందుకురాలే. నేను ఎప్పుడు యాదికి రాలేదా?"**

**"ఎందుకు రాలే. మావొచ్చినవు" "మరెందుకు రాలే"**

**"మా అమ్మ..."**

**"అట్ల కాదు బావా, అమ్మంటవు, దాని కాపురం సంగతి అడిగితె అమ్మంటవు. తోల్కపోయి మంచిగ సంసారం జేసుకో"** అని సముదాయించబోయారు. ఆంజనేయులు మాట్లాడలేదు. గట్టిగ అడిగారు.

మళ్ళా **"అమ్మ... ఏమంటదో".**

**"అట్ల గాదు బావా, ఒక్కటి జెప్పు కమలంటే ఇష్టమా కాదా?"**

**"ఇష్టమే..."**

**"ఇంకేంది. పండగెల్లంగనే వొచ్చి తోల్కపో"**

**"అమ్మ...."** సమయం లేదు. దూరంగా కలకలం వినిపిస్తుంది.

**"ఎక్కడి అమ్మ పిచ్చోడు. ప్రతిదానికీ అమ్మ అంటాడు అనుకున్నారు".**

**"అమ్మ అనెటోనివి అమ్మ జెప్తనే ఇనోటోనివి 'నన్నెందుకు జేసుకున్నవు. నా బతుకు నాశనం జేసినవు. నలుగురు మెచ్చుతరా నీ మాట, అందరు గిట్లనే జేస్తుండ్రా"**.

**"నేనేమంటన్న. కాదంటన్ననా?".**

**"కాదనవు – ఔననవు. తోల్కపోయెతందుకు ఎప్పుడొస్తవో చెప్పు".** కమల ఒత్తిడి చేస్తుండగానే మిగతా ఇద్దరు అక్కడికి వచ్చారు. అయిదుగురూ అదే మాట. ఒత్తిడి పెరిగింది. ఆంజనేయులుకేం చెప్పాలో తోచలేదు. **"అ...మ్మ"** అనబోయాడు. అంతే అయిదుగురూ ఆంజనేయులును పట్టుకున్నారు. అరికంటాలు ఇప్పి చేతులు వెనకకు కట్టారు. గుంజకపోయినా కొద్దీ నడుస్తున్నాడు.

తంగెడు పువ్వు తట్టలతో పాటు ఆంజనేయులును తోలుకొని కమలావాళ్ళు పల్లెలో అడుగుపెట్టారు. బజార్లో నడుస్తుంటే కొందరు ఆడవాళ్లు ఆంజనేయులును తలా ఒక మాట అంటున్నారు. కమల ఇంట్లోకి తీసుకెళ్ళి ఆంజనేయులును అర్రలో తోలారు. ఊహించని సంఘటనకు ఊళ్లో అందరూ ఆశ్చర్యపోయారు. కొద్దిసేపట్లో **'ఆడవాళ్లు ఆంజనేయులును ఎత్తుకపోయారట'** అని బందారం ఊరంతా ప్రచారమైపోయింది. ముసలమ్మలు ముక్కున వేలేసుకున్నరు. ముసలయ్యలు బ్రహ్మంగారు చెప్పిందంతా ....పోకుండా జరుగుతున్నదన్నారు. **'నలుగురిని కూచుండబెట్టి మాట్లాడుకోవాలె గని నలుగుట్లె ఈ తలవంపులేందని'** పెద్దమనుషులన్నారు. పెళ్లాల్ని కాపురాలకు తోల్కరాని అమ్మచాటు మొగుళ్లు భయపడ్డారు. కొత్త సంఘటన. రెండూర్లకే గాదు పదూర్లకు పాకింది.

బతుకమ్మ పండుగకు ఊర్లెకొచ్చిన ఆడపడుచులందరూ కమల ఇంటికొచ్చి ఆంజనేయులును చూసిపోతున్నారు. పెద్ద వయసు ఆడవాళ్లు బుద్ధిగ కాపురం చేసుకొమ్మని సలహాలు చెప్పిపోతున్నారు. వచ్చేవాళ్లతో పోయేవాళ్లతో కమలవాళ్ల ఇల్లు సందడి సందడిగా ఉంది. ఆంజనేయులు మౌనంగా చూస్తున్నాడు, వింటున్నాడు.

రాక రాక అల్లుడొచ్చాడని రాచమర్యాదలు జరుగుతున్నాయి. బట్టలిచ్చారు. స్నానం చేశాడు. ఏండ్ల తర్వాత కొత్తల్లుడు సేవలు పొందుతున్నాడు. బతుకమ్మ పండుగకు చేసిన పులిహోర, పెరుగన్నం, పెసరపప్పు, మలీదముద్దలు పట్టిపట్టి తినిపిస్తున్నారు. కాదనకుండా పట్టినన్ని తింటున్నాడు ఆంజనేయులు.

పండుగ పూర్తయింది. అర్రలో పడక. అందరి భోజనాలు పూర్తయిన తర్వాత కమల అర్రలోకి చేరింది. ముచ్చట పెట్టింది. ముచ్చట చేసింది. ఆంజనేయులు ఏదీ కాననలేదు. ముచ్చట పడ్డట్టుగా కలిసిపోయాడు. మరుసటిరోజు దసరా. మాంసం పాల్లేస్తే తెచ్చి వండిపెట్టారు. కమల మరింత ప్రేమగా వడ్డిస్తున్నది. కమల దోస్తులు బావతో పరాచికాలాడుతున్నారు. ఆంజనేయులకు కూడా నచ్చుతున్నది. పుట్టినిల్లు కంటే అత్తగారిల్లే బాగుంది. కమల మరింత బాగనిపిస్తుంది. కాపురం తియ్యగా ఉందనిపించింది.

వారం రోజులు గడిచింది. ఆంజనేయులు వాళ్లింట్లో కొలిమి పనులు కూడా చేస్తున్నాడు. బందారం తలవటంలేదు. రావటంలేదు. కమల సంతోషపడుతున్నది. తన దోస్తులు అత్తవారింటికెళ్లారు. తన మొగుడు అత్తింటికే వచ్చాడు. చక్కపడిందనుకుంటున్న కాపురంలోకి పదోరోజు ఆంజనేయులు అమ్మ వచ్చింది. ఊరికే రాలేదు. ఊరి పెద్దలను, కులపెద్దలను పదిమందినేసుకొని పంచాయితికి వచ్చింది. కమల కలవరపడింది. ఆంజనేయులు మౌనం ఆందోళన పెట్టింది.

కమలాయపల్లి కచీరు కాడ పంచాయితి. ఆ వూరి పెద్దలు, ఈ వూరి పెద్దలు కూచున్నారు. ముసలమ్మలు, ముసలయ్యలూ అక్కడికి చేరారు. ఆడవాళ్లు కొందరు చెట్టుచాటు నుంచి వింటున్నారు. యువకులు అటూ ఇటూ అలజడిగా తిరుగుతున్నారు. రాయిచెట్టు మీద పావురాలు కూడా గుమిగూడినట్టున్నాయి.

పెద్దమనుషులు ముందుగా కమల తండ్రినడిగారు. తన పెద్ద కూతురంటే తనకు ప్రేమ ఎక్కువ. శక్తికి మించి ఖర్చు పెట్టి పెళ్లి జరిపించాడు. వెయ్యినూటపదహార్లు కట్నం. రేడియో, అలుక కట్నం కింద గడియారం, ఇంకా రకరకాల కట్నాలు పెట్టి కూతురు కాపురం మంచిగుండాలనీ ఘనంగా పెళ్లి చేశాడు. అత్త హింసలు

తెలిసినంతవరకు ఏకరువు పెట్టాడు. కమల కాపురం నిలబెట్టుమని ప్రాధేయపడ్డాడు. జరిగిన సంఘటనకు తప్పుకాయటానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు.

కమలనడిగారు. అత్తగారింట్లో ఎన్నిరకాల తిట్లు పడిందో, చిత్రహింసలు పడిందో చెప్పింది. బీడీలు చుట్టి, చేను పనులకు వెళ్ళి పైసలు తెచ్చి సంసారంల పెట్టినా కూచుని తింటున్నావని అత్త ఆడిపోసుకొంటుంది. కూచొని తినేది అత్తనే కాని తాను కాదని, రెక్కల కష్టం చేసి తింటున్నానని చెప్పింది. మొగుడు కొట్టినా, పట్కారుతో నాల్క గుంజినా భరించినానని చెప్పింది. కాపురం నిలబెట్టుకోవటానికే తన దోస్తులు, తాను ఆంజనేయులును తీసుకొచ్చినట్లు చెప్పింది. తప్పులు విచారించి తన కాపురం నిలబెట్టుమని బతిమిలాడింది.

ఆంజనేయులు తల్లి రామవ్వ నడిగారు. **"అత్తను గౌరవించటం దానికి తెలువదన్నది. ఆడది ఎట్లుండాలో, అణిగిమనిగి ఎట్ల పడుండాలో కోడలు అత్తనెట్ల కొలవాలో చెప్పింది. అత్తిల్లు వదలివచ్చిన దానికి, మొగన్ని కంచెనుంచి ఎత్తుకొచ్చిన దానికి కాపురం జేసే ఇగురం లేదు. కనుక తప్పుకు ఐదునూర్ల జుర్మాన గట్టి అత్త కాళు ్లమొక్కి, మొగనికాళ్లు మొక్కి ముక్కు నేలకు రాస్తే కాపురానికి తోలుకపోత"** అన్నది రామవ్వ.

పెద్దమనుషులు ఆంజనేయులు నడిగారు.

**"అమ్మ చెప్పినట్టు ఇంటనంటె కాపురానికి తీస్కపోతం"** ఒక్క మాటతోటి ముగించాడు. పెద్దమనుషుల్లో కమలాయపల్లి గ్రామపెద్ద అడిగాడు– **"ఆంజనేయులూ, కమల మంచిదేనా..." "మంచిదే".**

**"కమల మీ అమ్మ మీద చెపుతున్నది, కోడలును తిప్పల పెడుతున్నదని అంటుంది... నిజమేనా....?"**

ఆంజనేయులు బదులు చెప్పలేదు.

**"మాట్లాడకపోతే కమల చెప్పిందే నమ్మాల్సివస్తది"** అన్నాడు. అయినా ఆంజనేయులు మాట్లాడలేదు. అక్కడున్న అందరికీ అర్థమైంది. తప్పు అత్తదేనని. రామవ్వ కావాలనే కాపురంలో చిచ్చు పెడుతున్నదని కొడుకు మనసు కూడా విరిచి తప్పులకు కారణమవుతున్నదని.

బందారం నుంచి వచ్చిన పెద్దమనిషి ఆంజనేయులు నడిగాడు **"ఆంజనేయులూ, కమల మంచిదే అంటున్నవు. ఇష్టమే అంటున్నవు. వారం పది రోజులనుంచి అత్తగారింట్ల ఉంటున్నవు. పని కూడా షురు జేసినవు. చూస్తుంటే నీకు కమలతోని సంసారం ఇష్టమేననిపిస్తున్నది. ఇగ – అమ్మతోనే వస్తుంది పంచాయతి. జగడం. నీ కాపురం సక్కగ నడవాల్నంటే అమ్మను సంజాయించుకోవాలె. భార్యను బందారం తోలుకొచ్చుకోవాలె. సరేనా...".**

**"అమ్మ ఎట్లంటే అట్ల"**

**"పోనీ బందారంల అయితె అమ్మను అనలేవు. ఆపలేవు. మల్ల పంచాయితైతదనుకుంటే ఆ పనేదో ఈన్నే జేస్కో. ఈన్నే ఉండు. కాపురం నిలవడుతది. ఉంటవా అత్తగారింట్ల..."** ఆంజనేయులు మౌనం.

**"ఎందరు యాడికి పోతలేరు, బతుకుతలేరు. ఈ ఊరైనా మనూరే. ఉంటనంటే ఊ... అను"** ఆంజనేయులు మాట్లాడలేదు. ఆ పెద్దమనిషి రామవ్వతో అన్నాడు. **"రామవ్వా, ఆంజనేయులు ఈ ఊర్లనే ఉంటడు. యాదైతేంది? కొడుకు కోడలు మంచిగుంటె చాలు. ఉండనా మరి?"**

**"నాదేముంది? వానిష్టం. వాని బుద్ధి, వాని కాపురం"**

**"ఆంజనేయులూ, అమ్మ కూడా నీ ఇష్టమంటున్నది. కొన్ని రోజులు జూడు"**

మళ్లా మౌనం.

**"చెప్పు. ఎంతసేపు కూసుంటవిట్ల. ఉంటనని చెప్పు"**

**"అమ్మ ఎట్లంటె అట్లనే"**

అంతే. మౌనం బద్దలైంది. కమల పెద్దలవైపు తిరిగింది. అందరికి వినబడేలా గర్జించింది.

**"గింతమంది జెప్పినా అమ్మ ఎట్లంటె గట్ల అంటడు. గిన్నిసార్లు గిన్నితీర్ల జెప్పినా అమ్మ ఇష్టం అంటడు. నా దగ్గరుంటె నా మాట. అమ్మ ముందు అమ్మ మాట. ఆయన ఇష్టముండదా. ఒక్క సారనడు. ఈనెతోని సంసారం ఇసుకతోని తాడుపేనిననట్టు. నాకో అమ్ముంది. నేను కాపురం కోసమొస్తలేనా...? అత్తంటె అమ్మతోని సమానం. అమ్మోలిగ జూస్త. నాకు తెలువదా. జగడమొస్తె ఎవల తప్పుంటె వాళ్లననాలె. అనడు. ఇంక పొగేస్తడు. కాపురం కోసం నిలబడనోడు, కాపురం కోసం మాట్లాడనోడు నాకెందుకు? నాకొద్దు. నాకు మొగడు కావాలె. మొగని లెక్క వుండేదుంటే ఆయనెతోనొస్త. ఆమె కొడుకుగనే ఉంటనంటె నాకు కలవది. అమ్మను అమ్మ లెక్క జూడాలె. పెండ్లాన్ని పెండ్లం లెక్క జూడాలె. నాకు మొగని కాపురం కావాలె. అత్త కాపురం వొద్దేవొద్దు. వాళ్ల అమ్మ జెప్తేనే కాపురం జేస్తనంటే ఆయెనే వాళ్లమ్మతోనె ఎల్లని. నాకేం జిక్రీదే లేదు".**

పెద్దమనుషులకేం చెప్పాలో తోచలేదు. కమల మాటల్లో న్యాయం కనిపించింది. నిర్ణయం ఆంజనేయుని మీద పెట్టారు. అందరూ చూస్తున్నారు. పక్షులు పరిక్షిస్తున్నాయి. ఆంజనేయులు అమ్మ దగ్గరికెళ్లాడు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2022

## సాధన పంచకమ్

**వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిర: పక్ష: సమాశ్రీయతాం
దుస్తర్కా త్సువిరమ్యతాం శృతిమతస్తర్కోకను సంధీయతామ్।
బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వ: పరిత్యజ్యతాం
దేహేకహమ్మతి రుజ్ఝ్యతాం బుధజనైర్వాద: పరిత్యజ్యతామ్॥**


**తాత్పర్యం :** 1. వేదాంత వాక్యములను చక్కగా విచారణ చేయవలెను. 2. వేదాంతము లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. 3. చెడు తర్కమును విడనాడ వలెను. 4. వేద సమ్మతమైన తర్కమునే (యుక్తినే) అనుసరిపవలెను. 5. నేను బ్రహ్మమునే ఐ ఉన్నాను అని చక్కగా భావన చేయవలెను. 6. ఎప్పటికప్పుడు గర్వమును త్యజింపవలెను. 7. దేహమే నేను అనెడు భావమును విడిచిపెట్టవలెను. 8. బుధజనులతో వాదించుటను మానివేయవలెను.


### వివరణ

**2. శ్రుతి శిర: పక్ష: సమాశ్రీయతామ్ –**

శ్రుతి అంటే వేదం. శ్రుతిశిరస్ అంటే ఉపనిషత్తులు. వీటికే వేదాంతం అని పేరు. ఇట్టి వేదాంతం లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. భగవంతుడు అనంతుడు అని సహేతుకంగా వివరించింది వేదజ్ఞానం. వేదాంతం ప్రతిపాదించేది అద్వైతం. ఉపనిషత్ ప్రతిపాదితమైన అద్వైత జ్ఞానాన్ని ముముక్షువు ఆశ్రయించాలి. భగవంతుడు అనంతుడైనప్పుడు అతనికన్నా అన్యమైన రెండవ వస్తువు లేదు. కనుక అద్వైతానికి భిన్నమైన వాదన తర్కానికి నిలువదు. అందుచేత గురువు వద్ద వేదాంతవాక్యాన్ని విచారణ చేసిన పిదప ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే సాధకుడు ఆశ్రయింపవలెను.

## సత్సంగం





### భయం – మృత్యుభయం

భయమంటే ఏమిటి? అదీ ఒక భావమే. ఆత్మకి భిన్నంగా ఏదైనా ఉంటే, భయముంటుంది. ఆత్మకి భిన్నంగా దేనినైనా చూసేదెవరు? మొదట అహంకారముదయించి, తనకి బయట ఉన్నట్టు వస్తుజాలాన్ని చూస్తుంది. అహంకారముదయించకపోతే, ఉండేదల్లా ఆత్మే – అప్పుడు, బాహ్యంగా ఏమీ ఉండదు. తనకి బయట ఏవో ఉన్నాయంటే, లోపల ద్రష్ట ఎవరో ఉన్నట్టే అర్థం. ఆ లోపలి వానిని అన్వేషిస్తే సందేహమూ, భయమూ పోతాయి. భయమే కాదు. అహంకారాన్ని చుట్టుకొని ఉన్న అన్ని భావాలూ దానితో బాటే పోతాయి.

మృత్యుభయం నీకెప్పుడు కలుగుతుంది? నీవు గాఢనిద్రలో ఉన్నప్పుడు నీకు శరీరధ్యాస ఉండదు. అప్పుడా భయముంటదా? నీవు పూర్తిగా మేల్కొని, నీ శరీరాన్ని, ప్రపంచాన్ని చూస్తున్నప్పుడే ఆ భయం ఉ ంటుంది. కలలు లేని నిద్రలో వలె నీవు వీటిని చూడకుండా, కేవలం ఆత్మగానే ఉన్నప్పుడు ఏ భయమూ నిన్ను సోకలేదు. ఏదో పోతుందన్న భావమే భయాన్ని కలిగిస్తుంది. ఆ పోయేదేమిటి అని విచారిస్తే అది నీ శరీరం కాదనీ, అందులో పనిచేసే మనస్సనీ తేలుతుంది. తనకి ఎల్లప్పుడు ఎరుక ఉండేట్టయితే, ఈ రోగ పీడితమైన శరీరాన్ని, దాని వల్ల కలిగే ఇబ్బందినీ వదిలించుకోవటానికి అందరూ సిద్ధమే. పోతుందని అతను భయపడేది ఈ ఎరుకని, ఈ చైతన్యాన్ని. జీవించి ఉండటమంటే, సదా ఎరుక కలిగి ఉండటమే. అదే వారి ఆత్మ. ఇదంటేనే అందరికీ ప్రీతి. అటువంటప్పుడు ఈ దేహంలో ఉంటూనే ఆ శుద్ధ చైతన్యాన్నే పట్టుకొని ఎందుకుండకూడదు? అన్ని భయాలనీ ఎందుకు వదిలించుకోకూడదు?

నిద్రపోతే, ఆ స్థితిలో ఏమీ చేయలేవు. కాని మేల్కొని ఉండగానే ఏ భావమూ లేకుండేట్టు ప్రయత్నించు. నిద్రగురించి ఆలోచించట మెందుకు? అది కూడా ఒక భావమే కదా? మేల్కొని ఉండగా ఏ భావమూ లేకుండా ఉండగలిగితే చాలు. నీకు నిద్రవస్తే, అంతకు పూర్వమున్న స్థితే మేల్కొనగానే కొనసాగుతుంది. నిద్రపోయే ముందు ఎక్కడ విడిచి పెట్టావో అక్కడనుంచే మళ్ళీ అందుకుంటుంది. ఏదో ఒక వ్యాపకం గురించి ఆలోచనలుంటే, నిద్ర కూడా ఉంటుంది. నిద్రా, ఆలోచనా రెంటికీ పరస్పర సంబంధముంది. మనమతిగా నిద్రపోకూడదు, అసలు నిద్రే లేకుండానూ ఉండకూడదు. మితంగా నిద్రపోవాలి. అతిగా లేకుండా చేసుకోవాలంటే ఏ ఆలోచనలు గాని, చలనం గాని లేకుండా, మితంగా సాత్త్వికమైన ఆహారం తీసుకోవాలి. భౌతికమైన పనిని కూడా ఎక్కువ చేయకూడదు. ఆలోచనలనీ, ఆహారాన్నీ, వ్యాపకాలనీ నిగ్రహించిన కొద్దీ నిద్రని కూడా నిగ్రహించవచ్చు. కాని, గీతలో చెప్పినట్టు సాధకునికి అన్నిటిలోను "మితం" అవసరం.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2022

సాహిత్యం ~ వైజ్ఞానిక మూల్యాంకనం

# భూమ్యాకర్షణ గాణాపత్యం

**డా. సాగి కమలాకర శర్మ**, ఫోన్ : 9704 227744

సాహితీవేత్తలే కాకుండా భారతీయ ధర్మంలో ఉన్న ప్రతివారూ కూడా ప్రారంభించిన కార్యక్రమాలకు విఘ్నం కలుగకుండా ముందుగా గణాధిపతిని ప్రార్థించడం సంప్రదాయంగా పెట్టుకుంటారు. ఎటువంటి పూజలైనా గణపతి ప్రార్థనతోనే ప్రారంభం. చాలామంది రచయితలు తమ కావ్యాలను, శతకాలను లంబోదరుని కీర్తించి ప్రారంభించడం కనిపిస్తూనే ఉంది.

చూడటానికి ఒక ప్రత్యేక దృష్టితో ఏనుగు ముఖం, ఏకదంతం, నర శరీరం, అతి పెద్ద పొట్టతో కూడుకున్న ఈ గణపతిని గూర్చి వేదంలో కూడా ప్రస్తావన కనిపిస్తుంది. "గణానాంత్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనా ముఖమశ్రవస్తమమ్ । జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణ స్పత ఆనస్శృణ్వన్నూతిభిస్సీదసాదనమ్" అనే మంత్రంతో గణపతిని ప్రార్థిస్తుంటారు. ఇక "శుక్లాంబర ధరం విష్ణుం .." అనే శ్లోకాల వంటివి వేలాదులు అందరికీ తెలిసినవే.

ఈ ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకొని గణపతి, లంబోదరుడు, శివ పార్వతుల కుమారుడు, కుమారస్వామికి అగ్రజుడు, చంద్రుని చేత ప్రభావితుడు వంటి అంశాలన్నీ పురాణ కథల రీత్యా వేరు వేరుగా చెప్పబడుతూనే ఉన్నాయి. భాద్రపద శుద్ధ చవితి నాడు గణపతి చవితిని చేసుకుని మట్టి బొమ్మతో గణపతికి పూజ చేసి 9 రోజుల తర్వాత మళ్ళీ జలంలో కలిపే సంప్రదాయ పరమైన పూజా విధానమూ అందరికీ తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా గాణాపత్య భావన విస్తరించి అనేక రూపాలలో గణపతిని అలంకరించి, దేవాలయాలలో ప్రతిష్ఠించి పూజలు చేస్తూనే ఉన్నారు. ఈ గణపతి గూర్చిన వైజ్ఞానిక విషయాలు మనకు అర్థమైతే, మూలాలను అర్థం చేసుకుంటే విఘ్న నాయకుని పూజలు, సాహిత్యం, విధానం అంతా ఒక క్రమ పద్ధతిలో తెలుస్తుంది.

గత మాసంలోని వ్యాసం 'భూ విజ్ఞానమే శైవం' ప్రకారం శివుడు, శంకరునికి ప్రతీక మన భూమి మాత్రమే. శివలింగానికే మన ఆరాధన. భూతత్వాన్ని ఆరాధించడం, భూమి ఉద్భవించిన రోజును పండుగ జరుపుకోవడం వంటివానిని ప్రస్తావించుకున్నాం.

మానవుడే కాకుండా సమస్త జీవరాశులు కూడా ఈ భూమిని ఆశ్రయించి ఉండగలుగుతున్నాయి. భూమి చుట్టూ ఒక ప్రత్యేకమైన వాతావరణం కూడా మనకు ఉంది. ఓజోన్ పొర అనేది భూమికి ఉన్న ప్రత్యేకమైన రక్షణ కవచం. దీని లోపల మాత్రమే వాతావరణం ఏర్పడుతుంది. వీటికన్నింటికీ కారణం భూమిలో ఉన్న ఒక ప్రత్యేకమైన ఆకర్షణ శక్తి మాత్రమే. విశ్వంలో ఉన్న ప్రతి అణువుకు ఒక ఆకర్షణ శక్తి ఉంటుంది. ఇంత పెద్ద భూమికి కూడా ఇటువంటి ఆకర్షణ శక్తి పెరిగినప్పుడు మాత్రమే ఇది జీవోత్పత్తికి హేతువైంది.



లోకానికి ఆధారంగా మారింది. భూమికి సరియైన ఆకర్షణ శక్తి లేకుంటే అన్ని గ్రహాల మాదిరిగానే దీనిపై వాతావరణం ఏర్పడేది కాదు. జీవి జీవించే శక్తి ఉండేది కాదు. మనిషికి బరువు ఉండటం మొదలైనవన్నీ ఈ శక్తివల్ల మాత్రమే మనకు సంభవిస్తున్నాయి. ఈ ఆకర్షణ శక్తిని గమనించిన మన ఋషులు (పూర్వపు సైంటిస్టులు) ఇదే లేకుంటే జీవి మనుగడ లేదని అర్థం చేసుకుని దానిని పూజించడం ప్రారంభించారు. భూమికి ఉన్న ఆకర్షణ శక్తి ఏర్పడిన విధానం, మూలాలను అధ్యయనం చేసి దానిని సాహిత్య రూపంలో, కథా రూపంలో, మంత్రాల రూపంలో పొందుపరిచారు. ఈ శక్తే మనకు ఆధారం కావడం వల్ల గణపతిని మూలాధార స్థితుడైన వాడు అని కీర్తించారు. భూమి మూలాలనుండి విస్తరించి భూమి అంతటా వ్యాపించిన కనిపించని ఆ శక్తికి మనం 'భూమ్యాకర్షణ శక్తి లేదా గురుత్వ ఆకర్షణ శక్తి' అని పేరు పెట్టుకున్నాం. ఈ శక్తికి దైవీకృత నామాలే విఘ్నేశ్వరుడు, లంబోదరుడు, గజాననుడు, గణపతి మొదలైనవి.

పౌరాణిక కథనం ప్రకారం గణపతిని మొదటగా తయారు చేసింది పార్వతి. పిండి బొమ్మకు ప్రాణం పోసింది. ఈ పిల్లవాని తల తీసివేసినవాడు శివుడు. మళ్ళీ బలమైన శక్తిని తెచ్చి పెట్టినవాడు కూడా శివుడే. ఆ తర్వాత మరోసారి చంద్రుని వ్యతిరేక దృష్టి వల్ల ప్రాణం పోగొట్టుకుని మళ్ళీ బ్రతికినవాడు గణపతి. ఇలా రెండుసార్లు

ప్రాణం పోగొట్టుకోవడం, భారీకాయం, ఎలుక వాహనం వంటివి మనకు ఆశ్చర్యాన్ని కలిగించక మానవు. కానీ భారతీయ సంప్రదాయంలో అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తొలిపూజలు గ్రహిస్తున్న ఏకైక దైవం గణపతి మాత్రమే.

ఇక్కడ భూమి శివుడైతే, భూమిపై లోక జీవనానికి అవసరమైన ఆకర్షణశక్తికి మూలమైన వాడు గణపతి. మనకు ఇక్కడ జీవించడానికి అవకాశం ఇచ్చి, మనని కాపాడే శక్తికి ప్రార్థన చేయడమే గణపతి ప్రార్థన. శక్తికి ప్రార్థన చేసే సంప్రదాయం ఉన్న భారతీయులకు ఈ విశిష్ట శక్తికి పూజ చేయడం అనివార్యంగా తోచింది.

పాంచభౌతిక ప్రకృతి శక్తి పార్వతికి సంకేతమైతే, ఆ ప్రకృతి ఆపాదింపజేసిన ఆకర్షణ శక్తి ఇంత పెద్ద భూమికి సరిపోలేదు. అందుకే మొదటిసారి గణపతి హతుడైనట్లు పురాణ గాథ. ఆ తర్వాత బలమైన శక్తి భూమి సమకూర్చుకున్నది అనే విషయాన్ని చెప్పడమే గజాసురుని తలను తీసుకువచ్చి గణపతి శిరస్సుకు అంటించడం వంటి విషయం. భూమికి ఒక ప్రత్యేకమైన బలం ఏర్పడితేనే వాతావరణం సరియైన విధంగా ఉంటుంది. భూమికి అప్పటికే రెండు సార్లు తీవ్రమైన దెబ్బ తాకింది. ఒకసారి కుజుడు విడిపోయి మరో గ్రహంగా మారితే, మరోసారి చంద్రుడు విడిపోయి (క్షీరసాగర మథనం) ఉపగ్రహంగా మారడం జరిగింది. ఉత్తరం వైపున ఉన్న భూభాగం విడిపోవడం వల్ల ఉత్తరం వైపు బలీయమైన ఆకర్షణ శక్తి అవసరమైంది. ఇక్కడ ఏనుగు బలమైన శక్తికి ప్రతీక.

జలమయంగా ఉన్న భూమి తన చుట్టూ తాను తిరుగుతున్నప్పుడు మధ్యలోకి మాస్ (ముఖ్య పదార్థం) అంతా చేరి, ధ్రువాల వద్ద కొంత ఒత్తబడినట్లుగా తయారైందని సైన్స్‌లో మనం చదువుతున్న విషయమే. దానివల్ల మనకు భూమి వృత్తాకారంలో కాకుండా, గోళంగా మారి, మధ్యభాగంలో ఉబ్బెత్తుగా ఉండి రెండు ధ్రువాలు ఒత్తబడి కనిపిస్తాయి. ఇప్పుడు ఉత్తరంవైపు తల, మధ్యలో పొట్ట, దక్షిణం వైపు కాళ్ళు ఉన్నట్లుగా గణపతిని మనం ఊహిస్తే కూడా కనిపించేది ఈ భూమి యొక్క రూపమే. దానిలోని శక్తి స్వరూపమే. అంటే భూమి రూపానికి ప్రతీకగా మనకు గణపతి రూపం కనిపిస్తుంది. ఆరాధించేది, ఆనందించేది ఆ శక్తిని మాత్రమే. కేవలం రూపం కాదు, రూపం వెనుక ఉన్న తత్త్వాన్ని. ఈ అవగాహన లేనప్పుడు మనకు అన్నీ అపోహలే, అవాస్తవాలే.

గణపతికి సంబంధించిన విషయంలో చతుర్థి, భాద్రపద మాసం విశేషంగా సూచిస్తుంటారు. అయితే భాద్రపద శుద్ధ చతుర్థి నాడు విఘ్నాధిపత్యాన్ని సాధించిన గణపతి, చంద్రుని ప్రభావంతో రెండోసారి మరణించింది కూడా అదే రోజు నాడే. శివుని తలపై ఉన్న చంద్రుడు వికటంగా నవ్వాడు అని కథనం. ఇక్కడ వికటంగా నవ్వడం, గణపతి మరణించడం సాధారణ దృష్టిలో హాస్యాస్పదాలే. అందుకే ఈ అంశాన్ని కూడా ప్రత్యేక పరిశీలనలో గమనించాలి.

భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూ శక్తి సముపార్జించుకుంటుంది. భూమి చుట్టూ తిరిగేవాడు చంద్రుడు. భూమికి ఉపగ్రహంగా చంద్రుడు ఉండడం వల్ల శివుని మనం చంద్రశేఖరునిగా నామకరణం చేసుకున్నాం. అయితే భాద్రపద మాసంలో భూమిలోని గురుత్వ ఆకర్షణ శక్తికి, చంద్రునిలోని ఆకర్షణ శక్తికి మధ్యలో కొంత ఇబ్బంది ఏర్పడుతుందనేది ఇక్కడి సూచన. ఈ శక్తుల మధ్యలో వచ్చే మార్పులను సమన్వయం చేసుకోవడానికి మనం భౌతిక జీవనంలో, ఆహార విహార నియమాల్లో కొంత జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. అందుకే ఇప్పటికీ తెలుగు ప్రాంతాల్లో భాద్రపద మాసం వివాహాదులు, గృహ ప్రవేశాలకు నిషిద్ధమాసం. ఈ సమయంలో మనస్సు, శరీరం పూర్తిగా శక్తిని సంపాదించుకోవాలనే భావంతో ఈ నియమం మనకు ఏర్పాటు చేయడం జరిగింది. వినాయక నవరాత్రులు ఏర్పాటు వెనుక కూడా ఇదే తత్త్వం. మట్టితో గణపతి బొమ్మను ఏర్పాటు చేయడం వెనుక మట్టికి, భూమికి మనం సాన్నిహిత్యంగా ఉండి, భూమి ఆకర్షణ శక్తిని పూర్తిగా పొందుతూ ఉండాలనే భావన. పత్రిపూజ కూడా భూమికి సాన్నిహిత్యాన్నే ప్రత్యేకంగా చెపుతుంది.

చంద్రాకర్షణ, భూమ్యాకర్షణ విషయంలో భాద్రపద మాసంలో వచ్చే లోపాలను విశ్లేషించేందుకు ఇంకా ప్రస్తుత వైజ్ఞానిక నిరూపణలు అవసరం ఉన్నాయి. కాని సాహిత్యం దీనిని ఎప్పుడో గుర్తించి, నిత్య ధర్మంలో దానిని మార్చి, ధర్మశాస్త్రంగా రూపొందించి పూజలు, ఆరాధనల రూపంగా తీర్చిదిద్దింది. ఇదీ భారతీయ వైజ్ఞానిక ధర్మం. అందుకే చంద్రుని చూడకూడదు అనే నియమాన్ని పాటిస్తూ, చంద్ర దర్శనం అసాధ్యం కావడం వల్ల గణపతి ఆరాధన తప్పనిసరి చేయడం జరిగింది. మనస్సును శక్తికి అనుసంధానించి, కేంద్రీకరించే మార్గాలను చెప్పడం జరిగింది.

మంత్రశాస్త్రం ప్రకారం కూడా గణపతి పూజకు సంబంధించి ప్రత్యేకమైన మంత్రం ఉంటుంది. **"ఓం శ్రీం హ్రీం క్లీం గ్లౌం గం గణపతయే వరవరద సర్వజనంమే వశమానయ స్వాహా"** అనేది గణపతి ప్రత్యేక మంత్రం. ఇతరమైన మంత్రాలున్నా ఈ మంత్రానికే విశిష్టత ఉంది. ఈ మంత్రం చివరలో **"సర్వజనంమే వశమానయ"** అనే పదానికి మనం సామాన్యార్థం స్వీకరిస్తాం. ప్రత్యేకార్థంలో గమనిస్తే **"ఈ భూమి మీద ఉన్న సమస్త జీవరాశులనూ, పంచ భూతాలనూ తన శక్తితో వశం చేసుకోవాలనే"** ఆకాంక్ష కనిపిస్తుంది. ఇంకా గం... బీజాక్షరానికి ఆకర్షణ అని అర్థం. ఇంగ్లీషులోనూ గం.. అర్థం అంటుకునే సాధనమే. లం... బీజాక్షరం పృథ్వీబీజం అని మంత్రశాస్త్రం నిర్దేశిస్తుంది. అందుకే గణపతి మంత్రంలో ఇతర బీజాక్షరాలను వదిలిపెడితే "గ్లౌం, గం" అక్షరాలు ఆకర్షణ బీజాలుగా కనిపిస్తుంటాయి. గణపతిలో గకారం, లంబోదర శబ్దంలోని లం.. మొదలైనవన్నీ ఇటువంటి అంశాలను తెలియజేస్తున్నవే.

గణపతి ఉపనిషత్తులో కూడా... అవ పశ్చాత్తాత్, అవ పురస్తాత్, అవ దక్షిణాత్తాత్, అవోత్తరాత్తాత్... అంటూ అన్ని వైపులా ఊర్ధ్వం అధోభాగాలన్నింటా నీవే నిండి ఉన్నావు అని చెప్పడం వెనుక ఈ ఆకర్షణశక్తికి చేసే ప్రార్థన మాత్రమే కనిపిస్తుంది. "త్వం జ్ఞానమయో విజ్ఞానమయోసి" అనే ప్రార్థన కూడా వైజ్ఞానిక భావనకు అందే శక్తి స్వరూపం గణపతి అని సూచించడమే. ఈ ఆకర్షణ శక్తి అంతటా ఉందనే భావాన్ని సూచించి ... "త్వం భూమిరాపోకనలోకనిలోనభః" అనే మాట ప్రకారం పంచభూతాలలోనూ ఈ ఆకర్షణ శక్తి నిండి ఉన్నదని సూచన చేయడం జరిగింది.


భూమి ఒక ఆధారాన్ని మాత్రమే చేసుకుని తన చుట్టూ తాను తిరుగుతుంది. ఏనుగుకు రెండు దంతాలున్నా, ఆ రెండింటి అవసరం లేని కారణంగా ఒక దంతాన్ని తీసివేసి, ఒక దంతం అనేది మధ్యలో ఆధారభూతమైన గరిమనాభిగా మనం గుర్తించవచ్చు. అందుకే గజాననుడు ఏకదంతుడుగా కీర్తించబడుతున్నాడు. గణపతి అష్టోత్తర శతనామాల్లో కూడా అతని జ్ఞాన స్వరూపుని గానే గుర్తిస్తూ 'జ్యాయసే' నమః అంటూ ప్రత్యేకంగా గుర్తించడం జరిగింది. ఈ 'జ్యా' అనేది ఈ భూమి ఉత్తర ధ్రువం నుండి దక్షిణ ధ్రువానికి మధ్యలో కనిపించే నాభి అని అర్థం చేసుకోవడమే సరియైనది. ఈ జ్యాను అనుసరించే మనకు గణిత శాస్త్రంలో జ్యామితి (జ్యామెట్రీ) అనేది ఏర్పడుతుంది.

భూమి చుట్టూ ఉండే పాంచభౌతిక శక్తి పార్వతి లేదా లలిత లేదా లక్ష్మీ స్వరూపంగా మనం భావిస్తే, భూమిని ఆవరించి ఉన్న విద్యుదయస్కాంత తరంగ శక్తి కుమార స్వామి అవుతున్నాడు. అందువల్ల ఈ కుమారుని తరంగ రూపానికి సంకేతంగా పామును ప్రత్యేకంగా గమనిస్తుంటాం. శివుని మెడలోని పాములు, గణపతి నడుముకు కట్టుకునే పాము, నాగ యజ్ఞోపవీతాలు అన్నీ కూడా ఈ తరంగ శక్తికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

భూమిలోని కలుగుల్లో నిరంతరం నివసించే ఎలుకనే భూమి ఆకర్షణ శక్తికి వాహనం అవుతుంది. ఎలుక అత్యంత వేగానికి, ఇంద్రియాల కదలికలకు సంకేతమైంది. అందుకే వాటిపై ఆధిపత్యం ఉండాలంటే గణపతి ఆరాధన, ఆకర్షణ శక్తి ఉపాసన తప్పనిసరి అని సూచన చేయడం మూషిక వాహనానికి సంకేతమైన కథ.

భాద్రపద మాసంలోని ఆహార నియమాలు కూడా జాగ్రత్త అని సూచన చేస్తుంది ధర్మశాస్త్రం. గణపతి అధికంగా ఆహారం తీసుకొని ఉండడం వల్ల వినాయక చవితినాడే అతనికి పొట్ట పగిలి మరణం సంభవించింది. అందువల్ల ఉడుకబెట్టిన రవ్వ వంటి వానిని, స్వల్పంగా స్వీకరించడమే ఆహార లక్షణంగా గుర్తించారు. అంతకన్నా ఎక్కువ స్వీకరిస్తే అనారోగ్యం పాలు కాక తప్పదు అని కథాపరమైన హెచ్చరిక మనకు కనిపిస్తుంది. అందుకే ఆహార నియమాలతో సహా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటే గణపతి మనకు ఆనందాన్ని ఇచ్చేవాడు అవుతాడు. లేకుంటే 'విఘ్న కర్త' అవుతుంటాడు.






ఆకాశంలోనూ వినాయక చవితి రోజున సూర్యోదయం కన్నా ముందు, తూర్పు ఆకాశంలో తప్పనిసరిగా వినాయకుణ్ణి పోలిన నక్షత్రాల గుంపు కనిపిస్తుంది. వాటికి వినాయక నక్షత్రాలనే మనవారు నామకరణం చేసినారు. ఎలుక సమూహ నక్షత్రాలు కూడా ఇక్కడ కనిపించడం విశేషం.

భారతీయమైన దైవారాధనలన్నీ మూల శక్తులను ఆరాధన చేసేవే. ఆ విషయ అవగాహన, విశ్లేషణకు మనం దూరమైనప్పటినుండే మనది విజ్ఞాన భారతం నుండి అజ్ఞాన భారతానికి మారిపోయి రోజు రోజుకూ భయంతో ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది.


ఒక విజ్ఞానమయమైన అంశం ముందు పరిశీలించబడి, సాధారణ వ్యక్తులకు దానిని అందిద్దామనకున్న పూర్వపు ఋషులైన సాహితీవేత్తలు వాటికి దైవత్వాన్ని ఆపాదించి, కథలు రాసి మూలాలను చెప్పడానికి ప్రయత్నించారు. అంతే కాకుండా ఆ యా రోజుల్లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా సూచనలు చేశారు. వాటిని అన్నింటినీ మంత్రశాస్త్ర, పురాణ, ధర్మశాస్త్ర, స్మృతుల రూపంలో నిక్షిప్తం చేసినారు. ఈనాడు వాటి ప్రభావంతోనే, మూలాలు పూర్తిగా అర్థమైనా, కాకున్నా మనమంతా అనుసరిస్తున్నాం. మూలం అర్థమైతే, మరింత జాగ్రత్తగా ఆ శక్తులను ఆహ్వానిస్తూ శరణాగతి పొందుతాం.

విషయంలోని మూలం ఒకటే అయినా నేడు అనేకమంది కవులు అనేక రూపాల్లో గణపతిని కీర్తించి, అభివర్ణించడం వెనుక ఉన్న తత్త్వం మాత్రం భూమికి ఉన్న గొప్ప శక్తి మాత్రమే. అది రచయితకు కూడా తెలియవచ్చు, తెలియకపోవచ్చు. కాని సాహిత్యం వెనుక ఉన్న వైజ్ఞానిక మూల బలాన్ని మనం అధ్యయనం చేయకపోతే మన భవిష్యత్తు ఇంకా భయంకరంగా మారి, పరుల చేతిలో మనం చిక్కి అజ్ఞాన భారతం వైపు ప్రయాణం చేసే అవకాశం ఉంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2022

# పద్యమనోహరం - 30

**గన్నమరాజు గిరిజామనోహర్ బాబు**
వరంగల్, ఫోన్ : 994 901 3448



**"చదువన్నేర్తురు పూరుషుల్వలెనె శాస్త్రంబుల్ పఠింపించుచో
నదమన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారముల్ నేర్పుచో
నుదితోత్సాహము తోడ నేలగలరీ యుర్విన్ ప్రతిష్ఠించుచో
ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్"**

సుప్రసిద్ధ రచయిత స్వర్గీయ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి పేరు స్మరించగానే స్ఫురించే వాక్యం **"ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్"** అనేది ఒకటి. ఇది చిలకమర్తి వారు రచించిన 'ప్రసన్న యాదవము' అనే నాటకంలో సత్యాభామాదేవి పరాక్రమ ప్రశస్తి సందర్భంగా చెప్పిన పద్యంలోని ఈ పాదం తెలుగువారి నోట నానిన గొప్ప పంక్తి.

మహిళల శక్తియుక్తులను ఎప్పుడూ తక్కువ అంచనా వేయరాదన్న భావంతో **"స్త్రీలను విద్యావంతులను చేస్తే వారి శక్తి ఎంత గొప్పగా రాణిస్తుందంటే పురుషులతో సమానంగా సమస్త విద్యలను, సకల శాస్త్రాలను కూడా ఆపోశనం పట్టగలరు. వాళ్ళకు శస్త్రాస్త్ర విద్యలను నేర్పిస్తే ఎంతటి బలవంతులైన శత్రుసేనలనైనా వాళ్ళను ఓడించి విజయం సాధించగలరు. పరిపాలకులుగా అవకాశమిస్తే ఈ భూమండలాన్నైనా గొప్పనైన ఉత్సాహంతో పాలించి రాణించగలరు. స్త్రీలకు ఏ విద్యయైనా సులభంగానే నేర్చుకునే శక్తి ఉంటుంది. వాళ్ళు నేర్వలేని విద్య ఏదీ యీ లోకంలో లేదు"** అంటూ చెప్పిన ఈ పద్యం కేవలం కథవరకు మాత్రమే పరిమితమైనది కాదు. ఇది సార్వకాలిక సత్యాన్ని ఆవిష్కరించిన పద్యం.



సంఘసంస్కర్త, "కళాప్రపూర్ణ" జాతీయకవి

శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం

జననం : 26-9-1867 నిర్యాణం : 17-6-1946

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగ దూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియ గట్టి.

ది. 23-4-1907న వందేమాతరం ఉద్యమ సందర్భంగా శ్రీ బిపిన్ చంద్రపాల్ సభలో అధ్యక్షులు చిలకమర్తి ఆశువుగాచెప్పిన జాతీయ భావస్ఫోరకమైన తొలి పద్యమిది.

శ్రీ చిలకమర్తి ఖండవల్లిలో జన్మించి, వీరవాసరం, నర్సాపురంలలో చదువుకున్నారు. రాజమహేంద్రి కార్యక్షేత్ర మయింది. కాకరపర్రులో కాలం చేశారు నవల, నాటకం, ప్రహసనం మున్నగు పలు ప్రక్రియలలో 96 గ్రంథాలు రచించారు గాంధీజీకి పూర్వమే1907 ఫిబ్రవరిలో దళితులకోసం " రామమోహన పాఠశాల " ను నర్సాపురంలో అగ్రవర్ణాల ఇబ్బందులున్నా నిర్వహించారు. 1916 లో వయోజనులకోసం "వివేకానంద రాత్రిపాఠశాల" ను స్థాపించారు.

కీ.శే. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి పేరు తెలియని తెలుగు సాహితీ జిజ్ఞాసువులు సాధారణంగా కనిపించరు. కవిగా, నవలాకారునిగా, నాటకరచయితగా తెలుగునాట లబ్ధప్రతిష్ఠులైన చిలకమర్తి వారి గణపతి, హేమలత, రసపుత్ర విజయము వంటి నవలలు, గయోపాఖ్యానము వంటి నాటకాలు అనేక ప్రకంపనాలు సాహితీప్రపంచంలో ఘనమైన కీర్తినార్జించిన రచనలు. జన్మత:నే అంధత్వం ప్రాప్తించినా రచనారంగంలో మాత్రం సమాజానికి కొత్తచూపు నిచ్చే సామాజిక చింతనాశీలుడు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు. వారి కాలంలో దేశంలో జాతీయోద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులు. ఎందరెందరో స్వాతంత్ర్య పోరాట వీరులు దేశం కోసం ప్రాణత్యాగం చేసి బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరిస్తున్న సందర్భం. అందుకే తమ రచనల్లో అవకాశం ఎక్కడ వచ్చినా ఆ స్ఫూర్తిని నింపే విషయంలో చిలకమర్తివారు ఎప్పుడూ వెనకాడలేదు.

'నరకాసుర వధ' అనే నామాంతరం కలిగిన చిలకమర్తి వారి "ప్రసన్నయాదవం" నాటకంలో శ్రీకృష్ణుని ముఖత: ఈ మాటలు పలికించారు చిలకమర్తివారు. ఎందరెందరో వీరనారులు నాటి స్వాతంత్ర్యపోరాటంలో తమవంతుగా త్యాగాలు చేస్తూ స్ఫూర్తి నింపుతున్న విషయం స్ఫురింపచేస్తూ వారి ప్రతిభ ఎంతటి స్థాయిలో ఉంటుందో ఈ పద్యం వ్యక్తం చేస్తున్నది. విద్య కావచ్చు. రణరంగం కావచ్చు, పాలనారంగం కావచ్చు మహిళాశక్తి అసాధారణమని నిరూపించే సన్నివేశాలు మన చరిత్రలో కొల్లలు. అదే విషయాన్ని ధ్వనింపజేస్తూ ఈ పద్యరచన సాగింది. **"భరతఖండంబు చక్కని పాడియావు" "చెఱశాలల్ పృథుశాలలె"** వంటి పద్యాల సరసన నిలువదగిన గొప్ప పద్యంగా వెలిగిన ఇటువంటి పద్యరచన చేసిన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు నిత్యస్మరణీయులు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (21) హైదరాబాద్ మే : 2022

# నిజామాబాద్ జిల్లా శతక కవులు

**పెరుమల కైలాస్,** ఫోన్ : 85006 09578

లక్ష్మీనరసింహుడు వెలసిన పుణ్యక్షేత్రం నిజామాబాద్ జిల్లాలోని లింబాద్రిగుట్ట. ఆ స్వామి వెలసిన కొండనే తన పేరుగా మార్చుకున్న కవి ఎలగందుల లింబాద్రి. దైవభక్తితో పాటు దేశభక్తిని ప్రబోధిస్తూ రాసిన ఇతని శతకాలు అందరినీ ఆకట్టుకునే లలిత పద శైలిలో కొనసాగడం ప్రతి పద్యంలో మనం గమనించవచ్చు.

కవి లింబాద్రి రచించిన శ్రీ నింబాద్రి నరసింహ శతకము, భక్తితత్త్వం, నీతి మార్గాలలో సాగింది. ఇక భరతమాత శతకము దేశభక్తి ప్రధానమైనది.

108 సీస పద్యాలలో 'భవిత సన్మార్గదర్శిని భరతమాత, భరత కులపుత్ర సకల సౌభాగ్య దాత' అన్న ద్విపాద మకుటంతో సాగిన భరతమాత శతకమున ఎక్కడ ఏ పద్యమును స్పృశించినా దేశభక్తి ఒకవైపు, దైవభక్తి మరోవైపు అందులోనూ మానవ సంబంధ బాంధవ్యాలు పలకరించే తీరు మన మనసులను పులకరింప చేస్తాయి.

సాహిత్యంలోనే కాక సంగీత, చిత్రకళ, నటన, యోగవిద్యలో ప్రావీణ్యం కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి గంట్యాల ప్రసాద్ నిజామాబాద్ పట్టణానికి చెందినవారు. వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయుడు. ప్రవృత్తి సాహిత్య సృజన. ప్రముఖ కవి నంబి శ్రీధర రావు గారి వద్ద పద్యరచనలో మెళుకువలు నేర్చుకొని తన కవితా రచన ప్రారంభించాడు. ఘంటానాదము' కవితా సంకలనంతో కవి లోకంలో తొలి అడుగు వేసి జాగృతం చేసిన ఈ కవి 'ఓటరన్న' శతకంతో మలి అడుగు వేస్తూ హితోపదేశం చేశాడు.

అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన భారతదేశంలోని ఓటరు పరిపాలకులను నిర్ణయించే న్యాయాధికారి. ఓటరన్న మకుటంతో, ఆటవెలది ఛందస్సులో రాయబడిన 108 పద్యాలలో ఓటర్లతో రకరకాలుగా ఆడుకునే అతితెలివి నాయకులతో జాగ్రత్తగా ఉంటూ ఓటు విలువ తెలుసుకుని మెలగాలనే సందేశంతో ఈ శతక రచన సాగింది. చక్కని ఉదాహరణలతో, సముచిత దృష్టాంతాలతో మృదుమధురంగా పద్యాలు నడిచిన తీరు పాఠకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఈ ఓటరన్న శతకం ద్వారా కవిలోని సామాజిక స్పృహతో పాటు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.

రైతుల వ్యథలు, లంచ గొండితనము మరియు విధ్వంసాలు మొదలైన వాటి వల్ల జరిగే నష్టాన్ని తెలిపి వీటిని మార్చు ఆయుధము ఓటే అని చెప్పినారు. దేశ రక్షణ, స్వాతంత్ర్య సంరక్షణ చేయవలసిన బాధ్యతగా గల ఓటరు "బడుగు వారి చేతి బ్రహ్మాస్త్రమౌ" ఓటును ఆయుధముగా చేసుకొని ఓటు వేయమని కోరినారు.




వెంకన్న గారి జ్యోతి నిజామాబాద్ పట్టణానికి చెందినవారు. పుట్టింది మాత్రం పల్లెటూరులోనే. ఎం.ఏ, పిహెచ్.డి చేసిన జ్యోతి గారు ప్రస్తుతం తెలుగు ఉపాధ్యాయినిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పద్య రచన పై మక్కువ కలిగిన జ్యోతి గారు మొదటి ప్రయత్నంగా రచనకు పూనుకున్నారు. పల్లెలో జన్మించిన బిడ్డగా అక్కడి మట్టి వాసన పద్యాల పుష్పాలలో నింపి సాహిత్య లోకానికి కానుకగా ఇచ్చిన రచనే 'నా పల్లెటూరు'. పల్లెల్లోని అందచందాలు, ఆటపాటలు, ఆత్మీయానురాగాలు పల్లవించి పరిమళించేలా నా పల్లెటూరు మకుటంతో, 108 పద్యాల్లో పల్లెను గూర్చి అన్ని కోణాల్లో దర్శింపచేశారు. ఏ అంశాన్ని వదలలేదు. అతిశయోక్తులు లేకుండా సహజ స్వరూపంతో అన్ని పద్యాల్లోనూ స్వభావోక్తులను చిత్రించారు.

'అతిథుల భ్యాగతుల నెల్ల నాదరించి కడుపునిండ భోజనమున కమ్మనైన – ఊరగాయలు మీగడలూరు పెరుగు– ప్రమదలై వడ్డన మిడు నా పల్లెటూరు' అని అంటూ పల్లెటూరు అన్న ప్రదాత అని చెప్పినారు. నాటి ఆటపాటలన్నీ మొబై పోతున్నాయనీ, పల్లెల్లో కూడా 'నాగరికత' ముదిరిపోతుందనీ కొత్తగా వచ్చిన ఆటల్ని ఆదరిస్తూ వాటినైనా తాము ఆడడం మాని వృథా కాలక్షేపం చేస్తుంటే మన ఆరోగ్యం ఎలా వృద్ధి చెందుతుందని పిల్లల్ని పరోక్షంగా హెచ్చరించారు.

కౌడి రవీందర్ స్వగ్రామం నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలం ఎర్రపహాడ్. విద్యార్థి దశలోనే తెలుగు భాషపై మక్కువ పెంచుకున్న రవీందర్ తెలంగాణ ఉద్యమమే ప్రేరణగా రాసిన శతకం నా తెలంగాణ. దీనికంటే ముందే 2013లో నీలకంఠం శతకం ద్వారా తన కవిత్వ రచన ప్రారంభించాడు. బి.ఏ., బి.ఎడ్ పూర్తి చేసిన రవీందర్ ఛాత్రోపాధ్యాయుడిగా ఆధారాల సుందరంగా సద్విషయ మధురంగా ఆటవెలది ఛందస్సులో నీలకంఠ శతకాన్ని రచించాడు.

'నిక్కమైన మాట నీలకంఠ' అనే మకుటంతో రాసిన నీలకంఠ శతకంలో

**"తెలుగుభాష పలుక తేనియలొలికించు /**
**తెలుగు పద్యమన్న వెలుగులీను**
**తెలుగు కవుల గాంచ ధీనిధుల్ ప్రాప్తించు/**
**నిక్కమైన మాట నీలకంఠ"**

అంటూ తెలుగు భాషావైశిష్ట్యాన్ని ఒక డిగ్రీ విద్యార్థిగా తెలుపటం అభినందనీయం.

నీలకంఠ శతకాన్ని ఆటవెలది ఛందస్సులో రాస్తే నా తెలంగాణ శతకాన్ని 160 తేటగీతి పద్యాల్లో తేటతెల్లంగా చిత్రీకరించాడు. ఈ శతకానికి "గణ్య గుణకీర్తి నా తెలంగాణ ధాత్రి" అనేది మకుటం. సంపూర్ణమైన తెలంగాణ వాదాన్ని, తెలంగాణ చరిత్రను, తెలంగాణ సంస్కృతిని ఈ కావ్యంలో దర్శింపచేసిన కొడి రవీందర్ పల్లెకు ప్రాధాన్యత నిస్తూ "జనము లెల్లరు పలికెడు జానపదము" అని మొదలు పెట్టి "కడుపు కేడ్చే జనాల కడుపు నింపి పేదవారంటూ లేనట్టి పేరుతో తెలంగాణ వర్ధిల్లాలని చెప్పిన వరకు" ఆసాంతం కావ్యం ఘుమాళింపులు తెలంగాణ ప్రాంతమంతా వ్యాపించేటట్లు కవిత్వీకరించడం గొప్ప విషయం.

కవి మంద పీతాంబర్ విశ్రాంత స్టేట్ బ్యాంక్ ఉద్యోగి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట వాస్తవ్యుడు. స్థిర నివాసం కామారెడ్డి. వీరి తండ్రి మంద రాజన్న కూడా కవి. వారి ప్రభావము, ప్రోత్సాహం వలన విద్యార్థి దశలోనే కవితలను, పద్యాలను వ్రాయడం మొదలు పెట్టాడు. కాలేజీ చదివే రోజుల్లోనే కళాశాల వార్షిక సంచికలో ఇతడు రాసిన పద్యాలు ప్రచురింపబడ్డాయి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ లో చేరిన తర్వాత ఉద్యోగరీత్యా కవిత్వం పై దృష్టి సారించలేదు కానీ ఉద్యోగ విరమణ తరువాత అది కార్యరూపం దాల్చింది. పద్యం పై మంచి పట్టు ఉన్న ఇతడు అంతర్జాలంలో "సరదాకి చిరు కవిత" బ్లాగు ద్వారా తన కవితా రచన కొనసాగిస్తున్నారు. ఆకాశవాణి అంతర్జాల కార్యక్రమాలలో సమస్యాపూరణలు చేస్తూ విజ్ఞుల మెప్పు పొందాడు. ఇతడు ఇప్పటివరకు వివిధ ఛందస్సులలో దాదాపు 500 సమస్యలను పూరించాడు.

మంద పీతాంబర్ గారు 'మణుల మూట' అనే శతకాన్ని ఆటవెలది ఛందస్సులో రచించారు. ఇందులోని మకుటం "మాన్య వరుల మాట మణుల మూట". ఇందులోని పద్యాలన్నీ సామాజిక స్పృహతో రాసినవే. పద్యాలలోని మొదటి రెండు పాదాలు ఒక విషయాన్ని ప్రతిపాదిస్తాయి. మూడవ పాదంలో ప్రతిపాదించిన విషయాన్ని ఒక సామాన్య విషయంతో సమర్థించడం ఉంటుంది. నాల్గవ పాదం మకుటం. దాదాపు ఈ శతకమంతా ఈ పద్ధతిలోనే కొనసాగింది. వేమన రాసిన పద్యాలు అన్నీ ఈ కోవకు చెందినవే. దీనిని బట్టి వేమన ప్రభావం ఈ కవిపై ఉందని చెప్పవచ్చు. ఇందులో మొత్తం 120 మణులలాంటి పద్యాలున్నాయి.

ఈ శతకంలోని ఒక్కొక్క పద్యం ఏదో ఒక సందేశాన్ని ఇస్తుంది. పద్యాలన్నీ మణిపూసలే. సరళ పదాలతో సామాన్యులు కూడా చదవగలిగేలా శతకం అందించిన కవి అభినందనీయులు.

కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం, కళ్యాణి గ్రామం వాస్తవ్యులు అయ్యవారు మురళి. వీరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు సహాయకులుగా పని చేస్తున్నారు. మండల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు. ఉపాధ్యాయుడిగా తెలుగు భాష వికాసానికి పాటుపడుతూనే సాహిత్య రంగంలో ప్రవేశించి అనేక కవితలు, పద్యాలు రాశాడు. వీరి తండ్రి అయ్యవారు రామకృష్ణయ్య నటుడు, గాయకుడు. యక్షగానాల్లో వేషాలు వేసి, పాటలు పాడుతుండేవారు. వారి కళ్యాణి గ్రామంలో యక్షగానాలు భజనలు, నాటకాలు, చిరుతల రామాయణం చూడడం వల్ల వాటి ప్రభావం మురళి గారిపై పడింది.

ఇతని మొదటి శతకం "ఆత్మ రవళి". కవి ఈ శతకంలో ఒకే అంశానికి పరిమితం కాకుండా భిన్నమైన అంశాలను నిశితంగా పరిశీలించి తనలో కలిగిన అనుభూతులకు అక్షరరూపం ఇచ్చి అందమైన ఆటవెలది పద్యాలలో రచించాడు. ఇందులోని మకుటం 'అయ్యవారు మురళి ఆత్మ రవళి'. తెలుగు భాషోపాధ్యాయుడైన ఈతడు ఈ శతకంలో తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని విపులంగానే వర్ణించినాడు. ఆంగ్ల భాషా వ్యామోహం వల్ల తెలుగు భాష పూర్తిగా అంతరించి పోతుందేమోనన్న దిగులుతో..

**"తెలుగు భాష యిపుడు తెరమరుగవనుంది**
**మాతృభాష మీద మమత బెంచు**
**కన్నతల్లి వంటి కమ్మని భాషిది"**

అంటూ, అట్లాంటి అమ్మభాషను కాపాడు కోవాలని హితబోధ చేసినాడు.

**"కన్నతల్లి వంటి కమ్మని భాషిది".**

**"మధురమైన రుచికి మారు పేరె తెలుగు"**

**"అమ్మ భాష మనకుయమిత హాయిని గొల్పు"**

**"తెలుగు నీవు నేర్చి తేజంబునొందుమా"**

యని విశదపరిచారు. తెలుగు భాషను ప్రతిఒక్కరూ తప్పక ఆదరించాలని, అప్పుడే తెలుగు భాష కనుమరుగవదని ఆశించారు.

ఇంకా తెలుగు కవులు, రచయితలు, ప్రసిద్ధమైన కావ్యాలు, గ్రంథాలను గురించి విశేషంగా వివరిస్తూనే, గాంధీ వంటి మహనీయులు, కళాకారులు, చారిత్రక ప్రదేశాలను వర్ణించాడు. 150 పద్యాలు ఉన్న ఈ ఆత్మ రవళి శతకంలో కవి మురళి గారు 50కి పైగా వివిధ అంశాలను ప్రస్తావించడం విశేషం.

ఘనపురం దేవేందర్ తెలుగు కవిత్వానికి దొరికిన ఆణిముత్యం. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఘనపురం దేవేందర్ తెలుగు రాష్ట్రాలలో కవిగా సుపరిచితుడు, కవులందరికీ తలలోని నాలుక. రెండు దశాబ్దాలకు పైగా సాహితీ సంస్థలు స్థాపించి సాహిత్యాన్ని మోస్తున్న కవి. 'హరిదా రచయితల సంఘం' అధ్యక్షులు, 'తెలంగాణ రచయితల సంఘం' ఉపాధ్యక్షులు'. సాహిత్యంలో వచన కవిత, పద్య కవితలు, వ్యాసాలు, ప్రయోక్త ఇలా ఎన్నింటినో వ్రాస్తున్న సవ్యసాచి. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తెలుగుభాష ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దేవేందర్ గారు ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొన్న ఘనుడు.

దేవేందర్‌వి ఇంతవరకు వివిధ పత్రికల్లో అనేక వ్యాసాలు, కవితలు, పద్యాలు, కథనాలు అచ్చయ్యాయి. తిరుమల శ్రీనివాస్ ఆర్యతో కలిసి రాసిన నడుగు పిడుగులు, ఉద్యమ కవితాసంపుటి ఘన తెలంగాణ, సంగీత నృత్య రూపకాల సంపుటి సాహితీ స్వరాలు, పద్య కవిత్వం కవన ఘనుని శతకం ప్రచురింపబడిన ఇతని రచనలు.

'వినుము కవన ఘనుని విమల కవిత' అనే మకుటంతో చాలా పద్యాలు రాసినప్పటికి 128 పద్యాలతో శతకాన్ని ప్రచురించాడు. జీవ భాషలో, సరళమైన పదాలతో ఆటవెలది ఛందస్సులో కవి రాసిన ఈ పద్యాలు సాహితీ విందు చేస్తాయి. ఈ శతకం నీతి, భక్తి, వ్యాజస్తుతి, వేదాంతముల సంగమం. కవి ఈ శతకాన్ని ధీరులైన దేశ జవాన్లకు అంకితమిచ్చాడు. పలుకుబడులను ఉపయోగించి అద్భుతమైన భావాలను అందించాడు.

**"చింతపడుట యన్న వింత రోగమ్మది**
**కష్టకాలమందు నష్టపరుచు**
**చింత వీడినంత సంతనమ్ము మిగులు......"**

అంటూ చెప్పిన ఈ పద్యంలో పెంచడం వల్ల ప్రయోజనం ఏమీ లేదని అది మనకు నష్టాన్ని కలిగిస్తుందని చింతను వీడితేనే సంతోషం మిగులుతుంది అనే విషయాన్ని తెలిపాడు.

ఇంకొక పద్యంలో సత్యం యొక్క గొప్పతనాన్ని

**"సత్యవాణి విలువ నిత్యము దృఢమాను**
**విత్తవాణి విలువ చెత్త యౌను**
**నిజము కవచ మౌను నిరతము కాపాడు........"**

నిజము కవచంలాగా ఎల్లప్పుడూ మనల్ని కాపాడుతుందని సత్యం ప్రాధాన్యతను తెలిపాడు.

అలాగే తెలంగాణలో వ్యవహారంలో ఉండే తెలుగు, ఆంగ్లం, ఉర్దూ పదాలను మేళవించి 'మొగులు నేలు విభుడు చందమామ", అమ్మ గార్వమెంత యద్భుతమ్ము", పట్నమెల్లి చూడ పరేషాను మొదలాయే, కృషిని పెంచి చూడ ఖుషియే వరించదా", మొక్క నాటు



భాయి యొక్కటైనా, మంచితోడ దోస్తి మహిలోన గెలిపించు" "గోవు మూత్రమనిన గోల్డు నేడు" అంటూ చెప్పిన ఈ పద్యాలు చాలా సహజంగా ఉన్నాయి.

కవిగా పాఠకలోకానికి సుపరిచితులైన డా. కాసర్ల నరేష్ రావు నిజామాబాద్ జిల్లా భీమ్గల్ మండలం గడ్కోలు గ్రామవాసి. కవన కిరీటిగా పేరు పొందాడు. కవితా రచనలో రజతోత్సవాన్ని పూర్తి చేసుకున్నారు నరేష్‌గారు. వచన కవిత్వాన్ని ఇష్టపడతారు. మరి ఛందస్సులో కందం అంటేనే వీరికి అనుబంధం ఎక్కువ. ఈ కవి ఇప్పటివరకు పదుల సంఖ్యలో రచనలు చేశాడు. వాటిలో గుండె గాయాలు, లలిత తరంగాలు, కాలస్పర్శ, కాలగంధం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు–స్త్రీ, కాగడా, వానచుక్క శతకం రచనలు ముద్రణ పొందాయి. బాసర వాణీ శతకం, శబరిగిరీశ శతకం, లొంక రామన్న శతకము అముద్రితాలు. ఇందులో కాలస్పర్శ మీద శ్రీ సుంకరి గంగాధర్ పరిశోధన చేసి ఎం.ఫిల్ పట్టా పొందారు.

నరేష్ గారు మొత్తం నాలుగు శతకాలు రచించినప్పటికీ అందులో వానచుక్క శతకానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ శతక రచన కొనసాగిన తీరు పాఠకులను ఆశ్చర్యచకితులను చేస్తుంది. 2018 ఆగస్టు నెలలో ఏకధారగా కురిసిన వర్షం ఈ వానచుక్క శతకానికి ప్రేరణ. ఉదయం నుండి సాయంత్రం వరకు తెరిపి లేకుండా కురిసిన వానలో కవి లీనమయ్యాడు. ఆ ఆనందంలో అప్పటికప్పుడు తనలో కలిగిన భావాలను పద్యాలుగా మలిచి వాట్సాప్ గ్రూపులో పంపారు. ఆ పద్యాలను చూసిన మధురకవి వి.రామమూర్తి గారు శతకం వైపు ఆలోచించాలని చెప్పడంతో ఈ శతకం రూపుదిద్దుకుంది. అయితే ఈ శతకంలో ఉన్న పద్యాలు పని గట్టుకొని రాసినవి కాదు. వర్షం రాకతో ప్రారంభమైన ఈ పద్యాల ఝరి ఎండాకాలంలో ఎదురైన నీటి కష్టాల అలజడితో శతకం పూర్తయింది.

వానచుక్క శతకం కంటే ముందే కవి రాసిన మూడు భక్తి శతకాలు ఇంకా అప్పటికి అచ్చు కాలేదు. వీటిలో ఏది ముందు తేవాలి అన్న తర్జన భర్జనలు కవి కోరిక, దైవ సంకల్పంతో వానచుక్క శతకం

పాఠక లోకానికి చేరువైంది. బాసర సరస్వతిదేవియే ఈ శతకాన్ని తనతో వ్రాయిస్తుందని భక్తితో చెప్పుకున్నారు కవి కాసర్ల. కవి ఈ శతకాన్ని అన్నదాతకు అంకితమిచ్చాడు. వాన చుక్కలు భిన్న కోణాల్లో వ్యక్త పరచడంలో కవి ప్రతిభా, వ్యుత్పత్తులు ఎంతటివో మనకు తెలుస్తుంది. శతకం నిండా అలంకారాలు ఉండి, చదివిన కొద్దీ చెలిమిని తోడిన కలది నీరు ఊరినట్టు కొత్తనైన భావాలు కలిగి మనసు పరవశిస్తుంది.

వానచుక్క శతక రచనకు కవి ఎంచుకున్న ఛందస్సు ఆటవెలది. 116 పద్యాలతో కూర్చిన శతకంలోని మకుటం వానచుక్క నీకు వందనమ్ము. ఇందులోని మొదటి పద్యం దేవతాస్తుతితో పాటు వాన రావడంలోని పౌరాణిక ప్రస్తావనను ఉత్ప్రేక్షాలంకారంలో చెప్పిన తీరు బాగుంది.

**"నీలిమబ్బులోన నిన్ను చూచిన వెంట**
**నేల మీద నేను నెమలినౌదు!**
**మనసు పురులు విప్పి మరి నాట్యమాడగా.....".**

అని కవి తన్మయత్వంలో మునిగిపోయాడు.

జబ్బులకు జడిసి వర్షం ఆగిపోవాలని కోరుకోవద్దు అని ఓ పద్యంలో ఆదేశించాడు. "కల్మషాలు కడుపు గంగవు నీవేను" అనే పద్యంలో భారతీయ జీవనాడిని, "సాగు బాల్యమందు కాగితం పడవ" అనే పద్యంలో సామాన్య మానవుడి జీవిత చిత్రాన్ని కనులముందు నిలిపాడు.

'సాహితీ రత్న' పురస్కార గ్రహీత పెరుముల కైలాస్ గారు పుట్టింది కామారెడ్డి జిల్లా బిక్కనూర్. పేద కుటుంబంలో పుట్టిన ఇతడు తన స్వగ్రామంలోనే ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ఎం.ఎ, బి.ఇడి పూర్తి చేసిన కైలాస్ గారు ప్రస్తుతం తెలుగు పండితుడిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడు జాతీయ అర్హత పరీక్షలో కూడా ఉత్తీర్ణుడయ్యాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగు చదువుతున్నప్పుడు గురువు ఆచార్య రుక్నుద్దీన్ గారి బోధనకు ఆకర్షితుడయ్యాడు. వారి ప్రేరణతోనే కవిత్వ రచనపై దృష్టి సారించాడు. ఈ క్రమంలో వచన కవిత్వంతో ఆరంభించి ఇప్పుడు పద్య కవిత్వం కూడా రాస్తున్నాడు.

వీరు కవితలే కాకుండా నానీలు, వ్యాసాలు కూడా రాశారు. ఇవన్నీ వివిధ దిన, మాస పత్రికలో ప్రచురింపబడ్డాయి.

వీరి సాహితీ సేవకు నిదర్శనంగా జ్ఞానపీఠ అవార్డు గ్రహీత పద్మభూషణ్ డా?? సి.నారాయణరెడ్డి గారిచే 'సాహిత్య రత్న' పురస్కారాన్ని, కళాప్రపూర్ణ డా?? పోతుకూచి సాంబశివరావు గారిచే విశ్వ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. తిరుముల కైలాస్ గారికి ఉన్న మరొక ప్రత్యేకత ముత్యాల్లాంటి దస్తూరి. అతని చేతిరాతనే తలరాతను మార్చింది. పుస్తకం రూపంలో ప్రచురింపబడిన వీరి తొలి రచన తెలుగు వెలుగు శతకం. ఈ శతక రచనకు ప్రేరణ ఇతని గురువు ఆచార్య రుక్నుద్దీన్.

తెలుగు పండితుడు అయిన ఈ కవి తెలుగు భాష పట్ల అతనికున్న మక్కువను తెలియజేస్తూనే మాతృభాష పట్ల ప్రజలలో చులకన భావం, చిన్నచూపు, పరభాషల పట్ల వ్యామోహం, పోగొట్టడానికి ఈ తెలుగు వెలుగు శతకం ద్వారా ప్రయత్నించాడు. ఆటవెలది ఛందస్సులో రాయబడిన ఈ శతకంలోని మకుటం "తెలుసుకొనుము నీవు తెలుగు వెలుగు". 136 పద్యాలతో కూర్చిన ఈ శతకంలో కవి తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రధాన అంశంగా వివరించాడు. కవి ప్రారంభంలోనే "కన్నతల్లి భాష కలిమి నీకు/ వలదు వలదు మనకు పర భాషపై మోజు.........." అంటూ ఒకే పద్యంలో మాతృభాష సంపదలకు నెలవని, పరభాషపై వ్యామోహం వదులుకోవాలని ఈ విషయాన్ని తేటతెల్లం చేశాడు.

తెలుగంటే కేవలం భాష మాత్రమే కాదని కవులు, కళాకారులు, చారిత్రక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు, మొదలైన తెలుగు నేలతో సంబంధం ఉన్న వాటన్నింటిని ఈ శతకంలో స్పృశించాడు.

**"కృష్ణదేవరాయ కృతులలో నడయాడి**
**కమ్మనైన తెలుగు కావ్యభాష**
**త్యాగరాజ కృతుల తైతక్కలాడింది**
**తెలుసుకొనము నీవు తెలుగు వెలుగు"**

ఈ పద్యంలో కవిసార్వభౌముడైన కృష్ణదేవరాయలు సంకీర్తనకారుడైన త్యాగయ్య గురించి వివరించాడు. మరొక పద్యంలో "తిరుమలేశునింట కీర్తనై వెలిసెను/అన్నమయ్య గళము ఎన్నగాను.." అని పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమయ్యను వర్ణించాడు. పరభాషా వ్యామోహం తగదని చెబుతూ

**"తెల్లవారి భాష తిష్ఠ వేసెను నేడు**
**తెలుగువారి మదిని త్రిప్పెచూడు**
**తెలుగు మరిచిపోతె తెలుగు వాడెట్లగు?"**

అని తెలుగు రానివాడు తెలుగువాడు ఎట్లా అవుతాడని ప్రశ్నిస్తున్నాడు. నీతో భాష జదువని కేల సిగ్గాయే అని మరొక పద్యంలో నేడు ఆంగ్లంలో మాట్లాడడమే గొప్ప అని, తెలుగు మాట్లాడడం తక్కువ అని భావించే వారిని వెక్కిరిస్తున్నాడు.

మట్టిలో మాణిక్యం కుసుమ రాజమల్లు కామారెడ్డిజిల్లా దోమకొండ గ్రామానికి చెందినవాడు. నిరుపేద కుటుంబంలో పుట్టిన రాజమల్లు గారు ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. బీడీ కార్మికుడిగా జీవితాన్ని కొనసాగిస్తూ కవితా రచన చేస్తున్న ప్రతిభాశాలి. బాల్యం నుండి సాహిత్యంపై అభిరుచి పెంచుకున్న వీరు పాఠశాలలో చదువుతున్నప్పుడే గేయాలు, పాటలు రాస్తూ ఉండేవాడు.

కవి కుసుమ రాజమల్లుగారు రాసిన శతకం రమ్యనీతి శతకం. రమ్య నీతి వినుర రాజమల్లు అనే మకుటంతో ఆటవెలది ఛందస్సులో పద్యాలు అల్లారు. 174 పద్యాలు గల ఈ శతకంలో కవి అనేక నీతులను పొందుపరిచారు. ఈ కావ్యాన్ని కవి తన మాతృమూర్తి కుసుమ హన్మమ్మకు అంకితమిచ్చారు. దేశభక్తి, దైవభక్తి, దురాచారాల ఖండన, దుర్మార్గాల నిరసన, సమాజంలోని అవినీతి, అరాచకాలు మొదలైన భిన్నాంశాలు కనిపిస్తాయి.

ఆధ్యాత్మిక చింతన కలిగిన కుసుమ రాజమల్లు భారత, భాగవత, రామాయణాలలోని సన్నివేశాలను నిదర్శనంగా ఇస్తూ రస గుళికల వంటి పద్యాలు అందించారు.

**"పర వనితను కోరి పాపిష్టి రావణు**
**దేమి పొందె నాడు ఈల్గ చనియె**
**గొప్పవారి కైన తప్పు తప్పే గదా? ....."**

అంటూ దుర్మార్గమైన ప్రవర్తన ఎప్పటికైనా కీడును కలిగిస్తుందని, ఎంత గొప్పవారినైనా నాశనం చేస్తుందని రామాయణం ఆధారంగా వివరించారు.

**"విశ్వమందు మనకు విలువెక్కడుండు**
**అక్కడున్న గలుగు ఆత్మ శాంతి**
**మనను శాంతి లేని మనిషి జీవిత మేల?..."**

ఈ పద్యంలో కవి జీవితంలో మనశ్శాంతి ఎంత అవసరమో తెలియజేశాడు. "ఐకమత్యమందు ఐశ్వర్యముండును", ధర్మ పద్ధతులను ధరణిలో మరవద్దు, విద్య కన్న మిన్న వేరేది ఇలలోన, అమలు చేయకున్న ఆదర్శమెట్లగు వంటి నీతులతో కవిగారు రమ్యంగా ఈ శతకాన్ని తీర్చిదిద్దారు.

మధుర సూక్తి శతకము రమ్య మధుర సూక్తి రామమూర్తి అనే మకుటంతో ఆటవెలది ఛందస్సులో వ్రాయబడింది. ఈ పద్యాలు అన్నింటిలో సూక్తి లేకపోయినా ప్రతి ఒక్కరూ జాగృతం కావలసిన అంశం ఉంది. వేమన ఆటవెలది పద్యంలో చెప్పిన తీరుగానే ఈ కవి కూడా మూడవ పాదంలో సూక్తిని ప్రబోధించాడు.

**"నిజము పలుకువాడు నింద్యుడీ లోకాన**
**ప్రజల దోచువాడు పరమ గురుడు**
**ఉన్న మాట అనిన ఊరికే శత్రువు**
**రమ్య మధుర సూక్తి రామమూర్తి"**

ఈ పద్యంలో కవి నిజం చెప్పేవాడిని దోషిగా అబద్ధాలు చెప్పేవారిని గొప్పవాడిగా ఈ లోకం గుర్తిస్తుందని లోక నీతిని తెలియజేశాడు.

ప్రధానోపాధ్యాయులుగా విశిష్ట సేవలందించి పదవీ విరమణ చేసిన కాశ నరసయ్య కామారెడ్డి జిల్లాలోని రెడ్డిపేటకు చెందినవారు. 1969లోనే ఉద్యోగంలో చేరిన వీరు సాహిత్య సాంస్కృతిక రంగాలలో, ఆటల పోటీలలో పాల్గొనడంలో ఆసక్తి కనబరిచేవారు. కాశ నర్సయ్యగారు పద్యరచనపై ఆసక్తి కలిగి అప్పుడప్పుడు వారికి తోచిన భావాలను పద్యరూపంలో కూర్చిన సంకలనమే నరస శతకమ

ఆటవెలది ఛందస్సులో చక్కని నుడికారంతో వ్రాసిన ఈ శతకంలోని మకుటం వినుడి నరస వాక్కు కనుడి నిజము. ఈ శతకం ద్వారా రచయిత తన మనసులోని భావాలను స్పష్టంగా, నిజాయితీగా చెప్పిన తీరు మనం గమనించవచ్చు.

**"డబ్బులేక పోవ నిబ్బర ముండదు**
**ఎక్కువైన కోర్కె ! లెక్కువగును**
**నరుల నాశనంబు నకు నాశలేగదా**
**వినుడి నరసవాక్కు, కనుడి నిజము"**

ఈ పద్యంలో కవి ఆశలే మనిషి పతనానికి కారణమవుతాయని, డబ్బు ఎక్కువగా ఉన్నా ఇబ్బందులు కలుగుతాయని చెప్పాడు.



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు–**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

**(ప్రపంచ పదులు**
**– డా. సి. నారాయణ రెడ్డి)**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (26) హైదరాబాద్ మే : 2022

# పారమార్థిక గేయాలలో ఉయ్యాల పాటలు

**కె. ఎల్లప్ప,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9866819522

ఉయ్యాల పాటలు జానపద సాహిత్యంలో మనకు రెండు రకాలుగా కనిపిస్తున్నాయి. ఒకటి కథా రూపంలో, రెండు జోల, లాలి, ఉయ్యాల పాటల రూపంలో కనిపిస్తున్నాయి.

మానవులు తాము తమ సంతానాన్ని చిన్నప్పుడు లాలించి బుజ్జగిస్తారు. సంవత్సరము లోపు పిల్లలను ఉయ్యాలలో వేసి ఊపుతూ వారికి వచ్చిన లాలిపాటలు, జోలపాటలను పాడుతారు. ఈ పాటలను ఉయ్యాల పాటలు అని పిలుస్తారు. అలాగే దైవాన్ని చిన్న బాలునిగా భావించి జోల, లాలి, ఉయ్యాల పాటలను పాడుతారు. దైవస్తుతితో గల జోల, లాలి, ఉయ్యాల పాటలు పారమార్థిక గేయాలు అని చెప్పవచ్చు.

జానపదులు దైవాన్ని చిన్న బాలునిగా భావించి భక్తిభావంతో తన్మయం చెందుతారు. ఆ పసి బాలున్ని తమ సంతానంగా భావించి జోల, లాలి, ఉయ్యాల పాటలను పాడుతారు. ఈ విధంగా పాడి తమ భక్తిని చాటుకుంటారు. భక్తితో పాడిన ఉయ్యాల పాటలను పారమార్థిక గేయాలుగా చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యంలో అన్నమాచార్యుల కీర్తనలలో ఉయ్యాల పాటలు గలవు.

ఉదాహరణకు–

జోఅచ్చుతానంద జోజో ముకుంద......

ఉయ్యాలో అనే ఊతంతో పునరావృత్తితో పాడే పాటలు జానపద సాహిత్యంలో గలవు. ఈ గేయాలు దైవ చింతనతో, కథా గేయ రూపంలో వుంటే వాటిని పారమార్థిక గేయాలుగా చెప్పవచ్చు. ఇవి కథా గేయాల కిందికి వస్తాయి.

ఉయ్యాల పాటల లక్షణాలు

1. ఈ గేయాలను భక్తితో పాడుకుంటారు.
2. ఉయ్యాలో ఉయ్యాలో అనే ఊతంతో పునరావృత్తి ఉంటుంది.
3. ఈ గేయాలలో భక్తి, ప్రేమ ప్రధానంగా కనిపిస్తాయి.
4. ప్రతి చరణం చివర ఉయ్యాలో అనే ఊతంతో పునరావృత్తి ఉంటుంది.
5. ఇందులో కథాగేయాలు, చారిత్రకాంశాలు, మహిమలు ఉంటాయి.
6. భక్తుడు దైవాన్ని, శిష్యుడు గురువును వారి వారి మహిమలను కీర్తిస్తూ రాయడం జరుగుతుంది.

నాకు పారమార్థిక గేయాలలో కథా గేయాలు గల ఉయ్యాల పాటలు లభించాయి. వాటిని ఈ వ్యాసంలో చర్చించుకుందాం.

నారాయణపేట తాలుకా మద్దూరు మండలం అపిరెడ్డి పల్లె గ్రామ నివాసి గౌనోళ్ళ రాంరెడ్డి రాజయోగి గారు, ఇదే మండలం మన్నాపురం గ్రామ నివాసి కుమ్మరి పెద్ద బాలయ్య, ఇదే మండలం రెనివట్ల గ్రామ నివాసి చాకలి హనుమంతయ్య, కల్వకుర్తి మండలం వేపూరు గ్రామ నివాసి వేపూరు హనుమద్దాసు మొదలగు వారు ఉయ్యాల పాటలు రచించారు. వీరి గేయాలను ఒక్కొక్కటి చొప్పున పరిశీలిస్తాను.

నారాయణపేట తాలుకా మద్దూరు మండలం అపిరెడ్డిపల్లె గ్రామ నివాసి గౌనోళ్ళ రాంరెడ్డి రాజయోగి గారు "భవరహిత తత్త్వమాలిక" అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథంలో ఇతని శిష్యుడు రఘుపతిరెడ్డి రచించిన 24 తత్త్వాలు గలవు. ఈ తత్త్వాలలో ఒకటి తన గురువైన రాజయోగి గారి నిజ చరిత్రను కథా రూపంలో చెప్పడం జరిగింది. ఇది ఉయ్యాల రూపంలో చెప్పడం జరిగింది. **("భవరహిత తత్త్వమాలిక" అనే గ్రంథం పుట సంఖ్య 114, తత్త్వం 24, గౌనోళ్ళ రాంరెడ్డి రాజయోగి గారు)** మచ్చుకు ఒకటి.

గురురామ చరితము ఉయ్యాలో – గురుతుగ వినరమ్మ ఉయ్యాలో
**గాన అపిరెడ్డి పల్లె ఉయ్యాలో – గౌనోళ్ళ వంశమందు ఉయ్యాలో**
**చూడ లక్ష్మారెడ్డి ఉయ్యాలో – చెడె బసవమ్మకు ఉయ్యాలో 1**

**యేకైక పుత్రుండు ఉయ్యాలో – యెలుగొందె భువిపైన ఉయ్యాలో**
**మేనత్త నాగమ్మ ఉయ్యాలో – మెచ్చి పేరు బెట్టె ఉయ్యాలో 2**

**సత్య రాముని పేర ఉయ్యాలో – సంతోషముగ బెట్టె ఉయ్యాలో**
**భక్తి మార్గము దలచి ఉయ్యాలో – భజన పాటలుబాడె ఉయ్యాలో3**

**పన్నెండవ యేట ఉయ్యాలో – పెదనాన్న చంద్రయ్య ఉయ్యాలో**
**వేద గ్రంథమునొకటి ఉయ్యాలో– పాదములు మొక్కించెఉయ్యాలో**
**రామరామ శతకము ఉయ్యాలో – రమ్యముగ నేర్చెను ఉయ్యాలో4**

**పది ఐదు యెండ్లందు ఉయ్యాలో – పల్లెర్ల లక్ష్మయ్య ఉయ్యాలో**
**పరమ పదము దెల్పి ఉయ్యాలో – పరమ భక్తుని జేసే ఉయ్యాలో5**

ఈ విధంగా రాంరెడ్డి గారి ఆధ్యాత్మిక చరిత్రను రఘుపతిరెడ్డి గారు కథాగేయంగా, పారమార్థిక అంశాలను వివరిస్తూ చెప్పడం జరిగింది. రాంరెడ్డి గారికి హరికథలు, భజన పాటలు, తత్త్వాలు వినడం అంటే చాల ప్రీతి అని తెలుస్తుంది.

మద్దూరు మండలం మన్నాపురం గ్రామ నివాసి కుమ్మరి పెద్ద బాలయ్య గారు "స్వయం భూ శ్రీ కడపరాయస్వామి చరిత్ర మృధుమధుర కీర్తనలు, తత్త్వాలు" రాయడం జరిగింది. ఈ గ్రంథంలో ఒక ఉయ్యాల పాట కథా రూపంలో గలదు. ఇందులో కడపరాయ స్వామిని కీర్తించడం జరిగింది.

**(స్వయంభూ శ్రీ కడపరాయ స్వామిచరిత్ర మృధుమధుర కీర్తనలు,తత్త్వాలు. పుట సంఖ్య 77. కుమ్మరి పెద్ద బాలయ్య)**

ఉయ్యాల పాట

**దేవాది దేవుడవు టుమ్మీ టుయ్యాలో - నాయన్నస్వామి**
**దివ్య పురుషుడవు టుమ్మీ టుయ్యాలో - నాయన్నస్వామి**
**ఆది దేవుడవయ్య టుమ్మీ టుయ్యాలో - యేలో వెన్నల స్వామి**
**అవతార మూర్తివయ్యా - టుమ్మీ టుయ్యాలో దేవా 1**

**పావన చరిత టుమ్మీ టుయ్యాలో - నాయన్నస్వామి**
**ప్రస్తుతించెద నిన్నె టుమ్మీ టుయ్యాలో - నాయన్నస్వామి**
**సావదానముగ- టుమ్మీ టుయ్యాలో - యేలో వెన్నల స్వామి**
**సేవాలు జేసెద- టుమ్మీ టుయ్యాలో - టుమ్మీ టుయ్యాలో దేవా2**

పెద్ద బాలయ్యగారిని బ్రహ్మరహిత బాలదాసుగా భక్తులు పిలుస్తారు. స్వయంభూ శ్రీ కడపరాయ స్వామిచరిత్ర మృధుమధుర కీర్తనలు, తత్త్వాలు అను గ్రంథంలో బాలదాసుగారు 108 చరణములతో ఉయ్యాల పాటను రాయడం జరిగింది.

మదద్దారు మండలం రెనివట్ల గ్రామ నివాసి చాకలి హనుమంతయ్య తన జీవిత చరిత్రను కథాగేయ రూపంలో ఉయ్యాల పాటను రాయడం జరిగింది. హనుమంతయ్య గారు **"ఓం పరమార్థ తత్త్వములు, కీర్తనలు"** అను గ్రంథం రచించారు. ఈ గ్రంథం అవతారిక పరిచయంలో హనుమంతయ్య చరిత్రను ఉయ్యాల పాటల రూపంలో చెప్పడం జరిగింది. **(పుటసంఖ్య 2, శ్రీశ్రీశ్రీ రాజయోగి సత్యానంద హనుమంతయ్య గారి జీవిత చరిత్ర)** ఉయ్యాల పాట మచ్చుకు కొన్ని చరణాలు.

**శ్రీ చిన్న హనుమంతు ఉయ్యాలో - జీవిత చరితమ్మ ఉయ్యాలో**
**సూర్య చంద్రుల సాక్షి ఉయ్యాలో - సుద్ద వైశాఖమున ఉయ్యాలో**
**ధరణిలో రెణివట్ల ఉయ్యాలో - సాకాలి దానప్పకు ఉయ్యాలో**
**సుతుడయ్యి జన్మించే ఉయ్యాలో -మరియు నర్సమ్మకు ఉయ్యాలో**
**బిడ్డడగు జన్మించే ఉయ్యాలో - తండ్రి దానప్పనే ఉయ్యాలో**
**పౌర్ణమి రోజున ఉయ్యాలో - పుట్టేనే హనుమంతు ఉయ్యాలో**
**మదలయ్య గోత్రమున ఉయ్యాలో - జన్మించినాడమ్మ ఉయ్యాలో**
**పరస్త్రీలను జూచెను ఉయ్యాలో-పరకాంతలను గాంచె ఉయ్యాలో**
**పెద్దలందరు గూడి ఉయ్యాలో - లగ్నము జేసిరి ఉయ్యాలో**

పైన చెప్పిన విధముగ చరణములు సాగుతాయి. హనుమంతయ్యకు ముందు పరస్త్రీల పై వ్యామోహం వుంటుంది. తరువాత పెళ్ళి చేసుకొని కొన్ని రోజుల తర్వాత మొదటి భార్యను వదలి రెండవ పెళ్లి చేసుకుంటాడు. చివరకు జీవితంపై విరక్తి కలిగి, హైదరాబాదుకు వచ్చి రాజయోగి రఫీక్ బాబాను కలసి గురు ఉపదేశాన్ని పొందడం జరిగింది.

**అలనాటి ఆ బ్రహ్మ ఉయ్యాలో - వ్రాసిన ఫలమేమో ఉయ్యాలో**
**ధరణి హైదరాదులో ఉయ్యాలో - గురుని దర్శించెను ఉయ్యాలో**
**సుగ్నానిని జేరె ఉయ్యాలో - సులేమాన్ నగర్ లో ఉయ్యాలో**
**రాజయోగి బాబాను ఉయ్యాలో - రఫీక్ బాబాను జేరె ఉయ్యాలో**
**గురుని మాటను నమ్మె ఉయ్యాలో -సాధనాలు జేసెను ఉయ్యాలో**

ఈ విధముగా హనుమంతయ్య తన జీవిత చరిత్రను కథాగేయంగా ఉయ్యాల పాట రూపంలో చెప్పడం జరిగింది.

కల్వకుర్తి మండలం వేపూరు గ్రామ నివాసి వేపూరు హనుమద్దాసు గారు శారద రామాయణంను రచించినట్లు డా.భాస్కరయోగి గారు వేపూరి హనుమద్దాసు అను గ్రంథంలో వివరించారు. ఇందులో రాముని జన్మ విషయాలు, సుగ్రీవ మైత్రి మొదలగు విషయాలు ఉయ్యాల పాట రూపంలో ఉన్నట్లు తెలుస్తుంది. **(డా.భాస్కరయోగి "వేపూరు హనుమద్దాసు" పుటసంఖ్య 19,20).** ఇందులో శారద రామాయణం యుద్ధకాండ సమగ్రంగా చెప్పి ముగించినట్లు డా.భాస్కరయోగి గారు వివరించారు.

**కారుణ్య గాత్రుని ఉయ్యాలో - కౌసల్య పుత్రుని ఉయ్యాలో**
**గాధేయు జూచియు ఉయ్యాలో - కౌశీకుడాసియు ఉయ్యాలో**
**దానంతముగా ఉయ్యాలో - ధనువెత్తుమనగా ఉయ్యాలో**
**చాపంబు లేపెను ఉయ్యాలో - చై నారి మోపెను ఉయ్యాలో**

శారద రామాయణం పుట సంఖ్య 5లో ఉన్నట్లు డా.భాస్కరయోగి గారు వివరించారు. ఈ ఉయ్యాల పాట తెలంగాణలో తొలి బతుకమ్మ గేయంగా నిలుస్తుందని వివరించడం జరిగింది.



ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (28) హైదరాబాద్ మే : 2022

# ఉత్తమ గ్రంథం (సాహిత్యం) అంటే ...?

**డా. శంకర్ అనంత,** అతిథి ఉపన్యాసకులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 96406 40765

ప్రస్తావన :

'పురుషులందు పుణ్య పురుషులు వేరయా?'

అని అన్నట్టుగానే "పుస్తకాలయందు ఉత్తమ పుస్తకాలు వేరయా" అని అంటారు.

**'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో**
**కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో**

అనేది ఎంతో ప్రసిద్ధి చెందిన ఒక నినాదం.

పుస్తకం (గ్రంథం) అంటే... అనుభూతులసారం, అనుభవాల సమాహారం. అది వ్యక్తినే కాక, మొత్తం సమాజాన్ని కూడా ప్రభావితం చేసింది, చేస్తున్నది, ఇకపై చేస్తుంది కూడా.

సరైన దిశానిర్దేశం చేసి, మనకు సముచితమైన లక్ష్యాన్ని ఏర్పరచి, జీవితానికి ఉన్న అర్థం, పరమార్థం ఏమిటో వివరించేదే ఉత్తమ సాహిత్యం. మన చెంత ఒక మంచి గ్రంథం ఉంటే... ఒక సన్మిత్రుడు ఉన్నట్టే, ఒక 'కాగడా' ఉన్నట్టే, ఒక చుక్కాని ఉన్నట్టే.

అశాంతితో, ఆవేదనతో, అయోమయానికి గురై ఏం చెయ్యాలో పాలుపోక జీవితంపై నిరాశ పెంచుకుని, నిస్పృహతో ఆత్మహత్య వంటి తొందరపాటు చర్యకు పాల్పడే వారిలో సైతం మరలా ఉత్సాహం నింపి, ఆశావహ దృక్పథం కల్పించి తిరిగి ప్రయత్నాలు కొనసాగించేట్టు చేసి, వారిని విజయంవైపు నడిపించేట్టు చేసేదే ఉత్తమ సాహిత్యం.

ఇటువంటి పుస్తకాలు కొద్ది పాటిగానే ఉన్నా ప్రపంచంలోని అన్ని దేశాల సాహిత్యంలో మనకు కనిపిస్తాయి.

**సింహాలు మందల్లో ఉండవు**
**హంసలు గుంపులుగా తిరగవు**
**రత్నాలు సంచుల్లో దొరకవు**
**అలాగే ఉత్తమ గ్రంథాలు విరివిగా లభించవు.**

**పుస్తకం అభివృద్ధి**

ఏ దేశమైనా సరే అభివృద్ధి చెందినదిగా గుర్తించబడాలన్నా, అనిపించుకోవాలనుకున్నా ఆ దేశంలో

1) విద్యావంతులు, అక్షరాస్యులు ఎక్కువ మంది ఉండాలి.

2) గ్రంథాలయాల సంఖ్య ఎక్కువగా ఉండాలి.

3) మంచి పుస్తకాలు అందరికీ అందుబాటులో ఉండాలి.

4) ఆ గ్రంథాలు కూడా ప్రజల్ని చైతన్యవంతులుగా సామాజిక, ఆధ్యాత్మిక, స్పృహ పెంపొందించి వారిలో మానవ విలువలు కూడా పెంచేవిగా ఉండాలి.

5) సాంకేతికంగా, పారిశ్రామికంగా, విజ్ఞానపరంగా ఎంతగా అభివృద్ధి చెందినా ప్రజలు, ముఖ్యంగా యువత అంతర్జాల మాయజాలంలోనే చిక్కుబడక, ఆన్‌లైన్‌కే (నెట్, యూట్యూబ్, ట్విట్టర్ మొదలగువాటికే) అంకితం కాక రోజూ కనీసం ఒక అరగంటైనా తమ మాతృభాష, జాతీయ లేదా అంతర్జాతీయ భాషల్లో గొప్ప కీర్తి సంపాదించిన పుస్తకాలను అలాగే మహాత్ముల, మహితాత్ముల జీవిత చరిత్రలను చదివి తీరాలి. వారు సాధించిన విజయాలు అక్షరబద్ధమై ఉన్న రచనల్ని చదివి స్ఫూర్తిని పొందగలగాలి.

6) ప్రతి ఇంటా ప్రాచీన, ఆధునిక సుప్రసిద్ధ (అనువాదాలైనా సరే) గ్రంథాలు ఉండాలి.

7) ఆకలి వల్లనే మనం మంచి పుస్తకాలను గూడా కొన్ని చదవాలి. అలాగే పండుగ-పబ్బాలకు, వివాహాది శుభ కార్యాలలో, జన్మదినోత్సవాలలో బహుమతులుగా మంచి పుస్తకాలు ఇవ్వాలి.

ఇలా జరిగినప్పుడే సమాజంలో కవులు, రచయితలకు ప్రోత్సాహం లభించి, తమ రచనలకు సార్థకత లభిస్తుందనే ఆశతో, ఆశయంతో చక్కని గ్రంథాలను వ్రాస్తారు. ఒక కవి/రచయిత ఆశించేది "ఆనందం పంచుకోవడం-పెంచుకోవడమే".

తెలివి గలవాడు ఇతరుల అనుభవాలతో ప్రయోజనం పొంది, గుణపాఠం నేర్చుకుని, తన జీవితాన్ని పండించుకుంటే, మూర్ఖుడు మాత్రం ఇతరుల అనుభవాలు, ఆలోచనలు, సాఫల్యాలు, వైఫల్యాలు తెలుసుకుని వాటితో లాభపడక, తనదాకా వస్తేనే స్పందించి ఏదో నిర్ణయం తీసుకుని కష్టమో, నష్టమో అనుభవించడం మనకు తెలిసిన విషయమే. ఒక మంచి పుస్తకం మనకు ఈ విషయంలో గొప్పగా సహాయపడి మనల్ని ముందుకు నడిపిస్తుంది.

**ఉత్తమ గ్రంథం అంటే ?**

చాలామంది మహానుభావులు, సాహితీమూర్తులు, రచయితలు, కవులు ఈ క్రింది అంశాల ఆధారంగా ఉత్తమ గ్రంథం అంటే ఏమిటో నిర్ణయించి నిర్వచించారు.

1) పాఠకుడి మానసికస్థితి, ఆలోచనాసరళి, ఆచరణా విధానం, పుస్తకం చదవకముందు ఎలా ఉందో, మంచి పుస్తకం చదివాక కూడా అలాగే ఉంటే, అతనికి ఆ పుస్తకం దిశా నిర్దేశం చేయకుంటే అది ఉత్తమ గ్రంథం కాదు.

2) మనిషిని మంచి (good) నుంచి ఉత్తమ (better) స్థితికి, ఉత్తమస్థితి నుండి శ్రేష్ఠత (ఎవర్) వైపు నడిపించగలిగేదే ఉత్తమ సాహిత్యం.

3) మనిషిని కదిపేది, కుదిపేది, కదిలేది, కదిలించేది, పెనునిద్దుర వదిలించేది, మునుముందుకు నడిపించేది, జిజ్ఞాసను పెంచేది, అజ్ఞానం తొలగించేది, సుజ్ఞానం వెలిగించేదే ఉత్తమ గ్రంథం.

4) పై వాటిలో అన్నీ లేదా కొన్నైనా అంశాలు ఉన్నదే ఉత్తమ గ్రంథం అని అనిపించుకుంటుంది. ప్రజల అభిమానం పొందుతుంది. ఎన్ని తరాలైనా అది నిలబడగలుగుతుంది.

**సత్యం, శివం, సుందరం :**

సత్యం, శివం, సుందరం అనే సూత్రం ఎంతో ప్రసిద్ధమైనది. సాహిత్య రంగానికి కూడా చెందిన ఈ మూడు ముచ్చటైన మాటల్లో మొత్తం జీవితాన్నే కొలిచేంత వ్యాపకత్వము, శక్తీ ఉన్నాయి. అసలు మన సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాల్లో, పురాణాల్లోనే మూడు (03) అంకెకి ఎంతో విశిష్టత ఉన్నది. ఎలాగంటే త్రిమూర్తులు, ముల్లోకాలు, త్రిగుణాలు, త్రిపురసుందరి, త్రినేత్రుడు, జాతీయ పతాకంలో మువ్వన్నెలు, త్రికాలాలు (భూత, భవిష్యత్, వర్తమానాలు) ఇలా ఎన్నో ఎన్నెన్నో ఉన్నాయి. 'ఓం'కారం (ప్రణవం) లో ఉన్నవి 3 అక్షరాలు (అ, ఉ, మ) అని కూడా మనకు తెలుసు.

ఆధ్యాత్మిక వేదాంతపరంగా చూసినా భగవంతుడు సత్, చిత్, ఆనంద స్వరూపుడు. 'సత్' అంటే ఆదిమూల తత్త్వాధారానికి ప్రతీక. అయితే... 'చిత్' అనే దానిలో నడక, వేగం, చలనం అనే భావాలున్నాయి. మరి సమస్తమైన చలనాత్మక ఉనికికి లక్ష్యం ఆనందం చివరికి, ఈ మూడూ ఒక్కటే, అభిన్నములు. ఆనంద స్థితి అనేది అభేదత్వంతో, అద్వైతపరంగా ఉంటుంది.

అయితే వేదాలలో సత్యం, శివం, సుందరం అనేవాటిని ఒకే సూత్రంలో ప్రయోగించినట్టుగా కనబడదు. వేదాలలో వీటిని విడివిడిగా కూడా ప్రయోగం బహుశా చేయబడలేదు. తైత్తిరీయ, మాండూక్య ఉపనిషత్తులలో సత్యం, శివంలను ప్రయోగించడం మనకు కనిపిస్తుంది. మరి అక్కడ 'సుందరం' అనే దానిని వాడలేదు. ప్రాచీన సాహిత్యంలోనే 'సుందరం' అనేది మనకు కనబడుతుంది.

**సాహిత్యం – సౌందర్యం**

ఉత్తమ సాహిత్యంలో సౌందర్యం అనేది ఆకార సౌందర్యం కాక భావసౌందర్యమే ప్రధానంగా చెప్తుంది. సాహిత్యంలో కేవలం సుఖానుభూతియే ఆనందాన్ని ఇచ్చేదికాక, దుఃఖం మరియు శోకం అనుభూతి కూడా ఆనందాన్ని అందిస్తుంది. ఉదాత్తమైన భావమే సాహిత్యానికి వన్నె తెస్తుంది.

సౌందర్యానికి ప్రాణం పోసేది, చైతన్యవంతం చేయగలిగేది సాహిత్యమే. కీట్స్ అనే ఆంగ్లేయ కవి "సౌందర్యమే సత్యం, సత్యమే సౌందర్యం. రెండూ అభేదములు, విడదీయరానివి అని అంటాడు. ఇమర్సన్ అనే కవి సత్యం, శివం, సుందరం ఈ మూడూ దైవానికి సంబంధించిన మూడు విభిన్న దశలని అంటే, టెన్నిసన్ ఈ మూడూ 'సోదరీమణులు' అని అంటాడు. మన రవీంద్రుడు కూడా 'నేను ఈ త్రయాన్ని (సత్యం, శివం, సుందరాన్ని) ఒక్కటిగానే భావిస్తా'నని అంటాడు. నిజానికి ఈ మూడింటి సమాహారంలోనే పూర్ణత్వం ఉంటుంది"

కవి నిరంకుశుడే అయినా సత్యాన్ని కాదనలేడు. సత్యానికి కవి కొంత తన కల్పన జోడించి దానిలో ఆకర్షణ పెంచుతాడు. లౌకిక, అలౌకిక, ప్రత్యక్ష, పరోక్షములను సాహిత్యంలో సమన్వయపరచి ఒక బృహత్తర సత్యాన్ని స్థాపిస్తాడు కవి లేదా రచయిత.

అసలు ఉత్తమ సాహిత్యం లక్ష్యం "శివేతరక్షతయే" – అనగా సమాజంలోని యదార్థ పరిస్థితులు – దుఃఖం, బాధ, నిరాశ, వేదన మొదలగు వాటిలో కూడా కవి/రచయిత తన రచనాశక్తితో ఆకర్షణ పెంచి పాఠకుడి మనసును ఆర్ద్రంగా చేస్తాడు. సాహిత్యాన్ని శివంగా (మంగళము, మేలు) మార్చడం అనగా యదార్థాన్నే చిత్రించినా దానిలో ఆకర్షణ పెంచి అది పాఠకుడికి ఉపయోగకరంగా ఉండేటట్టు చేస్తాడు రచయిత. ఉత్తమ సాహిత్యంలో సౌందర్యము, సత్యము, శివతత్త్వము మూడూ ఉండాలి. మొదటిది (ఈస్థటిక్) అయితే రెండవది (ఇంటలెక్చువల్ ఫ్యాకల్టీ) సత్యాన్వేషణ వృత్తి. కాగా మూడవది శివం (విల్‌మోరల్ ఫ్యాకల్టీ) అవుతుంది. ఈ మూడింటి ఏకత్వమే మానవ ధర్మం. అదే జీవ స్వరూపం.

**ముగింపు**

జీవిత లక్ష్యం ఆనందప్రాప్తి. లలిత కళలు ఆనందం మాత్రమే అందిస్తే, కావ్యకళ (సాహిత్యం) ఇంకొంచెం ముందుకువెళ్ళి పాఠకులలో బ్రహ్మానంద స్థితిని కలిగిస్తుంది. సత్యం, శివం, సుందరం మూడు సంతరించుకున్న సాహిత్యం పాఠకునిలో రససిద్ధి కలిగించి, కేవలం బాహ్య సౌందర్యాన్నే చూపక మనిషి కర్మల మరియు మానసిక ప్రవృత్తుల సౌందర్యాన్ని కూడా పాఠకుని ముందు ఉంచుతుంది. నిజానికి ఇదే సాహిత్యాన్ని ఉన్నత స్థానంలో నిలబెడుతుంది. ఉత్కృష్ట సాహిత్యం శ్రేణిగా లెక్కించబడిన గ్రంథాలలో మనకు ఈ క్రింది అంశాలు ప్రధానంగా గోచరిస్తాయి.

1) వ్యక్తిగత జీవితాన్ని సమున్నతంగా, సమాజపరంగా తీర్చిదిద్దడం.

2) ప్రేమ, విశ్వాసం, నిజాయితీ, వినయం, మాట–చేతల మధ్య సమన్వయం, సత్యం, సత్సంగం, దయ, మానవ విలువలు, సహకారం, మొదలగువాటిపై ప్రత్యేక దృష్టి పెట్టడం.

3) ధార్మిక జీవనం, జీవితంలో ఆధ్యాత్మికత పెంపొందించడం.

4) మనుషుల మధ్య ఉండే దూరాన్ని, వర్గ, కుల, మత, జాతి, భేదాలను తొలగించి మత సామరస్యం, ఉదారవైఖరి, సమభావన పెంపొందిచేట్టుగా చేయడం.

5) చివరిగా సమకాలీన అంశాలను ప్రస్తావించి సమస్యలపై పరిష్కార దిశగా అవగాహన కల్పించడం, ప్రజలలో సానుకూల ధోరణి పెంపొందించి భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగలిగే ధృక్పథం అలవర్చుకుంటూ పాఠకులలో సంకుచిత ధోరణలు, ఛాందస భావాలు, మూఢనమ్మకాలు, కాలం చెల్లిన సూత్రాలకు వీడ్కోలు పలికి ప్రాచీనతకు ఆధునికతను జోడిస్తూ నూతన భావాలను పెంపు చేయడం.


**ఆధార గ్రంథాలు**

1) తెలుగు సాహిత్య సమీక్ష, ప్రథమ సంపుటం
– డా॥ జి.నాగయ్య.
2) తెలుగు సాహిత్య సమీక్ష, ద్వితీయ సంపుటం
– డా॥ జి.నాగయ్య.
3) తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వానా శాస్త్రి.

# న్యాయమూర్తి

నేను ఇరవై యేండ్లు గా సూత్తాన్నా !
మా సందు గొందుల్లోంచి
ఓ కేక కీసుపిట్ట లెక్క.
ఆన మబ్బుతెప్పల ఉరుము
అవి అట్టి అరుపులే కాదు ?
గదీ నలిగిన ఆకలి పేగుల
శ్రామిక సంగీత లయ !

సామాన్యుల వాకిళ్లల్లోంచి
అసామాన్యుల లోగిళ్ళల్లోంచి
సీకట్లను తగులబెట్టి....
ఎగిలివరంగానే ఎల్లీ ఎల్లని
బతుకు నెట్టుకస్తూ తను నడుస్తూ...
ఆమె బలహీనం అయి




మానవ బంధుత్వాలు పెంచుకున్న
కృషీవలురాలు..!

మా బస్ స్టాండ్ కాడి నుంచి
ఇల్లిల్లు అడవోసి... ?
తన సేయిల సంచిని ...
నింపుతూ వెళుతూ పోతుంది.
ఆడోళ్ల ఒక్కొక్క మాటకు . ?
తగిన జవాబు సెప్పుతూ..సాగుతోంది
గామే యాపారానికి పైసలతో పనిలేదు
గవన్ని ఎనుకటోలే ఇచ్చిపుచ్చుకునుడే..
గీమే సెసే దందాలో ....
సూపర్ మార్కెట్లు, ప్రయివేటు గాళ్ళు
ఇంకా కన్ను నాడు దేరువలేదు...!
ఐసుతో ఈ తొవ్వ బట్టి....
గిప్పుడు సీకేసినా బొక్కొలే గావచ్చు..?
కాని గామే బలువు సెక్కు సెదరలే.


అన్నింటికి బుగులు పడేటోల్లు..?
పిరికి గాళ్ళకు గామే సాచ్చి.!
ఏ కట్టం మొచ్చిన తెరుల్లు గాని
గా గుండె బలం సూడలే, నేర్వలే.

గింతకు ఆ నౌకరి ఎందంటే.?
దూసి పారేసిన తల ఎంటుకలను
జమ సెసే ఏడు కొండల పద్మావతి..!
పొరగాన్లకు.. గామే కూత ఇంటే సాలు
ఇంట్ల దుగుడు లోనో,పరారీ గోడ..
రంధ్రాలలో, కిటికీ సందులో తెగ ఎతికేటోళ్ళు....!

గాలి బుగ్గల కోసం గా కలర్ అంటే గీ కలర్..?
అని కారువడగొట్టి
తల్లి కోడిసుట్టు పిల్లల తీరు గా
ఎంబడి తిరిగేటోళ్లం.
పెద్దలకు సిన్న సిన్న ఇస్టీలు సామాన్లు
బదులు ఇచ్చే మా దండి పని
తన సేతులే తరాజులు..
వేటికెంత ఇయ్యాలో ఇచ్చే న్యాయమూర్తి.

అంబటాల్లగాంగనే..?
మా అరుగు మీద కూసోని
బుక్కెడు బువ్వ తినేది.
పట్టన్ని సాత్రాలు సెప్పేది...
గిప్పుడు గా కైతికల మాటలు,
ఆ పరిగశపు నవ్వుల లచ్చుమక్కా
కానత్తలేదు..?
మా అరుగు సూసినప్పుడల్లా
గామే యాదికస్తది..

**ముత్యంపేట గంగాధర్**
ఫోన్ : 9704 11 83 52



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  UGC Care List Approved Journals
హైదరాబాద్ మే : 2022

# ముద్దుపళని రాధికాసాంత్వనము : రాగాత్మిక భక్తి

**డా. శిరీష ఈడ్పుగంటి,** తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, నిజామాబాద్.
ఫోన్ : 9490 901050

భారతీయ సాహిత్యంలో ప్రాచీనకాలం నుండి నేటివరకు రాధాకృష్ణుల ప్రణయతత్త్వానికి సంబంధించి అనేక రచనలు వచ్చాయి. ఈ రచనలలో రాధాకృష్ణుల ప్రసక్తి ఎంతో వైవిధ్యభరితంగా కనబడుతుంది. ముఖ్యంగా మన తెలుగు సాహిత్యంలో రాధాకృష్ణుల ప్రణయ తత్త్వానికి సంబంధించి విభిన్న రచనలు వచ్చాయి. ఒక్కొక్క కవి ఒక్కొక్క దృక్పథంతో రాధాకృష్ణుల గూర్చి రాశారు. కొంతమంది రాధాకృష్ణుల ప్రణయాన్ని ఆధ్యాత్మిక దృష్టితో రాస్తే, మరికొంతమంది మధురభక్తి దృష్టితో రాశారు. ఇంకొంతమంది శృంగార రస దృ ష్ట్యా రాశారు. ఈవిధంగా పలు దృక్పథాలతో వచ్చిన రచనల్లో శృంగార రసాన్ని అత్యంత ఉత్కృష్టమైన దశలో చిత్రిస్తూ వచ్చిన కావ్యం రాధికా సాంత్వనము. ఈ పేరుతో తెలుగు సాహిత్యంలో రెండు రచనలు వచ్చాయి. ఈ రెండింటిలో అత్యంత ఘాటైన శృంగార రచన మాత్రం కవయిత్రి ముద్దుపళని రాసిన రాధికా సాంత్వనము అని చెప్పుకోవచ్చు.

కవయిత్రి ముద్దుపళని ఈ కావ్యాన్ని రాయడంలోని ఆంతర్యాన్ని చెబుతూ, ఆనాటి సమాజ పరిస్థితులను వివరిస్తూ, రాధామాధవ తత్త్వాన్ని- సంప్రదాయాన్ని పరిశీలిస్తూ ప్రస్తుత కావ్యానికి రాగాత్మిక భక్తిని అన్వయించే ప్రయత్నం చేయడం జరిగింది.

**కవయిత్రి వ్యక్తిత్వం - ఆనాటి సమాజం**

18వ శతాబ్దికి చెందిన ముద్దుపళని దేవదాసి కుటుంబంలో జన్మించిన ఆలయ నర్తకి. తంజావూరును పరిపాలించిన రాజు ప్రతాపసింహుని భోగపత్ని. రాజు ఈమెను ఆలయ నర్తకి స్థానం నుండి రాజాస్థాన నర్తకిగా చేయడం జరుగుతుంది. అచట ఈమె కవిపండితులు రాసిన రచనల సారాంశాన్ని నాట్యం ద్వారా అభినయిస్తూ ఉండేది. కొన్ని సందర్భాలలో శృంగార రచనలకు శృంగార పరమైన అభినయం చేయవలసి వచ్చేది. ఆలయనర్తకిగా ఉన్న ఈమెకు ఇది కొత్తగా, వింతగా అనిపించేది.

చాలామంది కవులు తమ ఇష్టదైవం కలలోకి వచ్చి ఫలానా రచన చేయమని ఆదేశించినట్లు చెప్పడం కూడా ఎక్కువగా ఆరోజుల్లో కనిపిస్తుంది. భగవంతుని కోరిక మేరకు రచనలు చేస్తున్నామని చెబుతూ, కవులందరూ వారి వారి రచనలలో శృంగార రసాన్ని అధికంగా పోషించేవారు. వారు రచనలలో పోషించిన ఈ శృంగార రసాన్ని రాజదర్బారులోని నర్తకీమణులను అభినయించమనేవారు. నర్తకీమణుల అభినయం ద్వారా కవులు, తక్కినవారు మరింతగా శృంగార రసాన్ని ఆస్వాదించేవారు. ఇటువంటి విధానం అంతా ఆ కాలంనాడు సర్వ సామాన్యమే.



అంతేగాకుండా ఆ కాలంలో రాజులు, కవి పండితులు, ప్రజలు అందరూ కూడా విలాస జీవితాన్ని కోరుకునేవారు. భోగ లాలసత్వానికి ప్రతీకగా ఆనాటి సమాజం కనిపిస్తుంది. ఇదే విషయాన్ని నటరాజ రామకృష్ణగారి రుద్రగణిక రచనలోనూ చూడవచ్చును. ఆ రోజుల్లో కవిపండితులు చేసిన శృంగార రచనలను ఆనాటి నర్తకులు అభినయించేవారు. రసికులైన కవులు, పండితులు, శాస్త్రవేత్తలు, పాలకులు ఆ రచనలను విని వాటి అభినయాన్ని చూసి ఆనందించేవారు. కొన్ని రచనలలో ఉండే ఘాటు శృంగారాన్ని కూడా ఆనాటి నర్తకులు అభినయించవలసి వచ్చేది. అప్పటి పండితులకు ఇది దోషంగా కనిపించలేదు. తమ పడక గదుల్లో తీర్చుకోలేక లైంగిక ఆకలితో అలమటించే కొందరు కవులు తమ కోర్కెలను కవిత రూపంలో పెట్టి కృష్ణ లీలలు అన్న ముసుగు వాటికి తొడిగి, లేనిపోని పవిత్రతను ఆపాదించి ఆ నల్లనయ్యకు రాజగోపాలుడు, వేణుగోపాలుడు, మదన గోపాలుడు అన్న వివిధ పేర్లతో అంకితం చేశారు. శంఖంలో పోసిన మురికి నీరు కూడా తీర్థం అవుతుంది. అలాగే కృష్ణ అంకితమైన బూతు పాటలు కూడా పవిత్ర రచనలు అయిపోయాయి.' (రామకృష్ణ, నటరాజ. 1987: 74,75)

కొంతకాలం తర్వాత కవయిత్రికి ఇటువంటి రచనలకు తాను చేస్తున్న నాట్యాభినయంపై జుగుప్స కలిగింది. తనకు తానే ప్రశ్నించుకుంది. ఆనాటి సమాజంలో విరివిగా వస్తున్న ఈ శృంగార

రచనలపైన, వాటిని రాస్తున్న కవులపైన ఈమెకు తిరస్కారభావం ఏర్పడుతుంది. అంతేగాకుండా వారిని ప్రశ్నించేది. అప్పుడు కవిపండితులు 'ఆ దివ్య శృంగారాన్ని మధుర భక్తి అన్నారు. రాధామాధవుల అనురాగానుభూతులు అన్నారు. వాటిలో అశ్లీలత ఏమీ లేదన్నారు. అశ్లీలత శరీరానికే గాని ఆత్మకు అంటదన్నారు. వీటికి వారు అలవాటు పడ్డారు. అందులో వారికి కొత్త లేదు. చెడు లేదు.' (రామకృష్ణ, నటరాజ 1987 : 75)

స్త్రీ పురుషుల పరస్పర ఆకర్షణయే ప్రీతి. ఈ ప్రీతినే మన సంస్కృత ఆలంకారికులు శృంగారమనిరి. దీని స్థాయి భావము రతి. భక్తులీ భావమునే లౌకికమగు భావభూమి నుండి అలౌకికమగు ఆకాశమునకెత్తి భక్తి అన్నారు. దీనికి భగవంతునితో సంబంధం కలిపి మధురభక్తి అని పిలిచారు. దీనికి కూడా మధుర రసమని పేరు పెట్టారు. ఇందులో సంయోగ వియోగ అవస్థలు రెండూ ఉంటాయి. భక్తి మార్గాలన్నింటియందు మధురభక్తికే ఉన్నత స్థానం కలదు. మరి ఈ దివ్యశృంగారం లేదా పవిత్ర శృంగారం అయినా రాధా వర్ణనలతోనే ఎందుకు నిలిచిపోయింది? పురుషుడైన కృష్ణుని ఎందుకు వర్ణించకూడదు? అని కవయిత్రి తనకు తానే ప్రశ్నించుకుంది. "ఇదంతా సున్నితమైన శృంగారం. ఇదంతా మధుర భావం ఎంతటి ఊహలకైనా అందని అనుభూతి ఇది అని రసికులు లొట్టలు వేస్తూ, చప్పరిస్తూ చప్పట్లు కొట్టేటట్టు రచించిన ఈ కవులకు ఒక సవాలుగా ఒక కావ్యాన్ని రచించాలని తలపెట్టింది. వ్రాసింది. అదే రాధికా సాంత్వనము." (రామకృష్ణ, నటరాజ. 1987 : 75)

కవయిత్రి రామకోటి రాయించినట్లు యార్లగడ్డ వారి (రాధికా సాంత్వనము వచనము- కావ్యము- వ్యాఖ్యానము) రచన ద్వారా తెలుస్తుంది. అలాగే సప్తపది అనే ఛందస్సుకు సంబంధించిన రచన కూడా చేసినట్లు తెలుస్తుంది. "నీ వలె రామకోటిని వ్రాయించిన స్త్రీని మరొకరిని కానము. నీ వలే అపారమైన ధనమిచ్చి పండిత కోటిని సత్కరించిన పడతి మరొకరు లేరు. నీ వలె కావ్య రచన గావించి ప్రఖ్యాతి నందిన స్త్రీ మూర్తి ఎక్కడా లేదు.'' (బాలగంగాధరరావు, యార్లగడ్డ. 2011: 29, 30) ఇటువంటి రచనలు చేసిన కవయిత్రి ముద్దుపళని రాధికా సాంత్వనము వంటి ఘాటయిన శృంగార ప్రబంధాన్ని రాయడానికి పైన పేర్కొన్న పరిస్థితులే కారణం అని చెప్పుకోవచ్చు.

కవయిత్రి వ్యక్తిగత జీవితాన్ని చూస్తే మరొక అంశం వెల్లడి అవుతుంది. ముద్దుపళని ప్రతాపసింహుని భోగపత్ని. భోగపత్నికి ఆరోజులలో రాజుయొక్క అంత:పుర రాణులవలె సమాన హోదా ఉండేది. వీరిద్దరికీ గల వ్యత్యాసం ఒకటే. రాణులకు అంత:పుర ప్రవేశం ఉంటుంది. రాజు దగ్గరికి రాణి స్వయంగా వెళుతుంది లేదా రాజు తన మందిరానికి రాణిని పిలిపించుకుంటాడు. కానీ భోగపత్నికి అంత:పుర ప్రవేశం ఉండదు. ఈమె దగ్గరికే రాజు రావడం జరుగుతుంది. భోగపత్ని మందిరానికి రాజు వస్తాడు. ముద్దుపళని కవయిత్రి, నర్తకి, సంగీత సాహిత్య విద్యా విశారద. కాబట్టి రాజుకు ముద్దుపళని అంటే మరింత ప్రీతి. అంత:పుర రాణుల కంటే మరింత ప్రాముఖ్యత ముద్దుపళనికి ఇచ్చి ఉండవచ్చు. అంతేకాకుండా రాజులకు అప్పట్లో వారి వారి చరిత్రలను వినాలని, రచనల రూపంలో రావాలని కోరిక ఉండేది. ఆ కోరికను కవుల ద్వారా తీర్చుకొనేవారు. వారి చరిత్రలను, తదితర విషయాలను గూర్చి కవులను రాయమనేవారు. కవులు కూడా వారిని పోషిస్తున్న రాజుయొక్క చరిత్రను రాసేవారు. అదేవిధంగా ప్రతాపసింహుడు కూడా కవయిత్రి అయిన ముద్దుపళనిని వారి ప్రణయ తత్త్వం గురించి రాయమని అడిగి ఉండవచ్చు. లేదా ముద్దుపళనికే తన చరిత్ర రాసుకోవాలని కోరిక కలిగి ఉండవచ్చు. ప్రాచీనయుగం నుండి సాహిత్యంలో అభూతకల్పనలు, పౌరాణిక పాత్రలు, రాజు-రాణుల ప్రేమ పురాణాలు మొదలైనవి ఎక్కువగా ఉండేవి. ఇలాంటి అవాస్తవిక సాహిత్యానికి బదులుగా వాస్తవమైన తన జీవితాన్ని కావ్యరూపంలో మలచి ఉండవచ్చు. కవయిత్రి తన జీవితాన్ని తాను చూసుకోవడానికి ఒక పౌరాణిక పాత్రను ఎంచుకుంది. ఆ పాత్ర రాధ. తాను రాధ అయినప్పుడు తన ప్రియుడైన రాజును కృష్ణునిగా భావించింది. ముద్దుపళని ప్రతాపసింహుల ప్రణయాన్ని రాధాకృష్ణుల ప్రణయ తత్త్వంగా కావ్యంలో మలచి ఉండవచ్చు. ఏవిధంగా చూసిన ముద్దుపళని తన స్వీయచరిత్రను కొంతవరకు రాధికా సాంత్వనము రచన రూపంలో సాహిత్య ప్రపంచానికి అందించిందని చెప్పుకోవచ్చు.

**రాధికా సాంత్వనము**

రాధాకృష్ణుల ప్రణయ తత్త్వాన్ని వర్ణించిన కావ్యం. ఈ కావ్యంలో అలిగిన రాధను కృష్ణుడు బుజ్జగించడం అనేది ప్రధాన అంశం. రాధ కృష్ణుని కంటే వయసులో పెద్ద. వరుసకు మేనత్త. కృష్ణుని దివ్య ప్రేమలో రాధ మునిగిపోతుంది. అతని ఆనందం కోసం తనను తాను అర్పించుకున్నది. సమాజం ఏమనుకుంటుందో అన్న శంక కూడా ఆమెలో లేదు. పగలు రాత్రి కృష్ణుని ధ్యానంలో మునిగి ఉంటుంది. ఈ కావ్యంలో ముందుగా చర్చించుకోవలసిన అంశాలలో మొదటి అంశం రాధాకృష్ణుల బంధం.

**రాధాకృష్ణుల- బంధం**

ఈ రచనలో కవయిత్రి రాధాకృష్ణుల మధ్య మేనత్త- అల్లుడి బంధాన్ని చిత్రించింది. రచనలో రాధాకృష్ణులు పెళ్లి చేసుకోలేదు. కానీ దాంపత్య జీవితం కొనసాగిస్తారు. అంతే కాకుండా కృష్ణుడికి ఇళాదేవితో బాల్యవివాహం జరుగుతుంది. ఆ రోజుల్లో బాల్యవివాహాలు మామూలే. వివాహం జరిగిన తర్వాత కూడా రాధాకృష్ణుల మధ్య సంబంధం కొనసాగుతుంది. ఆ రోజులలో రాజులకు సామాన్య ప్రజలకు బహుభార్యత్వం ఉండేది. అలాగే కృష్ణుడికి ఇళాదేవితో వివాహం అయినప్పటికీ రాధాకృష్ణుల బంధం కొనసాగి ఉండి ఉ

ంద వచ్చు. ఈ విషయం గూర్చి నంద యశోదలకు, ఇళాదేవికి అలాగే మిగిలిన వారికి తెలిసినదే. అయినప్పటికీ ఎవరి నుంచి ఎటువంటి ఆక్షేపణ రాలేదు. రచనలో కవయిత్రి కూడా పేర్కొనలేదు. కేవలం ఇళాదేవి తమ్ముడు మాత్రమే కృష్ణుడిని రాధను విడిచిపెట్టమని అడగడం రచనలో కనిపిస్తుంది.

భారతదేశంలో కొన్ని మతాలలో కొన్నిరకాల సంప్రదాయాలు మనకు కనిపిస్తుంటాయి. ముస్లిం సంప్రదాయంలో పిన్ని కూతురుని (చెల్లెలి వరుస అమ్మాయిని) కూడా వివాహం చేసుకునే పద్ధతి కనిపిస్తుంది. అదేవిధంగా ఆ కాలంలో మేనత్త అల్లుడి సంబంధాన్ని సమాజం అంగీకరించిందేమో. అందుకే రచయిత్రి ఈ విధమైన బంధాన్ని వారిమధ్య చూపించడం జరిగి ఉండవచ్చు. అంతేగాకుండా ఎక్కడ ఎవరి పరంగాను రాధను నిందించిన సందర్భం ఈ రచనలో కనబడదు. ఇళాదేవి తండ్రి కుంభకుడు కూడా ఇళాకృష్ణులతో పాటు రాధను కూడా ఇంటికి రమ్మనమని అడుగుతాడు. నందుడు కూడా కుంభకునితో ఇళాకృష్ణుల్ని పుట్టింటికి తీసుకుని వెళ్లేటప్పుడు రాధను అడగమని చెబుతాడు. ఒకవిధంగా రాధ అనుమతి తీసుకోమని అంటాడు. నందుని దృష్టిలో కూడా రాధాకృష్ణుల బంధాన్ని సమర్థించినట్లుగానే కవయిత్రి ఈ రచనలో చూపించడం జరిగింది.

**భక్తి మార్గం**

భక్తిమార్గాలు రెండు రకాలుగా ఉంటాయి. 1 వైధిభక్తిమార్గం 2 రాగాత్మిక భక్తిమార్గం

**వైధి భక్తిమార్గం**

విధి నియమాలతో కూడిన భగవత్ ఆరాధన అనేది వైధి భక్తిమార్గంలో కనిపిస్తుంది.

**రాగాత్మిక భక్తిమార్గం**

రాగాత్మిక భక్తిమార్గాన్ని గోపీ మార్గమని, వ్రజగోపి పథమని అంటారు. ఈ భక్తి మార్గాన అనురాగమే ప్రధాన పూజా ద్రవ్యం. అనురాగమే నియమము. భగవంతునితో ఏదో ఒక సంబంధ బాంధవ్యమును కల్పించుకొని తత్సంబంధమైన అనురాగ రసమును పెంపొందించుకుంటూ భగవంతుని అనుగ్రహానికి బద్ధుడగుటయే ఈ భక్తిమార్గానికి మూల మంత్రం.


రాగాత్మిక భక్తిని భక్తిరస శాస్త్రాలు ఈ క్రింది విధంగా నిర్వచించాయి.

1. 'వ్రజధామము నందలి పుణ్య జీవుల మార్గమిది. రాగాత్మిక భక్తినే రాగానుగ భక్తి అని కూడా అంటారు. ప్రియతముడగు వ్రజకృష్ణుని యందు తీవ్ర అనురాగమును, వానిని సేవించుట యందు తీవ్రమైన కోరికను కల్గియుండటాన్నే రాగాత్మిక భక్తి అంటారు.

2. శాస్త్ర విధులను లక్ష్యపెట్టక తన పరిపూర్ణ హృదయ గాఢానురాగముతో ఫలాభిసంధి విరహిత బుద్ధితో కృష్ణున్ని ప్రేమించుటయే ఈ భక్తిమార్గమునందలి ప్రధాన సోపానము.

3. బాహ్యాంతరంగ సాధనలతో కూడినదే ఈ మార్గం. తన శరీర అవయవములతో భగవంతుని కీర్తించుట శ్రవణ మననాదులు చేయుట బాహ్య సాధన విశేషాలు. ఇక ఆంతరంగికంగా భక్తుడు తాను వ్రజ సుందరుడైన గోపివల్లభునికి ప్రేమభక్తితో నిత్య దాసుడనని సదా భావించుకుంటూ తదనుగుణంగా జీవించుటయే ఆంతరంగిక సాధనా విశేషం.

4. రాగానుగ సాధనభక్తిని శ్రద్ధతో అభ్యసించిన మాధవ నామ లీలాతత్త్వముల యందు ఆసక్తి ఏర్పడుతుంది. ఈ ఆసక్తే క్రమక్రమంగా పెరిగి భగవంతుని యందు తీవ్ర ఆసక్తిగా




మారుతుంది. ఈ ఆసక్తి నుండి అనురాగభావం పుట్టడం సహజం. ఈవిధంగా భగవత్ చింతన చేసినను భాగవతోత్తముల హృదయాలు కరిగిపోగలవు. ఆనందాశ్రువులు వరదలై పారును. శరీరం జలదరించి పులకరించును.

కన్నబిడ్డలు, తల్లితండ్రులు మొదలైన వారియందు ఏవిధంగా మనకు సహజ అనురాగం కలదో ఆ అనురాగాన్ని కూడా మరిచిపోయే విధంగా ప్రగాఢ అనురాగం ఈ దశలో భగవంతునియందు మనకు కలుగుతుంది. స్మరణం వలనగానీ, ఆలోచన వలనగానీ చిత్త స్పందన విస్తరణ కరిగి అనుకోకుండానే ఆనందాశ్రువులు రాగలవు. పులకించిపోతాము. ఇట్టి స్థితినే అనుభూతి మధుర ప్రేమభక్తులు భావమని అంటారు.' (లీలాజ్యోతి. సెప్టెంబర్, 1987 : 70,71)

**రాధికా సాంత్వనము– రాగాత్మిక భక్తి**

రాగాత్మిక భక్తిని ప్రముఖ భక్తిరస శాస్త్రాలు నిర్వచించిన నిర్వచనాల ప్రకారం రాధికా సాంత్వనము కావ్యాన్ని పరిశీలించిన రాధా కృష్ణుల మధ్య ఉన్నది రాగాత్మిక భక్తి అని చెప్పుకోవచ్చు. రాగాత్మిక భక్తిలో అనురాగం ప్రధానం. ఈ కావ్యంలో రాధాకృష్ణుల మధ్య ఒకరిపట్ల ఒకరికి అనురాగం ఉంటుంది. ఈ భక్తి మార్గంలో భగవంతునితో ఏదో ఒక సంబంధ బాంధవ్యం ఏర్పర్చుకుని తదనుగుణంగా అనురాగ రసమును

పెంపొందించుకోవడం కనిపిస్తుంది. ప్రస్తుత కావ్యంలో కూడా రాధాకృష్ణుల మధ్య ఈ అనురాగరసం అభివృద్ధి చెందుతూ ఉంటుంది. రాధ కృష్ణుని అనుగ్రహానికి, కృష్ణుడు రాధ అనుగ్రహానికి బద్ధులగుతారు. భగవంతుని అనుగ్రహానికి బద్ధుడగుటయే ఈ భక్తిమార్గానికి మూలమంత్రం. ఇది ఈ కావ్యంలో చూడవచ్చు.

రాధ కృష్ణుని యందు ప్రేమానురాగాలను కలిగి ఉంటుంది. కృష్ణుడు రాధ యందు అంతే ప్రేమానురాగాలను కలిగి ఉంటాడు. వారిద్దరూ కూడా ఒకరి సేవకై మరొకరు తపిస్తారు. కావ్యం ప్రారంభం నుండి చివరివరకు రాధాకృష్ణుల మధ్య గాఢమైన అనుబంధం కనిపిస్తుంది. అదే రాధాకృష్ణుల ప్రణాయానుబంధంగా రచయిత్రి ఈ కావ్యంలో చూపించింది. ఈ భక్తి మార్గానికి ప్రధాన సోపానమైన ప్రేమ అనేది రాధాకృష్ణులిద్దరిలో తారాస్థాయిలో ఉంటుంది.

ఈ భక్తిమార్గానికి సాధనాలైన బాహ్య సాధనం, అంతరంగ సాధనం రెండింటిని చూస్తే ఈ కావ్యంలో రాధా కృష్ణుల మధ్య బాహ్య సాధనం ద్వారా రాగాత్మిక భక్తిని రచయిత్రి చిత్రించారు. రాధ భగవంతుడైన కృష్ణుడికి నిత్య దాసిలా సేవచేస్తూ (కృష్ణుడిని చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేస్తుంది. పెంచిన ప్రేమను ప్రణయంగా మార్చుకొంటుంది. కృష్ణుడిని విడిచి ఉండలేని స్థితిలో ఉంటుంది. మనసులో గాఢ అనురాగంతో, ప్రేమతో కీర్తిస్తూ తనను తాను సమర్పించుకున్నది. అలాగే కృష్ణుడు రాధాదేవికి నిత్యదాసుడిలా సేవచేస్తూ మనసులో అంతే గాఢానురాగంతో, ప్రేమతో స్మరిస్తూంటాడు. హృదయ పూర్వకమైన ప్రేమతో రాధాకృష్ణులు ఇద్దరు కలిసి ఒకటవుతారు. వీరిద్దరూ ఒకటైన శృంగార క్రీడను రచయిత్రి కావ్యం అంతా ఉత్కృష్ట స్థాయిలో వర్ణించింది. ఇంతకుమించి శృంగార రసాన్ని ఎవరు వర్ణించలేరనే విధంగా రచయిత్రి ఈ కావ్యాన్ని రాయడం జరిగింది. శృంగార రసాన్ని ఇంతకంటే ఘాటుగా చూపించడానికి వీలులేని విధంగా ఈ కావ్యంలో సమస్తం వర్ణించడం జరిగింది. రాధాకృష్ణుల మధ్య అలాగే ఇళాదేవి కృష్ణుల మధ్య జరిగిన శృంగార క్రీడలు అన్నింటిని పాఠకలోకానికి కళ్ళకు కట్టినట్లు చూపించారు. రాధ విరహ వేదన, కృష్ణునిపై అలగడం, కృష్ణుడు రాధను బుజ్జగించడం అనంతరం రాధాకృష్ణుల కలయిక మొదలైన ఘట్టాలలో శృంగార రస స్థాయి ప్రాచీన కవుల శృంగార పరమైన వర్ణనలకు ఏమాత్రం తీసిపోని విధంగా కనిపిస్తుంది. ఆ కవుల వర్ణనలకు మించిన వర్ణనలే ఈ కావ్యంలో కనిపిస్తాయి.

ఈ భక్తిమార్గంలో ఒకటైన బాహ్య సాధనం శరీర అవయవములతో భగవంతుని కీర్తించుట. రాధా కృష్ణుల మధ్య ఉన్న శారీరక సంబంధం ఒకవిధంగా రాగాత్మిక భక్తికి మూలమైన బాహ్య సాధనం అనుకోవచ్చు. ఇక అంతరంగిక సాధనం రాధాకృష్ణుల ప్రణయ తత్వం. అది అందరికీ తెలిసిందే. ఈ విధంగా మానసికంగాను, శారీరకంగాను భగవంతుని కీర్తించుచూ అనురాగాన్ని కలిగి ఉండుటయే రాగాత్మిక భక్తి. ఈ రాగాత్మిక భక్తి ముద్దుపళని రాసిన ఈ కావ్యంలో రాధాకృష్ణుల మధ్య కనిపిస్తుంది. అంతేకాకుండా కవయిత్రి కాలంనాటి కవుల అభిప్రాయం ప్రకారం రాధాకృష్ణుల మధ్య చిత్రించిన శృంగార క్రీడా వర్ణన మధురభక్తికి మార్గమే తప్ప మరొకటి కాదు.

నిడుదవోలు వేంకటరావుగారు వారి దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయములో ఈవిధంగా పేర్కొన్నారు. ఈ కావ్యమునందు "బాహ్యాభ్యంతర సురత వర్ణనము గోప్యంగ వర్ణనము విశృంఖలముగా చేయబడినవి. ఇట్టివి యానాటి కావ్యములలో సర్వసాధారణములే. ఇందలి శృంగార మత్యుత్కటమై యీ తరువాత ఆంగ్లేయ ప్రభుత్వము వారి నిషేధమునకు పాత్రమైన గ్రంథములలో ప్రథమముగా నిలిచినది. అయినను, ఆనాటి శృంగారాభిరుచులను బట్టి చూచిన యంత విపరీతముగ గన్పట్టక పోవచ్చును." (వేంకటరావు, నిడుదవోలు. 1954 : 198) ఈ విషయాన్నిబట్టి ఆరోజులలో శృంగారపరమైన కావ్యాలు విరివిరిగానే వచ్చాయని తెలుస్తుంది. అయితే కేవలం కవయిత్రి ముద్దుపళని రాసిన రాధికాసాంత్వనమును మాత్రమే నిషేధించడానికి గల కారణం తెలియదు. బహుశా ఒక స్త్రీ ఇటువంటి శృంగారకావ్యం రాయడాన్ని ఆనాటి కవులు తప్పుగా భావించివుంటారేమో.

**ముగింపు**

ఈ కావ్యం నాలుగాశ్వాసాల శృంగార ప్రబంధం. శ్లేష, జాతీయాలు, నానుడులతో నిండిన కావ్యం. ఆ కాలంనాటి సామాజిక విశేషాలెన్నింటినో తెలియజేసే కావ్యం. నేటి కాలానికి ఇది ఒక మెడిసిన్‌లా పనిచేస్తుంది. ప్రస్తుత కాలంలో నడివయసు దాటిన వారికి కుటుంబ బాధ్యతలు తదితర విషయాల కారణంగా దాంపత్య జీవితంలో లైంగికపరమైన ఆసక్తి తగ్గవచ్చు. అటువంటి వారికి ఈ కావ్యం ఒక మెడిసిన్ కావచ్చు.

**ఉపయుక్త గ్రంథసూచి**

నళినీకాంతరావు, బాలాంత్రపు. వేంకట సింగరాచార్య, బొమ్మకంటి. (సంపా). 2009. ముద్దుపళని *రాధికా సాంత్వనము.* ఎమెస్కో సంప్రదాయ సాహితి ప్రచురణ. విజయవాడ.

బాలగంగాధరరావు, యార్లగడ్డ. డిసెంబరు, 2011. ముద్దుపళని *రాధికా సాంత్వనము* (వచనము – కావ్యము – వ్యాఖ్యానము). నిర్మలా పబ్లికేషన్సు. విజయవాడ.

రామకృష్ణ, నటరాజ. 1987. *రుద్రగణిక.* పేరిణి ఎంటర్ నేషనల్ ప్రచురణ. హైదరాబాద్.

లీలాజ్యోతి. సెప్టెంబర్, 1987. *శ్రీ రాధామాధవ తత్వము – సంప్రదాయము.* తిరుమల ప్రింటింగ్ వర్క్స్. హైదరాబాద్.

వెంకటరావు, నిడుదవోలు. 1954. *దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము.* మదరాసు విశ్వవిద్యాలయం. మద్రాసు.

గ్రంథాంతరంగం 12

# ఆధునికాంధ్ర భావ కవిత్వం

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

"నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల?" అక్షర లక్షలిచ్చే మాట చెప్పాడు కదా మన వేమన్న! పసలేని పరిశోధనా గ్రంథాలు కుప్పలు తిప్పలుగా వెలువడుతున్నాయి. పసందైన సిద్ధాంత గ్రంథాలు ఎప్పుడో కాని ముద్రితం కావు. అలాంటి అపురూపమైన, అత్యమూల్యమైన సిద్ధాంత గ్రంథమే పాటిబండ మాధవశర్మగారి 'ఆధునికకాంధ్ర భావ కవిత్వం'.


పాటిబండ మాధవశర్మ (1910–78) పైలా పచ్చీసు వయస్సులో యం.ఏ. ఆనర్సు డిగ్రీకిగాను రాసిన లఘు సిద్ధాంత వ్యాసమే ఇది. బరువులో ఇది లఘు సిద్ధాంత గ్రంథమే కాని పరువు ప్రసిద్ధుల్లో గురుతరమైనదే. జూన్ 28, 1935లో ఈ లఘు సిద్ధాంత వ్యాసాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్తుకు సమర్పించి 1936లో యం.ఏ. ఆనర్సు పట్టా పొందారు. తెలుగులో ఈ పట్టా పొందిన సర్వ ప్రథములు శర్మగారే!

పాటిబండ గారి ఈ గురుకృతి 76 ఏళ్ల తర్వాత అంటే 2012లో కాని ముద్రితం కాలేదంటే తప్పెవరిదంటారు? కారణమేమైనా కావొచ్చు. అయితే డా.కోలవెన్ను మలయవాసినిగారు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు గ్రంథాలయంలో ఓ మూల నక్కిపడివున్న ఈ అమూల్య సిద్ధాంత గ్రంథానికి జెరాక్స్ ప్రతి తీయించి పంపితే, డా. వెలుదండ నిత్యానందరావు పూనికవల్ల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2012లో ప్రచురించింది. 'ఆధునికాంధ్ర భావ కవిత్వం' లాంటి విలువైన పరిశోధనా గ్రంథం ఎన్నో ఏండ్ల పూండ్ల తర్వాత వెలుగు చూసింది. ఈ పుస్తకానికి 20 పేజీల లోతైన, విశదమైన పీఠిక వెలయించిన డా. వెలుదండ నిత్యానందరావుగారు అభినందనార్హులు.

పాటిబండ మాధవశర్మ 'ఆధునికాంధ్ర భావ కవిత్వం' అనే లఘు సిద్ధాంత వ్యాసాన్ని పింగళి లక్ష్మీకాంతం గారి పర్యవేక్షణలో రాశారు. విశ్వవిద్యాలయాల్లో తెలుగు సాహిత్య పరిశోధన పురిటి నొప్పులు పడుతున్న రోజులవి. ఆ దినాల్లో పాతికేళ్ల పాటిబండ వారు ఎంతో శ్రమకోర్చి పత్రికల్లో చెల్లా చెదరుగా పడివున్న కవితల్ని పోగుచేసి, శ్రద్ధతో పరిశీలించి, ఆత్మవిశ్వాసంతో సంతరించి పెట్టిన అత్యమూల్య పరిశోధనా గ్రంథమిది.

పాటిబండ మాధవశర్మగారి 'ఆధునికాంధ్ర భావకవిత్వం' (2012) మూడు ఖండాలుగా విభజింపబడింది. ప్రథమ ఖండంలో పరిచయము, ప్రజాభిరుచి అనే రెండంశాలు చెప్పారు గ్రంథకర్త. ద్వితీయ ఖండంలో నామరూపాది విచారము, విభాగములు, ఛందస్సంపత్తి, భాష అనే అంశాలు వివరించారు శర్మగారు. తృతీయ ఖండములో పాటిబండవారు సామగ్రి, ప్రేమ, ప్రకృతి, స్వాతంత్ర్యోద్యమము, వికాసము అనే అంశాల్ని లోతుగా చర్చించి, భావకవిత్వం వైశిష్ట్యాన్ని వివరించారు. అనుబంధాల్లో సంప్రతింపు గ్రంథాల సూచిక, అప్పటికి ప్రచురితమైన ఉత్తమ భావ కావ్యాల పట్టిక ఇవ్వబడ్డాయి. శర్మగారు 188పేజీల ఈ లఘు సిద్ధాంత గ్రంథంలో భావకవిత్వ ఆవిర్భావ వికాసాల్ని తలస్పర్శిగా పరిశీలించారని చెప్పవచ్చు.

పాటిబండవారు ఆధునికాంధ్ర కవిత్వాన్ని పరిచయం చేస్తూ ఇలా అంటారు. "భావ కవిత్వము నందు వికసన్నోఖములై యున్న ఉత్తమ లక్షణములనుద్ధృతముగ ప్రదర్శించుట ఈ కావ్యముద్దిష్టము. ఈ కవితపై నిది కేవలము తొలి పలుకు ..............ఈ వ్యాఖ్యానము ద్వారమున, బహిఃప్రమాణములను బట్టి దీని గుణ దోష నిర్ణయము జేయుట కంటె దీని యందు వికసనోన్ముఖమునై యున్న అనేక శక్తులను తేటపరచి, సారస్వత ప్రియులు,




సౌందర్యారాధకులునైన భావుకులు భావకవితా స్వాదనమునకు మార్గము చూపగలనని ఆశించుచున్నాను" (పేజి: 4) మూడు పదులు నిండని పరిశోధకుడు మాధవశర్మగారి అంతరంగశుద్ధి, ఆత్మవిశ్వాసం, మొనచైన పరిశీలనాదృష్టి, గంభీరమూ సంయమితమైన భావ ప్రకటనా వైఖరి ప్రశంసనీయమేకాదు, ఆశ్చర్యకరం కూడా.

శర్మగారు భావకవిత్వం గురించి రాస్తూ భావకవులు ప్రాచీన తెలుగు కవుల కంటే, దక్షిణాంధ్రయుగ కవుల కంటే నూతనమైన, విశిష్ట కవులని చెప్పారు. భావకవిత్వం మనన ప్రధానమనీ, భావకవి "తన యనుభవమును మననము చేసి రసస్ఫూర్తి కలుగునట్లు శక్తివంతము, బంధురము, మధురము నగు కావ్యముగా పోత పోయును" (పేజి:9) అని అంటారు. అప్రాప్తమైన ప్రేమను ఆరాధించటమే భావకవుల ఆశయం అని చెప్తారు. భావకవిత్వం కవి జీవితం నుండి సూటిగా వెలువడుతుందని, కవి అంతర్ముఖుడై జీవితంలోని నానా పరిస్థితుల పట్ల తన

స్పందనను వ్యక్తం చేస్తాడని పాటిబండ వారు అభిప్రాయపడతారు. ఆయన భావ కవిత వైశిష్ట్యాన్ని ఇలా వ్యక్తం చేస్తారు– "అందుకనే ఈ భావ కావ్యములు అందరికి అన్ని యవస్థల యందును రుచించవు. కవి ఎట్టి భావస్థితి యందు కావ్యమును భావించినాడో అట్టి భావస్థితిని పొందగల కొందరు పఠితలకు కొన్ని సమయములందే ఇవి రుచించగలవు. ఆ స్థితి నందు కొన్నప్పుడు మాత్రము ఈ కావ్యములొసగు ఆనందము అనంతము, నిశితము, గంభీరము. ఒకసారి హృదయమును తాకిన కావ్యము, ఒక 'అనిర్వాచ్యమైన అనుభూతి' వలె జీవితాంతము వరకు పఠితను వెన్నాడుచునే యుండును. మహాకావ్యము లందనేక పర్యాయములు గలుగు రసానందము ఈ కావ్యములందొకేసారి కలుగును. మరియు రసోన్మీలన క్రమమునందొకే యనర్థ వ్యక్తము చేయబడు వీనియందు కొన్ని యెడల రససిద్ధి సంపూర్ణమగుట లేదు. పఠితకు గిలిగింత గొల్పుటయే వీని ప్రయోజనము" (పేజి: 15) మహాకావ్యాల్లో నవరసాలు ఒలికేందుకు అవకాశముంటుంది. రసానందం సంపూర్ణంగా భావుకులకు కలుగుతుంది. మహాకావ్యాలు కాని, ఖండకావ్యాలు కాని వస్తువును ఆశ్రయించడం వల్ల, పాత్రల చిత్తవృత్తి వైశిష్ట్యం, వైలక్షణ్యాల వల్ల స్ఫూర్తిగా సహృదయులకు రసానుభూతి కలుగుతుంది. కాని భావకవితల్లో కథా వస్తువు కొరవడినందువల్ల, పాత్రలు చాలావరకు అనామధేయులు కావడం వల్ల, కవి పరిమితమైన భావనాబలం కారణంగా రసానందం ఒకేసారిగా కలిగినా అది సంతృప్తిని మాత్రమే కలిగిస్తుంది కాని పరిపూర్ణమైన తృప్తిని ప్రసాదించదు. పైగా పరిశోధకులైన పాటిబండవారు "పఠితకు గిలిగింత గొల్పుటయే వీని ప్రయోజనము" (పేజి: 15) అని చెప్పడం భావ కవిత్వ ప్రభావ పరిధిని పరిమితం చేయడమే అవుతుంది.

పాటిబండ మాధవశర్మ గారు అన్న ఈ మాటలు మననం చేయదగ్గవి. మరీ మరీ మథనం చేయదగ్గవి కూడా. "స్వతంత్రబుద్ధి, సౌందర్య పిపాస కల సహృదయుడు ఈ వ్యాసము ('ఆధునికాంధ్ర భావకవిత్వం') ను చదివిన పిమ్మట లభ్యమైన ప్రతి భావ కావ్యమును పఠించి, సమకాల చైతన్యమును, ఉత్సాహమును, శోభను అక్షయముగ అనుభవింప గలరని కోరుచున్నాను. (పేజి: 17) శర్మగారు తర్వాతి పేజీలో ఇలా చెప్పారు– "క్షీణ యుగము నందతర్వాహినియై పోయిన ఆంధ్రకవితా సరస్వతి ఈనాడు తిరిగి సాక్షాత్కరించినది. ఈ వర్వ సమయము నందు నిర్మలాంతఃకరణముతో, ఈ ప్రవాహము నందోలలాడ నోచిన పుణ్యులు సమకాల ప్రపంచమునకు ప్రాణభూతమైన మహాచైతన్యము ననుభవించి ఆనంద మూర్తులై తరింపగలరు." (పేజి: 18) పాటిబండ మాధవశర్మగారి పై మాటలు గమనించదగ్గవి.

భావకవిత్వంలో సమకాలీన సాంఘిక పరిస్థితుల కారణంగా కవి కుమారుల్లో పెల్లుబికిన భావ పరంపర పఠితల్లో ప్రాణాధారమైన మహా చైతన్యాన్ని కలిగిస్తుందని శర్మగారు చెప్పారు. ఈ భావ కవితా ప్రవాహంలో మునిగి తేలే పాఠకమహాశయులు అది వెలువరించే మహా చైతన్యాన్ని అనుభవించి "ఆనంద మూర్తులై తరింపగలరు" అనడంలో పాటిబండ వారు భావకవిత్వం రసానందాన్ని కలిగిస్తుందని విశ్వసించారే కాని పాఠకులు సమకాలీన స్పృహ కలిగి, దుష్టశక్తులతో పోరాడే ప్రజ్ఞ (స్పృహను) పొందాలి. పొందగలరని వూహించ లేదు అథవా భావించలేదన్న సంగతి వ్యక్తమవుతుంది. రసపక్షపాతి, ప్రాచీన కావ్య సంప్రదాయవాది, భావకవి అయిన పింగళి లక్ష్మీకాంతంగారి గరిడీలో చదువు సాములు నేర్చిన మాధవశర్మగారి మనస్సులో కాల్పనికత వేరూరినంత ప్రబలంగా అభ్యుదయ దృక్పథం నాటుకోలేదన్న సంగతి స్పష్టమవుతుంది.

పాటిబండ వారు తమ లఘు సిద్ధాంత గ్రంథం 'ఆధునికాంధ్ర భావకవిత్వం' రచించేటప్పుడు (1935) పాతికేళ్లవారే. శర్మగారు ఆధునికాంధ్ర కవిత్వంలోని నవయువ కవుల రచనల్ని లోతుగా అధ్యయనం చేసినా, వాళ్లను విడివిడిగా భావించకుండా, ఒక విలక్షణ భావజాల చిత్రణ చేసే సముదాయంగా దర్శించారు. అందువల్ల గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, నోరి, శివశంకరశాస్త్రి, బాపిరాజు, వేదుల, దువ్వూరి రామిరెడ్డి మొదలైన వారి కవిత్వాన్ని సమగ్రంగా, పరిశీలించారేకాని వీళ్ల మధ్య భిన్నరాగాలు తీసిన గురజాడ, శ్రీశ్రీల వైలక్షణ్యాన్ని పూర్తిగా ప్రదర్శించలేక పోయారు.

**"వెనుక చూచిన కార్యమేమోయ్!**
**మంచి గతమున కొంచెమేనోయ్!**
**మందగించక ముందు అడుగెయ్ !**
**వెనకబడితే వెనకేనోయ్!"** **(పేజి:13)**

అన్న గురజాడ వారి మాటల్ని ఉటంకిస్తూ "దానితో కవులు పురోగమనము సాగించిరి. భూతమును భూస్థాపితము గావించి, భవిష్యత్తులోనికి దృష్టి సారించిరి. అంతయు అంధకారము. భవిష్యత్తులో వారికేదియు ఆలంబనము దొరకలేదు." అని అంటూ పెద్దిభట్ల పూర్ణశర్మగారి ఈ కవితా పంక్తుల్ని ఉదహరిస్తారు.

**"నడచుచుందును ముందునకు నే**
**నడచుచుందు నిరంతరంబును**
**ముందు వెన్కల గూర్చి చింతన**
**డెందమున లేదు"** **(పేజి:13)**

ఈ గీత పంక్తుల్ని ఉటంకించిన పాటిబండవారు ఇలా అంటారు. "వెనుక శూన్యము. ముందు నిరాశ. భవిష్యత్తునకభిముఖులై కవులు వర్తమానమునే భజించిరి. (పేజి :13) గురజాడ దర్శించిన భవిష్యత్తు ఆశాజనకమైనదే. అనుసరణీయమైనదే. ఆయన బాటలోనే పదడుగులు ముందుకు వేస్తూ, ఉత్సాహంతో, గబగబా నడుస్తూ...

**"మరో ప్రపంచం, మరో ప్రపంచం**
**మరో ప్రపంచం పిలిచింది**
**పదండి ముందుకు పదండి త్రోసుకు**
**పోదాం పోదాం పైపైకి" (పేజీ: 13)**

అంటూ పర్జన్యంలా గర్జించిన శ్రీశ్రీ మాటలు యువ మాధవ శర్మగారికి ఇలా తోచాయి. "రష్యా మహోద్యోమము యువకుల నాకర్షించినది. భవిష్యత్తులో అస్పష్టరూపములో ఏదో క్రొత్త భారత ప్రపంచము కనిపించినది." (పేజీ: 13) భావకవుల్లో చాలామంది "నాకుగాదులు లేవు, ఉషస్సులు లేవు" అంటూ... నిరాశ నిస్పృహల్లో కృంగి కృషించి పోతుంటే శ్రీశ్రీలో ఈ ఉత్సాహం, ఈ ఉద్రేకం, ఈ బంగారు కలలు ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయంటారు? గురజాడవారి ఆశావాదాన్ని పుణికి పుచ్చుకొని శ్రీశ్రీ ప్రగతి పథంలో పరుగులిడుతుంటే, ఈ భావకవులు అంతర్ముఖులై, సంక్షుభిత సమకాలీన సంఘ దుస్థితిని గమనించకుండా ప్రణయగీతాలు పాడటమేమిటి? శర్మగారు శ్రీశ్రీ రచించిన ఒక క్షణంలో! అన్న కవితను ఉదహరించే ముందు రాసిన క్రింది వాక్యాల్ని గమనించండి- "ఈ కావ్యములు ఏక భావోదయములు. కావ్య పఠనమున పఠిత ఉబికి, చల్లారుసరికి కావ్యము ముగిసిపోవుచున్నది. అంతయు ఒక్క క్షణము ఒక్క మెరుపు, ఒక సుఖ స్వప్నము వలె, సంగీతములోని ఒక స్వర మూర్ఛన వలె, భగవత్సన్నిధిని క్షణమాత్ర లభ్యమగు ఒక దివ్యానుభూతి వలె ఈ కావ్యములు లఘువులు, తీక్షణములు. ఈ యంశమునకు లక్షణము, లక్ష్యము గాదగిన ఒక ఆధునిక భావ కావ్యము నుదాహరించుచున్నాను." ఈ మాటలు పీఠికలా, వ్యాఖ్యానంలా, విమర్శలా వుంటే అందుకు లక్ష్యంలా ఈ గీతాన్ని ఉదహరించారు.

**ఒక క్షణంలో!**
**ఒక క్షణంలో**
**మనస్సులో ఎదో స్మృతి**
**తటిన్మణి**
**మణీ ఘృణి**
**ఏదో మతి వికాసించి**

**క్షణంలో**
**అదే పరుగు**
**మరేదకో .....**
**ఆకులలో చీకటిలో**
**ఇరుల ఇరుకులలో**
**చినుకులలో**
**ఏడనో మరపులలో**
**మరపుల మడతలలో**
**కనబడక!**

**ఒక క్షణంలో**
**పూర్వపు సఖుని ముఖం**
**నవ్వులతో**
**రంగుల పువ్వులతో**
**కలకలమని కళలు కురిసి**



**హర్షంతో**
**ఆశావర్షంతో**
**కనుల వెనుక తెరముందర**
**కనిపించి**
**మరుక్షణం**
**విడివడి మరేదకో !**

**ఒక క్షణంలో**
**సకల జగం**
**సరభస గమనంతో......**
**పిమ్మట నిశ్శబ్దం**
**ఆ క్షణమందే.**
**గుండెల కొండలలో**
**మ్రోగుచు మార్మోగును**
**హుటాహుటిన పరుగెత్తే**
**యుగాల రథనాదం! (పేజీ:27-29)**

**'ఒక క్షణంలో!'** కవితలో రెండు రకాల భావాలు కనబడతాయి.

**"ఒక క్షణంలో**
**మనస్సులో ఏదో స్మృతి**
**మరోక్షణం**
**విడివడి మరేదకో!**
**వడివడి మరేదకో! "**

ఈ పంక్తుల్లో యువకవి శ్రీశ్రీకి ఏదో జ్ఞాపకం వచ్చి మెరుపుల కాంతుల్లో మనస్సు వికసించినట్లని పిస్తుంది. విస్మృతి గర్భంలో ఇరుక్కుపోతాడు కవి. ఇంకో క్షణంలో గతకాలం నాటి స్నేహితుని తియ్యటి జ్ఞాపకాలతో దిక్కుతోచక బాధపడతాడు. కాని వెనువెంటనే అతని గుండెలో యుగరథం పరుగెత్తిన శబ్దం మారుమోగుతుంది. శ్రీశ్రీ కవిత 'ఒక క్షణంలో'! రకరకాల భావనలు వెలుగు చూస్తాయి. శ్రీశ్రీ 'క్షణంలో చీకటిలో చిక్కుకొని విలవిల లాడుతాడు' నిరాశకు లోనయి భావకవిగా అవతరిస్తాడు. మరో క్షణంలో 'యుగాల రథనాదం' వింటున్న అభ్యుదయ కవిగా సాక్షాత్కరిస్తాడు. ఈ కవితలో శ్రీశ్రీ భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం ఈ రెండు మార్గాల మధ్య చిక్కుకొన్న కవిగా

అగుపడతాడు. అలాంటప్పుడు మాధవశర్మగారు శ్రీశ్రీని ఏ యుగ కవిగా భావిస్తారు? సంభావిస్తారు? శ్రీశ్రీ ప్రారంభ కవిత్వంలో భావకవిత్వ ఛాయలు స్పష్టంగా గోచరించినా, స్వల్పకాలంలోనే కృష్ణశాస్త్రి ప్రభావం నుంచి తప్పించుకొని తనదైన కొత్తబాటను ఎన్నుకొన్నాడు, కొత్త మాటను సృష్టించుకొన్నాడు. శ్రీశ్రీతో శర్మగారికి గాఢస్నేహం వుండి కూడా ఆయన కవిత్వాన్ని సూక్ష్మంగా, స్పష్టంగా పరిశీలించలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

పాటిబండ మాధవశర్మగారు శ్రీశ్రీ కవిత్వాన్ని లోతుగా చదివినా అతని కవిత్వంలో బుసలు కొడుతున్న నవ్యకవితావేశాన్ని అభ్యుదయ భావనల్ని ఆధునికాంధ్ర కవిత్వంలో మైలురాళ్లుగా పరిగణించక పోవడం విచారకం. శ్రీశ్రీ కవితా నవీనతను గుర్తించేందుకు మారుగా ఆయన ఛందస్సులోని విశిష్టతను ప్రశంసించారు. "ఆధునిక భావకవులలో నూతనచ్ఛందో విధానములందె దీక్షతో పాల్గొనుచున్న యువకుడు శ్రీనివాసరావు. ఛందస్సులలో అపూర్వమైన వైవిధ్యము, వైచిత్ర్యము నీ కవి ప్రదర్శించుచున్నాడు. ఛందస్సు దెసనే లక్ష్యముంచి అర్థమును నిర్లక్ష్యము చేయుటవల్ల ఇతని గేయములు కొన్ని దురవబోధము లగుచున్నవి. ఇతని 'విద్యున్మాలికలు' అను కావ్యము గణనియమరహితమైన గద్య రచన. కాని భావములో, భాషలో, కూర్పులో మంచి వశీకరణశక్తి యున్నది." (పేజి:63) శ్రీశ్రీ భావాల్లో, భాషలో, కూర్పులో 'మంచి వశీకరణశక్తి' యున్నది అని పసికట్టిన పాటిబండవారు ఆధునికాంధ్ర కవిత్వంలో కొత్తబాట వేసిన శక్తిమంతమైన, ప్రభావోత్పదకమైన 'మహాప్రస్థానం', అవతారం, సుప్తాస్థికలు, బాటసారి కవితల్ని తమ గ్రంథంలో పూర్తిగా ఉటంకించి శ్రీశ్రీ ఛందోశిల్ప వైవిధ్యం, భాషా వైలక్షణ్యాల గురించి ఎక్కువగా వివరించారే కాని కవితా అగ్ని పుష్పాల జ్వాలల్ని విశ్లేషించే అవసరమైన ప్రయత్నం చేయలేకపోయ్యారు. శర్మగారు శ్రీశ్రీ కవిత్వాన్ని ఇలా బేరీజు వేశారు. "భావములు విశేషమైన తీక్షణత, తీవ్రత గలవి. ఆవేశమును ఛందస్సులలోనికి పీల్చుకుని పఠితలో బలవంతముగా ఎక్కించగలడు. చైతన్యము, ఆవేశము, పుష్కలముగా గలవాడు భవిష్యత్తులో గొప్ప ఆశలు మెరపించుచున్నాడు." (పేజి: 185) శ్రీశ్రీ కవిత్వంలో చైతన్యం, ఆవేశం పుష్కలంగా ఉందని పసిగట్టిన శర్మగారు అతను ఆధునికాంధ్ర కవిత్వ ప్రపంచంలో ఏవైపు మహాప్రస్థానం సాగిస్తున్నాడో స్పష్టంగా చెప్పకపోవడం పాటిబండవారి విమర్శనా లోపమని భావిస్తే తప్పు కాదనుకుంటాను.

పాటిబండ గారి 'ఆధునికాంధ్ర భావకవిత్వం' విశిష్టత గురించి తెలుసుకుందాం. భావకవిత్వం పుష్పించిన దశలోనే దానిపై వజ్ర ప్రహారం చేసిన ఘనుడు అక్కిరాజు ఉమాకాంతం పంతులు. వీరి 'నేటికాలపు కవిత్వం'(1928)లో భావకవిత్వ భావము, వస్తువు, రచనలపై ఉమాకాంతంగారి తార్కిక ప్రావీణ్యం వల్ల వెలువడ్డ విమర్శను ఎదిరించే దొమ్మలు లేక ఆనాటి విమర్శకులు మిన్నకుండిపొయ్యారు. పాటిబండవారి 'ఆధునికాంధ్ర భావకవిత్వం' ఒక వేళ ఆకాలంలోనే అచ్చైవుంటే భావకవిత్వ స్వరూప స్వభావాలు వాటి వైశిష్ట్యం నాటి, తర్వాతి పాఠక లోకానికి తేటతెల్లమై ఉండేవి. అట్లే అప్పుడు మునుముందుకు దూసుకుపోతున్న శ్రీశ్రీ అభ్యుదయ కవితలు పాఠకుల్ని కదిలించి వేసి ఉండేవి. అంతేకాక అటు భావకవిత్వం ప్రాసంగికత, ఇటు అభ్యుదయ కవిత్వ ఆవశ్యకతలు పాఠకుల హృద్గతమై ఉండేవి.

పాటిబండవారు ప్రాచీన కావ్య శాస్త్రాన్ని లోతుగాను, పాశ్చాత్య కావ్య శాస్త్రాన్ని తగినంతగా అభ్యసించినవారే. భావకవిత్వ ఆవిర్భావ వికాసాల గురించి శర్మగారి అభిప్రాయాల్ని గమనిద్దాం. వారు "భావమునాశ్రయించినది" (పేజి: 42) భావకవిత్వమన్నారు. అంతేకాకుండా "భావాశ్రయములైన కావ్యములన్నియు, కథావస్తు సంపర్కములేని కావ్యములన్నియు భావ కవిత్వము" (పేజి: 45) అని చెప్పారు.

శర్మగారు అంతర్ముఖత్వం, స్వేచ్ఛాగానం, ప్రాచీనకావ్య లాక్షణిక నియమ ఉల్లంఘనం అప్రాప్త సౌందర్యాన్వేషణ, అతీంద్రియమైన ప్రేమ, మానసిక అశాంతి, నిరాశ నిస్పృహలు, కోమల కాంత పదవళి, గేయత మొదలైన వాటిని భావకవిత్వ ప్రధాన లక్షణాలుగా పేర్కొన్నారు.

అంతేకాక ఉదాత్తమైన భావం, ఉత్కృష్టమైన ఉపమానాలు ప్రౌఢమైన శిల్పం భావకవిత్వానికి ప్రధానమన్నారు. మాధవశర్మగారి అధ్యయనం లోతైనది, అనుశీలన సూక్ష్మమైనది. భావకవిత్వ వైశిష్ట్యాన్ని వివరిస్తూ నోరినరసింహశాస్త్రి, తల్లావఝ్జల శివశంకరశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రిగార్ల ఒక్కొక్క కవితను ఉదహరించి ఆ కవితల విశిష్టతను పేర్కొంటూ వేదుల, శివశంకరుల, నోరి గార్ల కవితల్ని ఉత్తమ, మధ్యమ, సామాన్యమైనవి నిర్ధారించారు.(పేజి:30-33)

మాధవశర్మగారు గురజాడ, పింగళి-కాటూరి, విశ్వనాథ, దేవులపల్లి, శ్రీశ్రీ ప్రభృతుల కావ్య భాషను లోతుగా పరిశీలించి చెప్పినా మధ్యమణి న్యాయపక్షమే వహించారని చెప్పవచ్చు. "విశేషించి గేయములందు వ్యావహారిక భాషయే. ఉత్తములందు నిరపవాదముగా గ్రాంథికమే. మొత్తం మీద అభిరుచిని సందర్భమును బట్టి గ్రాంథిక, వ్యావహారిక భాషలను రెండింటిని వాడుతున్నారని చెప్పగలం. గాని ఇదమిత్థమని నిశ్చయించి చెప్పజాలము." (పేజి:89) అని అంటూనే "గ్రాంథిక భాషను నిరసించకపోయినను ఈ యుగము వ్యావహారిక భాషా ప్రయోగము దిశకే మొగ్గుచూపుతున్నది." (పైపేజే) పాటిబండ వారు తమ అభిప్రాయాన్ని మరోవైపు తిప్పుతారు. శర్మగారి విమర్శలో ఇలాంటి విచికిత్స పలుతావుల్లో ప్రత్యక్షమౌతుంటుంది.

మాధశర్మగారు తమ గ్రంథంలో పెద్దబొట్ల పూర్ణశర్మ, తురగ వెంకటరామయ్య, కుందుర్తి నరసింహారావు, కర్లపాలెం కుటుంబ


శాస్త్రి, పూడిపెద్ది వెంకట రమణయ్య మొదలైన భావకవుల కవితల్ని సమకాలంలోనే ప్రస్తావించడం గమనార్హం. అల్లే అప్పుడప్పుడే తెలుగు కావ్యక్షేత్రంలో కాలుమోపుతున్న కాంతామణులైన 'సౌదామిని, తల్లప్రగ్గడ విశ్వసుందరమ్మ, చావలి బంగారమ్మ, బెల్లంకొండ కనకమ్మల కవితల్ని ఉదాహరించి సమీక్షించిన మాధవశర్మగారి సహృదయత స్తుత్యం.

పాటిబండవారు పుస్తకం చివరి పేజీల్లో భావకవిత్వ వికాసాన్ని సమీక్షిస్తూ భావ కవుల కవిత్వంలోని వైశిష్ట్యాన్ని తైపారు వేసిన విధానం గమనించతగ్గది. శర్మగారు 'పీఠిక'లో "ఈ వ్యాసమునందు భావకవిత్వమును భావుకులైన సారస్వతోపాసకులకు పరిచయం చేయుటకు యత్నము చేయబడినది. ఇందు వికసనోన్ముఖములై వున్న మహాశక్తులు వివరించబడినవి అని వినమ్రంగా చెప్పారు. కాని ఈ లఘు సిద్ధాంత వ్యాసం అంతకంటే ఎన్నోరెట్లు గురుతరమైన బాధ్యతను విజయవంతంగా నెరవేర్చిందని చెప్పొచ్చు.

చివరి మాట. "విపరీతవాదుల చైతన్యము, అతివాదుల ఆవేశము, మితవాదుల సంస్కారము, కూర్చుకొనినవాడే మహాకవి కాగలడు. అతని యాగమనమును చాటుచున్న వైతాళిక గానమే ఆధునిక భావకవిత్వము. ఆ మహాకవి యాగమనమునకై ఆంధ్రదేశము నీరీక్షించుచున్నది." (పేజి :186) అని మాధవశర్మగారు మంగళం పాడారే కాని భావకవిత్వ యుగ వైతాళికుని నామకరణం చేయకుండా పోవడం మాత్రం కవితా ప్రియంభావులకు ఉత్కంఠను, జిజ్ఞాసను, అసంతృప్తిని మిగిల్చి పొయ్యారు.

## సాహితీ తేజం దేవులపల్లి ప్రభాకరుడు!!

తెలంగాణ పాత్రికేయ దిగ్గజం
ఆరు దశాబ్దాల సాహితీ మూర్తిమత్వ ఉత్తేజం
రాజకీయాలలో ఆరితేరిన రణసింహం
తెలంగాణా అధికార భాషా సంఘానికి
తిరుగులేని ఆరు వసంతాల ఏకైక తొలి రథ సారథి
ఇంటిపేరు దేవులపల్లి
సాహితీ సంస్కృతుల కల్పవల్లి,
వయస్సు మీరినా ఇంచుకైనా వాడి వేడి తగ్గని
రాయ గజకేసరి
కాకలు తీరిన కాకతీయ పౌరుష కలంతో కుస్తీలు పట్టి
గెలుపు దిశలో పయనించిన విజయపతాక
పివి, దాశరథి, కాళోజీ, ఆచార్య జయశంకర్
వంటి ఉద్దండులతో
కొనసాగిన సజ్జన సాంగత్యం,
తెలుగు పాత్రికేయత్వంతో
ముడిపడిపోయిన జీవనయానం
కాలమిస్టులలో స్పెషలిస్ట్
పసిడితనంతో వాడని సుగంధాలై నిలిచిన
అద్వితీయ రచనలు
వర్తమాన వార్తామానంలో అజేయం
ఆణిముత్యాలైన సామాజిక వ్యాసధారలు
ఊపిర్లున్నంతవరకు కొనసాగిన విశేషముక్తసిర కాలం
ఎంత చెప్పినా వొడువని తెలంగాణా రాజకీయ
సాంస్కృతిక సాహిత్య ముచ్చట్ల ముఖచిత్రానికి
జవజీవాలు పోసిన యావ తీరని కలం
తెలంగాణ తొలి, మలి ఉద్యమాలలో
భాగస్వామి, ముఖ్యమంత్రి కేసిఆర్‌తో
ఉద్యమ నేపథ్యం,



మాజీ ముఖ్యమంత్రి రోశయ్య,
అగ్రజుడు రామానుజుల జీవితచరిత్రలు
ప్రాణప్రతిష్ఠ చేసిన ధీరుడు
రవిగాంచనిది వ్యాస ప్రభాకరుడై గాంచి నిత్య వెలుగులతో
ప్రభవించిన సరస హృదయ పాళీయుడు
ముఖే ముఖే సరస్వతి
గోదారి గలగలల వాగ్ధాటి
మేటి ఉపన్యాస రసకేసరి
తెలంగాణా తల్లికి అంకితమై
బతుకునావను ఈదిన పుణ్య సాహిత్యజీవి
కలంతో కాలాన్ని, వయస్సును
సునాయాసంగా జయించి
చైతన్యస్ఫూర్తియై నిలిచిన వీరవిక్రముడు
ఎనబైల్లో లోకాన్ని విడిచి అమరుడైన ప్రభాకరుడు
వారి పాఠీ స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శి
అందుకో మా నివాళి....

**సంకేపల్లి నాగేంద్ర శర్మ,** ఫోన్ : 807 482 6371

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2022

# వికాసరేఖలు

గురిజాల రామశేషయ్య
ఫోన్: 9494715445

వాల్మీకి ని చెట్టు మీది పక్షి 'జంటే' కవిని చేసింది. నన్నేమో (రాశేకలం) తన రంగును నా 'కనుచూపులకద్దిన మంకెన (సంస్కృతంలో : బంధూకం) పువ్వు నన్ను "కవి"ని చేసింది. పూల'ఋణం తీర్చుకోవటానికి నేను తర్వాత్తర్వాత అక్షరాలా చాలా అక్షర పుష్పగుచ్ఛాలను చెట్లకు పూలచెట్లకు బహుమతిగా అందజేసిన – ఇంకా ఇంకా అందజేస్తా. మోస్తరు బహుమతి'వస్తువులు ఉన్నవాళ్లకే లేటెస్ట్ మోడల్ చిరకాలం మనగల వస్తువులను బహుమతిగా ఇచ్చినట్టు. ( రాశేకలం )

మా ఊళ్లో ఉత్తరపు ముఖద్వారం ఇల్లు మాది. వాకిలి గడప దాటి పడమటి వైపు మళ్లీ ఓ 200 అడుగుల 'నడక లోపట్నే మళ్లీ ఉత్తరం'వైపు మళ్లంగనే ఊరబాయి(బావి) ...పక్కన ఆ బాయి' తవ్వించిన నాటి ఆ బాయిదే అయిన ఆనాటి మొరం 'పోతమన్ను నాటి ఎత్తుబాట పై నిలబడంగనే ఈశాన్యం 'దిక్కుకు చూడంగనే నా చిననాడు నా'కనుచూపు కంటిన లాంగ్ షాట్ పెద్ద'రంగుపువ్వు మా బాపనిబాయి గడ్డమీది మంకెన చెట్టుపువ్వు.

మా బాపనిబాయి మాఊరి 'పెద్దచెరువు' కిందిదే అయినా ఎడగారు 'కత్తెర (కృత్తిక) పంటకోసం ...మృగశిర ముందస్తు వరి 'నారుపోత కోసం మా వంశపూర్వులు నలుగురు తాతలు తామే కలిసి స్వయంగా తవ్వుకున్న మోటబావి మా బాహ్మణబావి...నేనూ మోటకొట్టిన...బురద'నాగలి దున్నిన...ఎండాకాలం ఇంటి'కొట్టం పెంటమట్టిబండ్లు 'సంతోషంగ నడిపిన బండితొట్లల కూర్చొని...నేను స్వయంగా పురికోస (గోగునార 'సుత్లీ) తాళ్లతో తయారు చేసుకున్న స్పెషల్ చర్నాకోల తో బండెడ్లను అదిలిస్తూండేవాణ్ణి

\+ + +

మా లక్ష్మయ్య 'తాత భీమ బలుడట. ఎయ్ బాపనోళ్ల పిలగా...భోజనం అయింది గదా...సరే ఇట్రా... నేను మా'పొలం దగ్గరి మామిడి చెట్టు చూసుకోవటానికి పోతున్న... పెద్ద గోగునార బస్తా గట్టిది' తీస్కొని నా వెంబడి'రా...అని పిలుచు'కొని పోయిన రెడ్డిగారు అక్కడికి పోయినాక ఎయ్...పిలగా...నీవు మోయగలిగేటన్ని మంచి మామిడి'కాయలు తెంపుకో ఏడాది ఇంటి మామిడికాయ' పచ్చడికోసం అన్నడట. ఇంకేముంది...మా లక్ష్మయ్య తాతయ్య వెంట తెచ్చుకున్న పెద్ద 'గోగునార బస్తా'నిండా పట్టేటన్ని మామిడి కాయలు తెంపుకొని ఆ బస్తాకే కుచ్చి 'ఉండే దబ్బడం(ణం) పురికోస (సుతిలీ) తాడుతో బస్తా 'మూతిదగ్గర దృఢంగా కుట్లు'వేసుకొని నిలబడ్డడట. 70 ఏండ్ల'వయసు దాటిన రెడ్డిగారు ఆ బస్తాను దూసి ఒయ్...పిలగా ...ఈ బస్తా నీ నెత్తికెత్తటానికి దగ్గరికెవరొచ్చే జాడగన్పడ్తలే! ఈ మామిడి 'చెట్టేమో కాస్త చుట్టు'ఎత్తున్న జాగల ఉండె...అదీ ఇంక కోయని పొలం మధ్యలో ఉండే... తర్వాతనైనా ఎడ్లబండిక్కడిదాన్క రాదు. మరెట్లా అన్నడట. ఆ మాటలు విన్నడో లేదో మా లక్ష్మయ్య తాత ఆ మంచి మామిడికాయల నిండుబస్తాను... ఆ పెద్ద నిండు బస్తాను కాస్త పక్కన రెండుమూడు అడుగుల లోనున్న జాగకాడ్కి గుంజి తర్వాత అడుగులు వేయటానికి అనువుగా ఉన్న ముందే చూసి 'పెట్టుకున్న బాట ఒంపులకు దిగి తన నెత్తిని వంచి బస్తా నడుమన కుదురు' పొందుజేస్కొని నిక్కి 'నిగ్గి' నిల్చి మళ్లీ నెత్తిబరువుకు తగ్గట్టు మెడ బరువును బస్తా అంచులను రెండుచేతులతో సైజేస్కొని వెనక్కుజూడకుండ ఆబస్తా మామిడికాయలు'దెచ్చి మా చతుశ్శాల భవంతి నట్టింట్ల పడేసిండట...తెల్లారి మళ్లా కలిసినప్పుడు ఆ రెడ్డిగారు మా తాతను నీ పేరు ఇకనుంచి భీముడు అనిపిలుస్తపో పిలగా అన్నడట. మా గురిజాల గోపాలకృష్ణ శాస్త్రి పెదనాయిన...... ఇప్పటికి ఉండి'ఉంటే 110 ఏండ్లకు దగ్గరి వయస్సు 'పెద్ద... పెదనాయిన గురించి ప్రస్తుతం ఒకటే అంశం చెప్త... ఈయన సంస్కృత గ్రంథం కాదంబరిని తెలుగు నాటకం గా అనువదించిన విద్వత్కవి.... నా డిగ్రీ తరగతుల సెలవురోజుల్లో నేను ఊరికి'పోయినప్పుడు పెదనాయినను గౌరవంగా మా ఊరి'పెద్దమనుషులుగ పేరున్న కుటుంబాల వాళ్లు ఏవైనా కార్యాలకు పిలిస్తే వచ్చేవాడు... మా ఊరిలోని ఒక్క బాపనోళ్ల మా 'యింట్లోనే మధ్యాహ్న'భోజనం కనుక మా ఇంటికి వచ్చినపుడు నేను ఆసక్తితో అడిగితే మా పూర్వ 'పెద్దల గురించి ఇలాంటి' ముచ్చట్లు చెప్పేవాడు.

\+ + +

ఇనుప'గుండె ట్రాక్టర్ల దున్నకం రోజుల కంటె ముందు మన అందరి కుటుంబాల్లో మానవ రూపంలో కలియుగ 'భీములు మాత్రమే కాదు రాఁవుడూ – భీఁవుడూ వంటి ముద్దుపిలుపు' పేర్ల కోడెగిత్తలు ఎడ్లూ ఉండేవి. ఆమధ్య నాకు ఇష్టమైన ఎర్రెద్దు నా కలలోకొచ్చింది. నిద్ర లేచిన తరువాత ఎర్రెద్దు ఆత్మకు దండం పెట్టుకున్న. ఇప్పుడెక్కడ ఏ జన్మ 'యెత్తి యెట్ల ఉన్నవో అనుకుంటూ...

ఓం పశుపతయే శివాయ నమః

ఓం బంధూక 'పుష్ప సంకాశాయై లలితా పరాభట్టారికాయై నమః

ఓం గోపాల'నందకిశోరాయ యశోదానందదాయ బాలకృష్ణాయ నమః

బోనస్ ++

చేత **వెన్నముద్ద**... నెత్తిన **నెమలీక**...చిన్నిబాలకృష్ణుడు ఏమిటంటే అందుకోండి... బి వేటూరి సుందర' రామ (కవితా) మూర్తి మాటబొమ్మ చిత్రం.

నందుని 'నట్టింటి కరి 'లేగదూడ (వేటూరి'పాట'లోని లైన్ )

# సినిమాకు ప్రాణం పోసిన సుద్దాల పాట

**ఎం. విప్లవ కుమార్,** ఫోన్ : 9515225658



పాట చైతన్యానికి ప్రతీక. పాట పని పాటల గీతిక. పాట ఉద్యమాల పీఠిక, తిరుగుబాటు బావుట. పాట విస్తారమైన భావాన్ని అతికొద్ది పదాల్లో ఒదిగిస్తుంది. విశాలమైన ప్రపంచాన్ని కదిలిస్తుంది. తన వెంట నడిపిస్తుంది. మట్టివాసన ఎంత సహజమో తెలుగు నేల మీద పాట అంతే సహజం. పాట వీరుల్ని కంటుంది. విప్లవాన్ని సృష్టిస్తుంది. ఆ విప్లవాల్లో ఒరిగిన వీరులను తనలోకి ఒంపుకుని స్మరిస్తూ జీవం పోసి బ్రతికిస్తుంది. అలా ఇప్పుడు ఓ పాట ఒక విప్లవ వీరుని జీవనగీతం వినిపిస్తూ, పోరాట రూపం చూపిస్తూ మన ముందుకొచ్చింది. కాకపోతే ఆ పాటను ఒక సినిమా మోసుకొచ్చింది. ఆ సినిమా మన్యం వీరులు అల్లూరి, కుమ్రం భీం బయోపిక్ అని ప్రచారమవుతూ మన ముందుకొచ్చింది.

అయితే ఇప్పుడు సినిమాల్లో బయోపిక్‌ల సీజన్ నడుస్తున్నది. ఈ బయోపిక్స్ ట్రెండ్‌లో కాల్పనికతను జోడిస్తూ చరిత్రను కన్ ఫ్యూజ్ చేసేవారికీ కొదవలేదు. ఎవరి ఊహలను తప్పు పట్టలేము. ఊహించుకునే స్వేచ్ఛనూ కాదనలేము. కానీ ఊహల పేరుతో ఉద్యమ వీరుల చరిత్రల్లో ఉన్నవి లేనివి కలగాపులగం చేసి, చరిత్రను గందరగోళంలో పడేయడం సరైంది కాదు. ఈ వాట్సప్ యూనివర్శిటీల కాలంలో కల్పనలే నిజమనుకునే స్థితికి నెట్టబడుతున్న దుస్థితిని, సినిమాలే చరిత్ర అనుకునే పరిస్థితిని మనం గమనంలో ఉంచుకుని జాగ్రతగా ఉండాల్సిన అవసరం ఉన్నది. కేవలం కాల్పనికత మీద ఆధారపడి తెరకెక్కించినది ఆర్ ఆర్ ఆర్ సినిమా. తేలికపాటి కథాంశం, విపరీత ప్రచార పటాటోపం సృష్టించిన ఈ సినిమాకు అత్యంత బరువైన విషయం మాత్రం ఒక పాట. ఆ పాటే ఈ సినిమాకు ప్రాణం పోసింది అనడం ఏ మాత్రం కూడా సత్యదూరం కాదు. ఆ పాటే కొమురం భీముడో, కొమురం భీముడో అనే పాట. అది నేడు తెలంగాణ పల్లె నాలుకల మీద నానుతూ ప్రజల్లో మార్మోగుతున్నది. రిలీజ్ అయిన రెండు రోజులకే యాబై లక్షల మందికి పైగా యూట్యూబ్‌లో ఈ పాట విన్నారు. ఇప్పుడది లహరిలో కోటి తొంబై లక్షలకు చేరగా, టి.సిరీస్‌లో యాబై లక్షలకు చేరింది. దీనికి ఒక కారణం కొమురం భీంను స్మరించడం అయితే, తెలంగాణ భాష, యాసలతో సాహిత్యం ఉన్న జానపద బాణీ కావడం మరో కారణం. అడవి బిడ్డల గోండురాజ్యం మీద నైజాం రాజ్యం, జమీందారుల ఆగడాలుండేవి. వాటిని ఎదుర్కోవడానికి గోండుజాతి కొమురం భీంను ఎలా తయారు చేసుకుందో, జల్, జంగల్, జమీన్ నినాదం ఇచ్చి గెరిల్లా పోరాటం చేసేలా అక్కడున్న భౌతిక, జీవన్మరణ పరిస్థితులు ఎలా పురిగొల్పాయో ఈ పాట అర్థం చేయిస్తుంది. "కొమురం భీముడో కొమురం భీముడో/ కొర్రాసు నెగడోలే మండాలి కొడుకో/ కొమురం భీముడో కొమురం భీముడో/ రగరగ సూర్యుడిలా రగలాలి కొడుకో" అనే పల్లవిలో ఆ వీరుడిని కన్న ఆ నేల, అడవి తన కొడుకును ఎలా తిరుగుబాటుదారుడిగా తయారవ్వాలో కోరుతున్నట్టుంటుంది.

మూడు చరణాలుగా సాగే ఈ పాటలో మొదటి చరణంలో ఒక విప్లవకారుడు రాజ్యం, దోపిడి, ఆధిపత్యంకు తలవంచకుండా నిబద్ధతతో ఎలా నిలబడాలో చెప్పినట్టుంటుంది. ఇక్కడ ఉద్యమకారుడు ఎలా ఉండకూడదో చెప్పే హెచ్చరికార్థంలో సాహిత్య నడక సాగుతుంది. రెండవ చరణంలో విప్లవకారున్ని రాజ్యం ఎన్ని చిత్రహింసలు పెడుతుందో, వాటిని ఓర్చుకుని ధైర్యం చెడకుండా ఎలా ఎదుర్కోవాలో, ఉద్యమ స్ఫూర్తిని ఎలా నిబెట్టుకోవాలో జాగ్రత్తల్ని సూచిస్తూ కర్తవ్య బోధ చేసినట్టుంటది. అదే సందర్భంలో నిర్బంధాన్ని, రాజ్యహింసను తట్టుకుని నిలబడకపోతే ఎంత చెడ్డపేరు వస్తుందో చెప్తూ, అడవీ తల్లి తన కొడుక్కి గెరిల్లా శిక్షణ ఇస్తున్న తీరును చూస్తాం. అలా క్రమంగా విముక్తి కోసం పోరాడేందుకు సిద్ధమౌతున్న గెరిల్లా యోధుడితో అప్రకటితంగానే ఒక శపథం చేయిస్తున్నట్టు కూడా అనిపిస్తది. ఇక చివరి చరణంలో ఆ సుశిక్షితుడైన విముక్తి పోరాటయోధుడు, విప్లవవీరుడు కొమురంభీం సాహసాన్ని, నెత్తుటి త్యాగాన్ని కొనియాడుతూ పాట ముగుస్తుంది. ఇక్కడ కొమురం భీం పేరు వింటే మరి కొంతమంది కుర్రవాళ్ళకు రోమాలు లేచి నిలబడుతాయి. అలాంటిది ఒక బలమైన జానపద సాహిత్య మాండలికం గంభీరమైన గొంతుతో పాటగా వెలువడ్డప్పుడు ఇక ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. త్యాగాలకు, త్యాగాల్ని స్మరించే పాటలకు తెలంగాణ ఎల్లప్పుడూ పబ్బతి పడుతూనే ఉంటది.

ఈ పాట కంటే ముందే కొమురం భీంను స్మరించుకునే ఆదివాసుల పాటలు ఎన్నో ఉన్నాయి. యోచన లాంటి ప్రముఖ తెలంగాణ వాగ్గేయకారుడు రాసిన అమరుడా కొమురం భీం నిన్ను ఎట్లా మరుతుమురో, జ్వలించే జంగు భాస్వరం – ధ్వనించే నింగి నీ స్వరం అనే పాటలను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. అయితే ఇప్పుడు ఈ సినిమా పాటను మాత్రం సుద్దాల అశోక్‌తేజ రాశాడు. ఆయన పాట వేలు పట్టుకుని నడిచినవాడు. పాట పుట్టుక, పరిణామం లోతుపాతులు తెలిసినవాడు. కనుక ఇంత ప్రభావశీలంగా రాశాడు. దానికి తన ఉద్యమ, జానపద వారసత్వం, విప్లవ పాటలు రాసిన నేపథ్యం, వేల పాటలు రాసిన అనుభవం ఉపయోగపడింది. కానీ ఆ యాస, మాండలికం ఉట్టిపడడానికి కారణం తను పుట్టిన స్థల, కాలాలతో పాటు గడిపిన పల్లె జీవితం కూడా తోడైందని చెప్పవచ్చు. అందువల్లనే ఆ పాట అంత పదును దేరి ప్రతిభావంతంగా రూపుదిద్దుకుంది. ప్రభావశీలంగా ఆకట్టుకుని కొర్రాసు నెగడై మండుతుంది.

పల్లవి నుంచే తెలంగాణ మాండలికాన్ని వాడాడు. కుత కుత ఉడుకుతుంది, భగ భగ మండుతుంది అని చెప్పినట్లు రగులుతుంది అనడానికి ఇప్పటిదాక లేని ఉపమానాన్ని "రగ రగ" అనే పద ప్రయోగంతో రచయిత రగిలించాడు. కొర్రాసు నెగడోలే (కొరకాసు అని కూడా అంటారు. ఇది భగ భగ మండే పొయ్యిలో షార్ప్‌గా మారి మండుతున్న కట్టె) ఓలే అంటే వలే అని అర్థం. ఇక చరణంలో చూస్తే "కాల్మొక్తా బాంచన్ అని వంగితె ఒగాల/ కారడవితల్లికి పుట్టనట్టేరో/ జులుము గద్దెకు తలను వంచితె ఒగాల/ తుడుం తల్లీ పేగున పెరగనట్టేరో".. ఇందులో సామాన్య ప్రజలు తెలంగాణ పల్లెల్లో ప్రతిష్టకు ప్రతీకగా వాడే 'ఒగాల అట్లైతే గనుక మా అయ్యకే పుట్టినట్టు కాదురా...' అని ప్రతిష్టగా భావించి సవాల్ విసిరే ఊరితనానికి సంబంధించిన పద వర్ణనను చేశాడు. ఒగాల అంటే ఒకవేళ అని అర్థం. అదే విధంగా గోండుజాతి వాయిద్యం తుడుంను ప్రతీకగా వాడుతూ ఆ ఇన్‌స్ట్రుమెంట్‌ను తల్లీలాగ మొక్కే సంప్రదాయాన్ని కళ్ళముందుంచాడు. "చర్మం ఒలిచే దెబ్బకు అబ్బంటే ఒగాల/ చిలికే రక్తం చూసి చెదిరితె ఒగాల/ గుబులేసి కన్నీరు ఒలికితె ఒగాల/ భూ తల్లీ చనుబాలు తాగనట్టేరో"... ఇక్కడ అశోక్ తేజ సాహిత్య కాల్పనికాద్భుత పద ప్రయోగం గమనించవచ్చు. భూ తల్లికి కూడా చనుబాలుంటాయని అందుకే ఇన్ని జీవజాతులకు, ఇన్ని కోట్ల మానవాళికి తను పురుడు పోసి సాదుకుంటుందని చెప్పాడు. 'నేలమ్మ'ను ఆ పాటలో బాలింత అని పాడి, ఈ పాటలో ఆ భూతల్లి చనుపాలను కొమురం భీంకు తాగించాడు. అశోక్ తేజలో సుద్దాల హన్మంతు భావాజాలాక్షర తత్త్వంతో పాటు, జానకమ్మ అమ్మతత్త్వం కూడా ఒదిగి ఉంది. కాబట్టే ఈ పాటలో అడివమ్మను, నేలమ్మను, తుడుం తల్లిని, కొమురం భీం తల్లిని ఇలా అందరి తల్లులను యాది జేసుకుంటాడు. అలా ఏడుసార్లు పలువిధాలుగా అమ్మ స్మరణ ఈ పాటలో ఉంటుంది.

"కాలువై పారే నీ గుండె నెత్తురు/ నేలమ్మ నుదుటి బొట్టైతుంది చూడు/ అమ్మా కాళ్ళ పారాణైతుంది చూడు/ తల్లీ పెదవుల నవ్వై మెరిసింది చూడు".. ఇక్కడ నైజాం, భూస్వాముల సైన్యాలు కొమురం భీంను హతమార్చినా, చిందిన నెత్తురు నేల నుదుట తిలకం బొట్టుగా మారింది. ఆయన నేలకంతటికి పంచిన చైతన్యం జల్, జంగల్, జమీన్ నినాదం అయ్యి మెరిసింది. అనేక భూ పోరాటాలకు, విముక్తి ఉద్యమాలకు, గెరిల్లా యుద్ధాలకు మార్గదర్శకంగా నిలిచింది. అమ్మ కడుపుకోత వృధా కాలేదని విజయాల నవ్వై మెరిసిందంటూ తల్లి పెదవుల నవ్వుని ప్రతీకగా చూపుతాడు. "కొమురం భీముడో కొమురం భీముడో/ పుడమి తల్లికి జన్మ అర్ణం ఇస్తివిరో కొమురం భీముడో"... అంటూ ఓ వైవిధ్య పద ప్రయోగంతో పాట ముగుస్తుంది. పాట పొడుగూత భూమికి అమ్మ పాత్ర ఇస్తూ వచ్చిన అశోక్ తేజ ఆ తల్లి రక్షణకు, విముక్తికి ప్రాణాల్ని అర్పించగానే కొమురం భీంకు పుడమి బిడ్డైపోతుంది. పదిమంది బాగుకోసం ప్రాణత్యాగం చేసేవారు బహుశా అశోక్ తేజ దృష్టిలో అమ్మలతో సమానం కావచ్చును. అలా ఆ పదంతో గెరిల్లా వీరులంటే నేలకు, జీవజాలానికి, సమస్త ప్రకృతికే కేర్ టేకర్స్ అని సాహసపూరిత ప్రకటన చేస్తాడు సుద్దాల అశోక్ తేజ. తెలంగాణలో తమ బిడ్డలకు పెళ్ళిచేసి ఎన్ని కట్నకానుకలిచ్చినా అత్తగారింటికి పంపించేటప్పుడు మాత్రం బర్రెనో, గొర్రెనో, మేకనో, ఆవునో ఇచ్చి పంపుతారు. దాన్నే 'అర్ణం' అంటారు. వాటినిచ్చినంత సుళువుగా ప్రజలకోసం తన జన్మనే అర్ణమిచ్చిన గొప్ప వీరుడు, గోండు జాతి పోరాటయోధుడు కొమురంభీం అని కొనియాడుతాడు అశోక్ తేజ.

అవునన్నా కాదన్నా ఇది సినిమా కోసం రాసిన పాట. అయినా సినిమా కోసం రాసినట్టు కాకుండా కొమురం భీం అమరత్వ స్మరణ కోసమే రాసినట్టు ఉంది. అప్పుడప్పుడు రౌద్రం, ఆర్ద్రత నిండిన సినిమా పాటలు కూడా హృదయాన్ని కదిలిస్తాయి. రచనా సందర్భం సినిమాదైనా, రచయిత ప్రజా కుటుంబం నుంచి ఎదిగినవాడు. కాబట్టి ప్రజా దృక్పథం నుంచి పాట రాసేలా జాగ్రతలు తీసుకున్నందుకు అశోక్ తేజ ఎంతో అభినందనీయుడు. నిజంగా తెలుగునేల గర్వించదగిన యుద్ధవీరుడి పాట పాడే అవకాశం పొందిన యువగాయకుడు కాలభైరవ కూడా అభినందనీయుడు. వందల కోట్లు పెట్టి చరిత్ర మీద ఆధారపడి నిర్మించిన ఊహాగాథ ఆర్ఆర్ఆర్. సినిమాకు ప్రాణం పోసి ఇప్పటికే తెలంగాణ ప్రజల నోళ్ళలో నానుతున్న 'కొమురం భీముడో' పాట మాత్రం కొమ్మ ఊయాల, కోన జంపాల అంటూ ప్రజల నాలుకల మీదే కాదు, గుండెల్లో కూడా చిరస్థాయిగా నిలిచి ఊయలూగుతుంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2022

# గానకోకిల 'లతా మంగేశ్కర్'

**సామల రాజవర్ధన్,** ఫోన్ : 96529 50959

దోసెడు వెడల్పు జరీ జలతారు అంచున్న తెల్లని పట్టుచీర భుజాలచుట్టూ కప్పుకొని, నవ్వుతూ "సర్వ శుక్లా సరస్వతీ" అన్నట్లున్న రూపమామెది. మరాఠీ సంప్రదాయం ప్రకారం పక్కపాపిట, రెండు జడలు, చెవులకు మంచి ముత్యాల కమ్మలు. ఈ సరస్వతీ స్వరూపాన్ని చూసిన ఎవరైనా, ఎంతటివారయినా నతమస్తకులు కావలసిందే! పాదాభివందనం చేసుకోవాలన్న కోరిక బలీయమైపోవలసిందే! సంగీతంలో మేరు శిఖరాన్నధిరోహించినా, ఆమె పాదాలు భూమిమీదనే వున్నాయి మరి! ఆ అణకువ, ఆ నమ్రత మరొకరికి రాలేదంటే అతిశయోక్తి కాదు. ఎదిగిన కొద్దీ ఒదగాలని నేర్పిన గాన సరస్వతి. అదిగో ఆవిడనే లతా మంగేశ్కర్.

ఎంతటివారినైనా, ఎటువంటివారినైనా నిర్దాక్షిణ్యంగా తీసుకొని పోవటం యమధర్మరాజు పని. అతనిముందు అందరూ సమానమే. అందుకే అతన్ని 'సమవర్తి' అన్నారు. ఈనాడు గానకోకిల లతా మంగేశ్కర్‌ను 'నీ ఆకు బయటపడిందమ్మా! పద వెళ్లిపోదాం! అక్కడ మ ఆ అందరికీ పాటలు వినిపించాలి" అని తీసుకొని వెళ్లిపోయినాడు. వసంతం రాకముందే వసంతకోకిల వెళ్లిపోయింది.

విఖ్యాత మరాఠీ కవి మడ్గూళ్‌కర్ అందంగా రాసిన సుధీర్ ఫడ్కే అమృతతుల్యంగా గానం చేసిన 'గీత్ రామాయణ్'లోని ఈ పంక్తులు యాదికి వస్తున్నాయి. తనను అరణ్యం నుండి తిరిగి అయోధ్యకు తీసుకొని వెళ్తానని పంతం పట్టిన భరతునితో రాముడన్న మాటలు....

**"జరా మరణ యాతన సుటలా కోణ్ ప్రాణిజాత్**
**దు:ఖముక్త జగలా కారే కోని జీవనాత్**
**వర్తమాన తేథే చాలే మార్గరేక్షయాచా**
**పరాధీన ఆహే జగతీ పుత్రమానా వాచా"**

మానవులందరూ పరాధీనులే. చేతుల్లో ఏమీ లేదు. గడిచిపోతున్న వర్తమాన జీవితమంతా రోజు రోజుకూ క్షయమయిపోతున్నదన్న సత్యాన్ని గ్రహించగలగాలి. ఏ ప్రాణియైనా ముసలితనం నుండి, మరణం నుండి తప్పించుకున్నదా? దు:ఖం లేకుండా ఎవరి జీవితమైనా గడిచిందా? అని ప్రశ్నిస్తూ రాముడు భరతున్ని ఓదారుస్తున్నాడు ఈ ఓదార్పు ఇప్పుడు మనందరికీ వర్తిస్తుంది. వేలాది పాటలు పాడిన లతా మంగేశ్కర్‌కు కూడా ఈ జరామరణాలు తప్పలేదు.

అయితే ఆవిడకు మరణమెక్కడిది? ఆమె కంఠం ఇంకా విశ్వాంతరాళాల్లో మారుమ్రోగుతూనే వున్నది కదా! ఆమె మరణానంతర జీవితం ఇంకా జ్వాజ్వల్యమానంగా వెలిగిపోతుంది.



ఆవిడ అమర గాయిక. దైవదత్తమైన స్వరమామెది. ఎందుకంటే ఎంతటి సంక్లిష్టమైన సంగతులైనా అతిసులభంగా పలికించే నేర్పు ఆమెకు తండ్రి నుండే సంక్రమించింది. ఆమె తండ్రి మాస్టర్ దీనానాథ్ మంగేశ్కర్. నటగాయకుడు. మైకులు లేని ఆ కాలంలో ఆయన 'కాలీచార్' మీద పాడేవాడు. అదతని రేంజ్. ఆ పిచ్ అందుకోవడం సామాన్యులకు సాధ్యం కాదు. అటువంటి దీనానాథ్ మంగేశ్కర్ కుమార్తె కాబట్టి లతామంగేశ్కర్ ఎటువంటి పాటయినా అలవోకగా పాడగలిగేది. సంగీత దర్శకులకు ఇదొక వెసులుబాటు. అంతకుముందు గాయికల రేంజ్‌ననుసరించి పాటల బాణీలు కట్టే అవసరముండేది.

ఆశాజనకమైన విషయమేమిటంటే ఆధునిక కాలంలో భరత్ బల్‌వాలి అనే యువకుడు దీనానాథ్ మంగేశ్కర్ 'కాలీచార్' మీద పాడిన నాట్యసంగీతాన్ని వినిపిస్తూ లతామంగేశ్కర్ మన్నన లందుకున్నాడు. ఆ స్థాయినందుకోవడం గొప్ప విషయం గదా!

లతా మంగేశ్కర్ తండ్రి మాస్టర్ దీనానాథ్ మంగేశ్కర్ మరాఠీ రంగభూమిపై విఖ్యాతుడైన నట గాయకుడు. మరాఠీ నాట్య గీతాలు పాడటంలో బాలగంధర్వతో పోటీ పడేవాడు. వీరిద్దరూ రంగభూమి మీద స్త్రీపాత్రలు ధరించి మరాఠీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసినారు.

దీనానాథ్ మంగేశ్కర్ మొదటిభార్య నర్మద. వారి తొలి సంతానం లతిక. మాస్టర్ దీనానాథ్ మంగేశ్కర్‌కు ఎంతో ప్రేరు ప్రతిష్టలు సంపాదించి పెట్టిన 'భావబంధన్' అనే నాటకంలోని ఒక పాత్ర పేరు లతిక. అదే పేరు కుమార్తెకు పెట్టుకున్నాడు దీనానాథ్ మంగేశ్కర్. కానీ అచిరకాలంలోనే ఆ తల్లీకూతుళ్లిద్దరూ మరణించారు. మొదటి భార్య చెల్లెలు సేవంతీబాయిని పునర్వివాహం



చేసుకున్నాడు. ఆమెను శుద్ధమతి అని కూడా అంటారు. ఈవిడను అందరూ మాయి అని పిలుస్తారు.

ఈ రెండవ భార్యకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కూమార్తె 'హరిదయ'. ఈవిడను 'హేమ' అని పిలిచేవారు. తరువాత వరుసగా ఆశా, ఉషా, మీనా. హృదయనాథ్ మంగేశ్కర్ పెద్ద కుమార్తె హరిదయ లేదా హేమలో తన చనిపోయిన కుమార్తెను చూసుకునేవాడు దీనానాథ్. అందుకే ఆమెను 'లతికా' అని పిలిచేవాడు. ఈ లతికనే రాను రానూ లతాగా మారి లతా మంగేశ్కరయింది. తండ్రితో లతకు ఆత్మీయ అనుబంధముండేది. తనను పడుకోబెట్టడానికి తన తండ్రి కె.ఎల్. సైగల్ పాడిన 'సోజా రాజకుమారీ' అనే పాట పాడేవాడని మురిసిపోతూ చెప్పుకునేది. దుర్భర దారిద్ర్యంలో జీవితం గడిపిన పండిత్ దీనానాథ్ మంగేశ్కర్ తన 42 సంవ॥ల పిన్న వయస్సులోనే పరమపదించినాడు. ఇక్కడ అనివార్యంగా మీరా భజనలోని పంక్తులు యాదికి రావడంలో తప్పు లేదు.

**"మూరఖ్ తుమ్ రాజ దియత్ హై పండిత ఫిరత బికారీ"**

అని మూర్ఖుడు రాజవుతాడు. పండితుడు బిచ్చగాడిలాగా బ్రతుకు వెళ్లదీస్తాడని తాత్పర్యం. ఇదే భగవంతుని లీల అని మీరా అభిప్రాయం.

తండ్రి చనిపోయిన తర్వాత పెద్దకుమార్తెయైన లతా మంగేశ్కర్ లేత భుజస్కంధాలపై కుటుంబభారం పడింది. అయితే దాన్ని ఆమె ఎప్పుడూ భారమనుకోలేదు. చివరి వరకూ ఆ బరువును ఇష్టంగా మోసింది. అవివాహితగానే మిగిలిపోయింది. కుటుంబం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిందని అంటే మాత్రం ఒప్పుకోలేదు. ఇదంతా తన బాధ్యత అనుకున్నది. లతాదీదీగా మిగిలిపోయింది.

చెప్పడానికి సులభంగానే వున్నప్పటికి ఈవిడ నడిచిన దారి అంత సుగమంగా లేదు. ముగ్గురు చెల్లెండ్లు. దివ్యాంగుడైన తమ్ముడు. అకాల వైధవ్యం పొందిన తల్లి. ఈవిడను మాస్టర్ దీనానాథ్ మంగేశ్కర్ మహారాణిలాగా చూసుకున్నాడు. ఎండ కన్నెరుగని ఇల్లాలామె! భర్త మరణం ఆమెకు శరాఘాతం. ఇక మిగిలింది 13 సంవత్సరాల లతా మంగేశ్కర్. మునిగిపోతున్న వారి కుటుంబ నౌకను ఏదో ఒక దరికి చేర్చవలసిన బాధ్యత తనమీద వేసుకున్నది.

ప్రఫుల్ల ఫిల్మ్ కంపెనీలో మాస్టర్ వినాయక్ లతా మంగేశ్కర్‌కు నెలకు 80 రూ॥ జీతానికి కుదిరించినాడు. మాస్టర్ వినాయక్ భార్య మీనాక్షి వీరిద్దరు మరాఠీ సంగీత నాటక సినీ రంగాల్లో విఖ్యాతులు. ప్రముఖ హిందీ చలన చిత్ర నటి నందా వీరి కుమార్తెనే! మాస్టర్ వినాయక్, మాస్టర్ దీనానాథ్ మంగేశ్కర్ స్నేహితుడు. మిత్రుని కుటుంబానికి ఇతోధిక సహాయం అందించినాడు మాస్టర్ వినాయక్.

సంగీత దర్శకుడు గులాం హైదర్ లతా మంగేశ్కర్‌కు సినిమాలో పాడే అవకాశం కల్పించాలనుకొని ఆనాటి గొప్ప సంగీతజ్ఞుడు శశిధర్ ముఖర్జీ వద్దకు తీసుకొని వెళ్లినాడు. లతామంగేశ్కర్ గొంతు పీలగా వున్నదని శశిధర్ ముఖర్జీ తిరస్కరించినాడు. గులాం హైదర్ చాలా బాధపడ్డాడు. నిర్మాతలు, దర్శకులు అందరూ ఒకరోజు లతా మంగేశ్కర్ ఇంటిముందు వరుసగా నిలబడే రోజు దగ్గరలోనే వున్నదన్న గులాంహైదర్ మాటలు అక్షర సత్యాలైనాయి. అందుకే లతా మంగేశ్కర్ చివరివరకు గులాం హైదర్‌ను మరిచి పోలేదు. ఆమె పాటలకు మెరుగులు దిద్ది హిందీ చిత్రసీమలో తనకంటూ ఒక స్థానాన్ని కలిగించినవాడు ఖేమ్‌చంద్ ప్రకాశ్. మహల్ చిత్రంలో లతామంగేశ్కర్ పాడిన 'ఆయేగా ఆనేవాలా' పాట సూపర్ హిట్టయింది. ఇక లతా మంగేశ్కర్ వెనకకు తిరిగి చూసుకునే అవసరం కలుగలేదు ఈ పాట సంగీతదర్శకుడు ఖేమ్‌చంద్ ప్రకాశ్. తొలినాళ్లలో లతా మంగేశ్కర్ ఎనిమిది చిత్రాల్లో నటించింది. మరాఠీ చిత్రాలు నాలుగు. 1942 నుండి 44 వరకు "పహ్లి మంగళాగౌర్, మాఝేబాళ్, చిముక్లా సంసార్, గజభావూ" అనేవి. హిందీలో 1944 నుండి 46 వరకు "బడిమా, సుభద్ర, జీవన్‌యాత్ర, మందిర్" అనే నాలుగు హిందీ చిత్రాలు. ఇవంతగా ప్రాచుర్యం పొందలేదు కానీ ఒకవైపు కుటుంబపోషణకు కష్టపడుతూనే భెండీబజార్ ఘరానాకు చెందిన ఉస్తాద్ అమానలీఖాన్ సాహెబ్ వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నది. ఆనాటి హిందీ సినిమాలలో ఉర్దూ మాటలు అధికంగా ఉండేవి. ఈ మరాఠీ పిల్లకు ఉర్దూ పలకడమే రాదని ఈసడించినాడట ఒక పెద్దమనిషి. ఆ మాటకు లతామంగేశ్కర్ కుంగిపోలేదు. నిజమే కదా! అనుకున్నది. మరునాటి నుండి షఫి అనే ఒక మున్షి వద్ద ఉర్దూభాషను సాకల్యంగా నేర్చుకున్నది. లతామంగేశ్కర్ ఉర్దూ ఉచ్చారణ ఎంత చక్కగా వుంటుందో చెప్పడానికి ఎన్నయినా ఉదాహరణలు ఇవ్వవచ్చు. అయితే పాకీజా చిత్రంలో "ఆజ్ హమ్ అప్నీ దువావోంకి అసర్ దేఖేంగే, తీర్ నజర్ దేఖేంగే జఖ్మ్ జిధర్ దేఖేంగే" అనే ఒక్కపాట చాలు. తర్వాతి కాలంలో లతా మంగేశ్కర్ పాడిన గాలిబ్ గజల్ల రికార్డు ఎంత జనాదరణ పొందిందో అందరికీ తెలిసిన విషయమే!

హిందీ, ఉర్దూ ఇంకా ఇతర భాషల్లో ఎన్నిపాటలు పాడినా లతామంగేశ్కర్ మరాఠీలో పాడినప్పుడు మాత్రం ఇంకా మధురంగా వినిపిస్తుంది. మరాఠీ మాతృభాష అందుకేనేమో అనిపిస్తుంది. వసంత్ దేశాయి స్వరకల్పన చేసిన 'అమర్‌భూపాలి' చిత్రంలో పండిత్‌రావు

నగర్‌కర్‌తో లతామంగేశ్కర్ భూపాలీరాగంలో పాడిన 'ఘనాశ్యా సుందరా శ్రీధరా అరుణోదయ ఝాలా' అనే మరాఠీగీతం ఎన్నిసార్లు విన్నా తనివితీరదు.

లతా మంగేశ్కర్ తమ్ముడు హృదయనాథ్ మంగేశ్కర్ స్వరపరచిన రాఠీ భజనలు లతా మంగేశ్కర్ కంఠంలో చాలా మధురంగా వినిపిస్తాయి. ముఖ్యంగా సంత జ్ఞానేశ్వర్ భజనల్లో 'మోగరపులలా'' ఋణజణ ఋణజణ రే భ్రమరా'', ''సుందరతే ధ్యాన'' ''రంగ యేయివో'' అనే భజనలు ఎన్నిసార్లయినా వినాలనిపిస్తుంది. అయితే ఈ ''రంగయేయివో'' అనే ఒక్క వాక్యాన్నే తీసుకొని మరాఠీ సహ్యాద్రి టి.వి. ఛానల్‌వాళ్లు చిత్రకారుల పరిచయాత్మక కార్యక్రమాలకు 'రంగమేయివో' అని పేరు పెట్టుకున్నారు. కానీ లతా మంగేశ్కర్ పాడిన 'రంగయేయివో'' పండరిపురంలోని పాండురంగడు, లేదా శ్రీరంగనికి సంబంధించింది. అయితే వీళ్లది మాత్రం చిత్రకారుల పంచరంగులకు సంబంధించినది.

పండరిపురంలో వెలసిన పాండురంగని తర్వాత మరాఠీ వాళ్లకు అత్యంత ఇష్టమైన దేవుడు గణపతి. దానికి కారకులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్. ఈ గణపతికి సంబంధించిన మరాఠీ గీతాలు లతా మంగేశ్కర్ స్వరం నుండి మధురంగా జాలువారినాయి. సమర్థ రామదాస విరసిత గణపతి మంగళహారతిని లతామంగేశ్కర్ లోకప్రియం చేసింది. మా ఆదిలాబాద్ గణపతి మండళ్లలో హారతి సమయంలో దానినే గానం చేస్తారు. వాళ్లందరికీ ఈ హారతి కంఠస్థమయింది. పంతులుతో పాటు వాళ్లందరూ బృందగానం చేస్తారు. అందులోని పల్లవి ఇలా వుంటుంది. **''సుఖకర్తా దు:ఖహర్తా వార్తా విఘ్నాచీ''** అని. మరో ఆశ్చర్యకరమైన అంశమేమిటంటే ''సుఖకర్త'' అని మరాఠీ వాళ్లు పిల్లలకే గాక దుకాణాలకు, హోటళ్లకు పేర్లు కూడా పెట్టుకుంటారు.

ఇవీ లతా మంగేశ్కర్ మరాఠీ పాటల గురించిన రేఖామాత్ర పరిచయం. ఇక హిందీచిత్ర సీమలో లతాదీది మకుటం లేని మహారాణి. ఆమె గానం చేయని చిత్రం, ఆమెతో పాడించని సంగీతదర్శకులు అరుదని చెప్పాలి. ఒక్కటైనా లతామంగేశ్కర్ పాట లేనిదే సినిమా 'హిట్టు' కాదని నిర్మాతలు భయపడేవారు. ఎటువంటి పాటయినా అవలీలగా పాడగల నేర్పు ఆవిడకు వున్నప్పటికీ శాస్త్రీయ సంగీతారాధిత సినీగీతాలు పాడడంలో ఆమెకు ఆమెనే సాటి. వివిధభారతివాళ్ళు 'సంగీత్ సరిత' అని ఒక కార్యక్రమం చేశారు. అందులో ఒక శాస్త్రీయ రాగాన్ని పరిచయం చేసి ఆ రాగం పాడిన ఒక సంగీతజ్ఞుని గానం వినిపిస్తారు. ఈ సంగీతాధారిత సినిమాపాటల్లో అనివార్యంగా లతామంగేశ్కర్ పాటలే వినిపించవలసి వస్తుంది. అంటే వివిధ రాగాల్లో జనరంజకంగా లతామంగేశ్కర్ పాడినన్ని పాటలు మరెవరూ పాడలేదు అన్నమాట.



మరాఠీ తన మాతృభాష అయినప్పటికీ, తన తండ్రి గొప్ప సంగీతజ్ఞుడు అయినప్పటికీ అతని గురించి అందరికీ తెలిసినప్పటికీ మరాఠీ సినీరంగంలో నిలదొక్కుకోవడానికే ఎంతో సంఘర్షణ పడవలసి వచ్చింది. ఇక హిందీ చిత్రసీమ గగనకుసుమమే!

కఠినమైన సంగీత సాధన, అకుంఠిత దీక్ష, పెద్దలపట్ల, సంగీతంపట్ల గౌరవాదరాలు వంటి మంచి లక్షణాల వలన హిందీ చిత్రసీమలో అంతటి విజయాన్ని సాధించగలిగింది లతామంగేశ్కర్. రికార్డింగ్ రూంలో చెప్పులు లేకుండా వెళ్లడం, సంగీతాన్ని ఇబాదత్ అంటే భగవద్ ఉపాసన అని భావించడం మరో మంచి లక్షణం. లతామంగేశ్కర్ అందుకున్న కీర్తి మరే గాయికకు లభించలేదనేది వాస్తవకం. ఎం.ఎస్.సుబ్బలక్ష్మి తర్వాత భారతరత్న పురస్కారం అందుకున్న రెండవ భారత మహిళగా చరిత్రకెక్కింది. ఆమెను వరించని పురస్కారం లేదు. ఇక ఫిల్మ్‌ఫేర్ అవార్డులకు లెక్కలేదు.

సుసర్ల దక్షిణామూర్తిగారనే తెలుగు సంగీత దర్శకులంటే లతామంగేశ్కర్‌కు చాలా గౌరవం. అతను స్వరపరచిన 'సంతానం' చిత్రంలో లతామంగేశ్కర్ 'నిదుర పోరా తమ్ముడా' అనే పాట పడింది. దక్షిణామూర్తిగారి మీద ఉన్న గౌరవం వలన ఆ పాటలకు పారితోషికం కూడా తీసుకోలేదు ఆమె. ఇది 1955 నాటి సంగతి. 1988 సంవత్సరంలో నాగార్జున నటించిన ఆఖరిపోరాటం చిత్రంలో వేటూరి సాహిత్యం, ఇళయరాజ సంగీత సారథ్యంలో లతామంగేశ్కర్, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో కలిసి పాడిన 'తెల్లచీరకు తకధిమి' అనే పాట చివరి పాట. అంటే లతామంగేశ్కర్ తెలుగు చిత్రాల్లో రెండుపాటలు పాడినారు. సలిల్ చౌదరి కోసం మలయాళంలో ఒక సినీగీతం మాత్రమే పాడింది. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం వారికోసం లతామంగేశ్కర్ అన్నమయ్య పదాలు కూడా పాడినారన్న విషయం మరిచిపోరాదు. తెలుగు సంప్రదాయంతో లతామంగేశ్కర్‌కున్న మరో అనుబంధం ఏమిటంటే, మన తెలంగాణకు చెందిన పోచంపల్లి నేత కార్మికులు నేసిన తెల్లని పట్టుచీరలను కూడ ఆవిడ ఇష్టంగా కట్టుకుంటుంది. తెలుగు సినీ నేపథ్యగాయిక పి. సుశీలతో కూడా లతామంగేశ్కర్‌కు ఆత్మీయ అనుబంధమున్నది. లతామంగేశ్కర్, సుశీల ఇద్దరూ కలిసి ఉన్న నిలువెత్తు చిత్రపటం సుశీలమ్మ డ్రాయింగ్‌రూంలో కనబడుతుంది.

లతామంగేశ్కర్‌కు సంగీతంలో ఉస్తాద్ బడేగులామలీ ఖాన్ సాహెబ్ గాత్రం అంటే చాలా ఇష్టం. మహది హసన్ పాడిన గజళ్లంటే ఇంకా ఇష్టం. పండిత్ భీంసేన్‌జోషి 'సంత్‌వాణి' అంటే చాలా ఇష్టం. పండిత్ భీంసేన్‌జోషితోకలిసి కబీర్‌వాణి వినిపించింది కూడా!

లతామంగేశ్కర్‌కు అసంఖ్యాకమైన అభిమానులున్నారు. కానీ లతా మంగేశ్కర్ మాత్రం సచిన్ తెండూల్కర్‌కు అభిమాని. ఈ విషయాన్ని ఆమె ఎన్నో సందర్భాలలో వ్యక్తపరిచింది. తనకు క్రికెట్ అంటే పిచ్చిప్రేమ అని చెప్పుకున్నది. క్రికెట్ పోటీల సమయాల్లో టి.వి. ముందు కూర్చుని దానికతుక్కుపోయి ఆకలి దప్పులు కూడా వాయిదా వేసుకున్నానని చెప్పింది. లతా మంగేశ్కర్ ప్రేమాభిమానాలు పొందిన సచిన్ తెండూల్కర్ అదృష్టవంతుడు. అతడు లంతామంగేశ్కర్‌లో మాతృమూర్తిని దర్శించుకున్నాడు.

సంగీతరంగంలో లతా మంగేశ్కర్ ఎన్ని ప్రశంసలు అందుకున్నదో అన్ని విమర్శలు కూడా పొందింది. ప్రశంసలకు పొంగిపోలేదు. విమర్శలకు కుంగిపోలేదు. ఎవరిముందూ తన ప్రతిస్పందన వినిపించలేదు. ప్రచార్భాటాలకు దూరంగా వుండిపోయింది. నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ పోయింది. చివరికి నిశ్శబ్దంగానే ఈ లోకం నుండి వెళ్లిపోయింది. తానీ లోకానికి వచ్చిన పని అయిపోయింది అనుకున్నది. హిందీచిత్రసీమలో లతామంగేశ్కర్ లేని లోటుమాత్రం పూడ్చలేనిది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈనాటి చాలామంది గాయనీమణుల గొంతులో లతామంగేశ్కర్ కంఠం వినిపిస్తుంది. వారు లతామంగేశ్కర్‌ను అనుకరిస్తున్నారు అనేకంటే లతామంగేశ్కర్ పరిచిన తోవలో నడుస్తున్నారు అనుకోవాలి. లతామంగేశ్కర్ పాడిన ఎన్నో అందమైన గీతాలున్నాయి. వాటిల్లో చాలాపాటలను పాడి విద్యార్థులు బహుమతులు అందుకుంటారు అయితే కొన్ని పాటలను ఎవరూ పాడలేరు. ఆ స్థాయిని అందుకోవడం కేవలం లతామంగేశ్కర్‌కు మాత్రమే సాధ్యం. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా సత్యమిదే!

తమ్ముడికి, చెల్లెండ్లకు వారి వారి సంసారాలకు పెద్దదిక్కుగా బాధ్యతలన్నీ నెరవేర్చుకొని సంపూర్ణ జీవితాన్ని అనుభవించి దివికేగిన లతామంగేశ్కర్ గురించి ఎంత చెప్పినా ఇంకా మిగిలే వుంటుంది. అదొక అక్షయపాత్ర. అదొక పుష్పక విమానం. కాళోజీ నారాయణరావు గారి అన్నగారు కాళోజి రామేశ్వరరావుగారు వారు ఉర్దూలో ఉస్తాదుల కోవకు చెందిన కవి. వారి "తఖల్లుస్" అంటే కలంపేరు 'షాద్' కాళోజీ రామేశ్వరరావుగారు దివంగతులయ్యే ముందు ఒక గజల్ చెప్పినారని అందులోని ఒక షేర్‌ను, ప్రముఖ సంగీత విశ్లేషకులు డా॥ సామల సదాశివగారు ఈ విధంగా వివరిస్తున్నారు.

**"హమ్‌దమో! షాద్ కా గమ్ న కర్నా**
**పూల్ ముర్ఝా గయా ఖూబ్ ఖిల్కే"**

"అంటే మిత్రులారా! షాద్ కోసం విచారించకండి. బాగా వికసించిన పూవు వాడిపోయింది అని ఎంత అందమైన పూవు అయినా ఎంతటి దివ్యసౌరభాలు వెదజల్లే పువ్వయినా కొన్ని రోజులకు వాడిపోవటం ప్రకృతి ధర్మం. పువ్వు వాడిపోయినా దాని రంగూ, రూపూ అభిమానుల కళ్లకు అప్పుడఅప్పుడు కనిపిస్తూనే వుంటుంది. పరిమళం ఒంటికి తాకుతున్నట్లే వుంటుంది".

డా॥ సామల సదాశివగారు కాళోజీ రామేశ్వరరావు గురించి చెప్పిన మాటలు లతామంగేశ్కర్‌కు కూడా అన్వయించవచ్చు. లతామంగేశ్కర్ కూడా బాగా వికసించిన పువ్వు వంటిది. ఈనాడు వాడిపోయింది. అది ప్రకృతిధర్మం. కనుక లతాంగేశ్కర్ మనకందించిపోయిన అపారమైన పాటల ఖజానాకు మనందరం వారసులమే అనుకోవాలి. ఆవిడ జీవించిన కాలంలోనే మనమూ జీవించివున్నాం. కనుక ఆవిడ సమకాలికులమని సంతోషిద్దాం. లతామంగేశ్కర్ స్మృతికి అశ్రునివాళి అర్పించుకుందాం.

## ఏది కవిత...

కవిత ప్రభావం ఉల్లాసమొ! వేదనయొ
ఏదో ఒక నేపథ్య స్వరం! స్వనిస్తుంది సూక్ష్మంగా
పాత నంటి కొత్త ప్రవేశంతో జీవన ప్రవాహం
ఎప్పటికీ అవసరమైన అనుభవ సుందర రూపం

(మాదిరాజు రంగారావు)



ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (47) హైదరాబాద్ మే : 2022

# తెలంగాణ భాష – సమాలోచనం (జాతీయ సదస్సు) సమీక్ష

**సాగి తేజశ్రీ,** బి.ఏ.,(ద్వితీయ) కోఠి మహిళా కళాశాల ఫోన్ : 8008280140

నిజాం కళాశాల తెలుగుశాఖ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలంగాణ సాహిత్య అకాడెమీ మరియు మూసీ సాహిత్యధార సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 7,8 తేదీలలో **"తెలంగాణ భాష – సమాలోచన"** అనే అంశంపై నిజాం కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సుకు సంచాలకులుగా డా. సాగి కమలాకరశర్మగారు తమ కర్తవ్యాన్ని నిర్వహించగా, డా॥ వెల్దుల కుమారస్వామిగారు సహ సంచాలకులుగా వ్యవహరించారు.


### ప్రారంభ సదస్సు

ప్రారంభసభలో ముఖ్య అతిథిగా ఆచార్య లింబాద్రిగారు, సదస్సు ప్రారంభకులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్‌గారు, కీలకోపన్యాసకులుగా డా. నలిమెల భాస్కర్‌గారు, సభాధ్యక్షులుగా నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి. నారాయణగారు, ఆత్మీయ అతిథులుగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు, తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సి. కాశింగారు, సదస్సు పరిచయకులుగా డా. కమలాకరశర్మగారు, ఆహ్వానం మరియు వందన సమర్పకులుగా డా. వెల్దుల కుమారస్వామిగారు వ్యవహరించారు.

సభలో జూలూరి గౌరీశంకర్‌గారు మాట్లాడుతూ ఈ సదస్సు దిశానిర్దేశకంగా ఉందని అన్నారు. బి.ఎన్.శాస్త్రిగారి నుండి మొదలైన వేర్లు ఈనాడు మహా వృక్షాలయ్యాయన్నారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమాలకు మూలం భాష. పలువురి ప్రాణత్యాగం, ఉద్యమాలు ఈ సదస్సు వెనక ఉన్నాయి. సదస్సులోని పత్ర సమర్పణలకు తెలంగాణ సాహిత్య అకాడెమీ పుస్తకం వేస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ భాషను సంకర భాషగా కాక ప్రభావవంతమైన భాషగా తీసుకురావాలి. తెలంగాణ భాషకు, నిఘంటు నిర్మాణానికి విద్యార్థులు కృషి చేయాలి. బి.ఎన్.శాస్త్రిగారు మండల సర్వస్వాలు రచించడానికి వారి జీవితాన్ని అంకితం చేశారన్నారు. విద్యార్థులకు తెలుగు భాష, సంస్కారం తెలియాల్సిన, తెలియపర్చాల్సిన బాధ్యత ఇటువంటి సదస్సులకు ఉందని సభనుద్దేశించి ప్రసంగించారు.

ఆచార్య లింబాద్రిగారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చినది తెలంగాణ భాష. అణగిపోయిన తెలంగాణ తెలుగు భాషను తిరిగి లేవనెత్తి ఈనాడు సదస్సు జరుపుకోవడం చారిత్రక విషయం అన్నారు. నలిమెల భాస్కర్‌గారు విద్యార్థులు తెలంగాణ సాహిత్యాన్ని శరీరానికి కాదు మనసుకి పట్టించుకోవాలని, చాలా కండపుష్టి కలిగినటువంటి భాష తెలుగుభాష. తెలంగాణ ప్రామాణిక భాష ప్రజాస్వామ్య సూత్రాలతో ఉండాలి. మనం మాతృభాషా





మానసపుత్రులమైనప్పుడే బుద్ధి వికసిస్తుంది. పరిధులు లేకుండా స్వేచ్ఛగా రచనలు చేయాలి. తెలంగాణ వాక్య నిర్మాణం భిన్నంగా ఉంటుంది. భాషను మొక్కుబడిగా కాక, దాని లోతుల్లోకి వెళ్ళే ప్రయత్నం చేయాలని చెప్తూ అనేక అంశాలను స్పృశిస్తూ దాదాపు గంటన్నరసేపు కీలకోపన్యాసం చేసినారు.

కసిరెడ్డిగారు మాట్లాడుతూ భాషను అధ్యయనం చేసి కొత్తపదాలను కనుక్కోవాలి. ఉన్న పదాల యొక్క వ్యుత్పత్తిని కనుక్కోవాలన్నారు. డా. కాశింగారు పరిశోధకులను, రచయితలను ఉద్దేశించి తెలంగాణ భాషా నిర్మాణం చేయాలన్నారు. ఎక్కువమంది మాట్లాడే భాషలో ఎక్కువ విషయాలు చెప్పాలి. పరిశోధనలను నిజంగా పరిశోధన చేసి రాయాలన్నారు.

### మొదటి సదస్సు

మొదటి సదస్సుకు అధ్యక్షులుగా డా. పి. వారిజారాణిగారు ఉండగా, డా. సంగనభట్ల నరస్సయ్యగారు, డా. బుక్కా బాలస్వామిగారు, డా. గంద్ర లక్ష్మణరావుగారు, డా. బెల్లి యాదయ్య, డా. బి. మనోహరి, యడవల్లి సైదులు, డా. మంత్రి శ్రీనివాస్, మున్న శశికుమార్‌లు పత్ర సమర్పకులుగా వారి వారి అంశాలను సభకు వివరించారు.

డా. సంగనభట్ల నరసయ్యగారు **"తెలంగాణలో అత్యంత ప్రాచీన భాషా స్థితి"** అనే అంశంపై మాట్లాడుతూ ద్రావిడ భాష ఋగ్వేద కాలం నుండి ఉంది. 3000 సం॥ల క్రితమే దానినుండి తెలుగు



విడిపోయింది. బుద్ధిని కాలంలో పాళీ, ప్రాకృత భాషలలో తెలుగు పదాలు కనిపించాయి. తెలంగాణను అశ్మకదేశం అనేవారు. అంటే శ్రేష్టమైన రాయినందిస్తున్న దేశం. తెలివాహన నది అంటే గోదావరి నది. తెలి నది చేత తడపబడిన మాగాణం తెలింగాణ. తెలింగాణ నుండే తెలుగు పుట్టిందన్నారు. బుద్ధుని కాలం నుండే తెలుగు ఉంది అనడానికి అనేక ఆధారాలున్నాయన్నారు.

డా. బుక్కా బాలస్వామిగారు 'తెలంగాణ జానపద సాహిత్యం – భాష' అంశంపై మాట్లాడుతూ జానపద సాహిత్యం ప్రతిమనిషికి జీవనాడి. జానపదం సహజభాష. భాషలోని యాస, యాసలోని ప్రాస స్వర్గసమానం. హాస్యరసానికి జానపదం పెట్టింది పేరు. జాతి సంస్కృతి మరియు విజ్ఞానానికి పెన్నిధులు పల్లెలు. జానపద కవులే నిజమైన ప్రజాకవులని అన్నారు.

డా. గంద్ర లక్ష్మణరావుగారు 'తెలంగాణ పద్యకావ్యాలు – భాష' అంశాన్ని గూర్చి మాట్లాడుతూ పద్యాలవలననే భాష బ్రతికుంది. అచ్చతెలుగు కావ్యాలు ఊడా ప్రయోగాలే కానీ అచ్చతెలుగు కాదు. భాషాసంపద పద్యాలలోనే ఉందన్నారు.

డా. బెల్లి యాదయ్య వారి అంశమైన 'మన భాషకు వ్యాకరణం గిట్ల రాయొచ్చు'పై ప్రసంగిస్తూ భాష లేని వ్యాకరణం ఉండదు. వ్యాకరణం లేని భాష లేదు అంటూ వాడుకలో మాట్లాడే వివిధ చిన్నచిన్న తెలంగాణ పదాలకు వినూత్న వ్యాకరణాలను, అర్థవంతమైన వ్యాకరణాలను సృష్టించారు.

డా. బి. మనోహరి వారి 'తెలంగాణ శాసనాలు – భాష' అనే అంశాన్ని వివరిస్తూ లిపి లేని భాష ఉండొచ్చు కాని భాషలేని లిపి లేదు. తెలుగుభాషకు ప్రాచీన హోదా రావడానికి కారణం తెలంగాణ శాసనాలు అని, తెలంగాణ శాసనాల్లోని భాషపై పూర్తిస్థాయి పరిశోధనలు జరగలేదని, కాకతీయుల కాలంలో శివదేవయ్య కుమారుడు వరంగల్లులో ఒక శిలపై పూర్తి కావ్యాన్ని రచించారని చెప్తూ ఇటువంటి మరెన్నో శాసనాల ఉదాహరణలను ఇచ్చారు.

యడవల్లి సైదులు వారు ఎంచుకున్న 'తెలంగాణ గిరిజన కథల్లో భాషా విశేషాలు' గురించి చెప్తూ గిరిజన కథలు రాయడంలో అల్లంరాజయ్య, ఉప్పల నరసింహం, సూర్యాధనంజయ్ మొదలైనవారు నిష్ణాతులు. వీటిలో సామెతలు, పొడుపుకథలు, ఆంగ్ల, ఉర్దూ పదాలు మాండలికాలు, జంటపదాలు అన్నీ ఉంటాయని చెప్తూ వాటిని ఉదహరించారు.

డా. మంత్రి శ్రీనివాస్ గారి అంశం 'ఉత్తర తెలంగాణ భాషపై మరాఠీ, ఉర్దూ, హిందీ భాషల ప్రభావం' గూర్చి మాట్లాడుతూ ఒక్కొక్క భాష ఎలా తెలంగాణవాసులపై ప్రభావాన్ని చూపిందనే విషయాన్ని ఉదాహరణతో తెలుపుతూ కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలను కలిపి పాలించడం వల్ల భాషా ప్రభావాలు పరస్పరం ఏర్పడ్డాయన్నారు.

మున్నం శశికుమార్ 'నిజామాబాద్ జిల్లా కవిత్వంలో భాష – మాండలిక ప్రయోగం, పరిశీలన' అంశం ప్రసంగిస్తూ భాష మనల్ని మిగతా ప్రాణుల నుండి వేరు చేస్తుంది. 2022 ముందు నిజమాబాద్‌లో మాండలిక ప్రయోగం తక్కువగా జరిగింది. కళ్ళను తడిచేసుకుంటే ఒళ్ళంతా తుడిచేసుకున్నట్టే వంటి అల్పాక్షర అనల్పార్థ రచనల గూర్చి తెలిపారు.

**రెండవ సదస్సు**

రెండవ సదస్సుకు డా. లక్ష్మణచక్రవర్తిగారు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇందులో డా. నీరజ, డా. మన్నెమోని కృష్ణయ్య, కండెల సంధ్య, కొత్తపల్లి రాములు, పిల్లి సురేష్, డా. కసప నరేందర్, డా. లక్ష్మణచక్రవర్తిగార్లు పత్ర సమర్పణలు చేసినారు.

డా. జె. నీరజ 'తెలుగు పాఠ్యగ్రంథాలు – తెలంగాణ భాషా విశేషాలు' అనే అంశంమీద ప్రసంగిస్తూ పాఠ్య ప్రణాళికల్లో 2014 ముందు, తరువాత చాలా మార్పులున్నాయన్నారు. 2014 తెలంగాణ వచ్చిన తరువాత తెలంగాణ మాండలికం, తెలంగాణ వ్యక్తులు, భాష ఎక్కువగా పాఠాల్లో చేర్చబడ్డాయి. తెలంగాణ పదాలు హాస్యంగా కాక గర్వంగా లిఖించబడ్డాయని తెలిపారు.

డా.మన్నెమోని కృష్ణయ్య 'పాలమూరుజిల్లా మాండలికాలు – వ్యవహారిక పరిశీలన' గూర్చి వ్యవహారంలో మనం పదాలను ఎలా వాడతాం, అవి మాండలికాలుగా వచ్చేవరకు ఏ రకంగా మారతాయనే విషయాన్ని ఉదహరణతో పేర్కొన్నారు.

కండెల సంధ్య 'తెలంగాణ భాష – మాండలికాలు' అంశం మీద మాట్లాడుతూ ఒక ప్రాంత ప్రజలు అలవాటు పడే యాస, భాషను మాండలికాలు అంటారు. తెలంగాణ ఉద్యమం తరువాతే మన మాండలికాలకు సినిమాలలో అన్నింటిలో భాష గౌరవం పెరిగిందన్నారు.

కొత్తపల్లి రాములు 'పోతన భాగవతం – బాలల భాష' అంశంపై మాట్లాడుతూ స్థితి, కాల, స్వభావాలను బట్టి భాషా వినియోగం ఉండాలి. పిల్లలతో మాట్లాడేటప్పుడు మన భాషను ఎక్కువగా ఉ

పయోగిస్తూ ఉంటే భాష బ్రతికుంటుందని చెప్పి భాగవతంలో కృష్ణుడిని, ప్రహ్లాదుడిని ఉదాహరణగా చెప్పారు.

పిల్లి సురేష్ 'నిజామాబాద్ జిల్లా కథలు – భాష' గూర్చి చెప్తూ వాటిలోని విభిన్నమైన పదాల గూర్చి తెలిపారు. డా. కసప నరేందర్ 'తెలంగాణ పాట – భాష'పై ప్రసంగిస్తూ సాహిత్యంలో మాండలిక పదాలు వచ్చినప్పుడు అవీ పాటల్లో వచ్చినప్పుడు సాహిత్య సౌందర్యం పెరుగుతుంది. శ్రామిక సౌందర్యంలోని పాటలు హాస్యంగా కూడా ఉంటాయి. పాట + ప్రాచీనత = భాషా ప్రయోగం, పాట + ఆధునికత = భాషా ప్రయోగం + శ్రామిక సౌందర్యం అని అన్నారు.

డా. లక్ష్మణ చక్రవర్తి 'మాండలిక భాష – ప్రాంతీయ భాష ఒక అవగాహన' అంశంపై మాట్లాడతూ భాషకు వర్గం, కులం అతీతంగా ఉండాలి. కొన్ని పదాలు తెలంగాణ అంతటా వాడబడుతాయి. కొన్ని పదాలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉపయోగిస్తారు. కాబట్టి ప్రాంతీయ భాష, మాండలిక భాష వేరు వేరు. భాష, యాసలను ప్రామాణిక అనడానికి లేదు అంటూ ప్రాంతీయం, మాండలికం ఎలా వచ్చాయో తెలిపారు.

**మూడవ సదస్సు**

మూడవ సదస్సుకు ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారు అధ్యక్షులుగా డా. ఏనుగు నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా వ్యవహరించారు. డా. కోయి కోటేశ్వరరావు, డా. గంజి శశిధర్, డా. పగడాల నాగేందర్, అనంతోజు మోహన్‌కృష్ణ, మంత్రి మల్లేష్‌గార్లు పత్ర సమర్పణ చేసినారు.

వెలుదండ నిత్యానందరావుగారు మాట్లాడుతూ భాష పరిణామ శీలమైనది, వైవిధ్యమైనది. భాషలో, భావలో వైజ్ఞానిక, సామాజిక అభివృద్ధులను బట్టి మార్పులు వస్తుంటాయి. వీటిని స్వీకరించాలి. మన జీవన వ్యవస్థ నుండి కనుమరుగైన పదాలు వర్తమానానికి తెలియవు. మాండలికానికి, మౌఖికభాషకు, ప్రామాణికానికి, పత్రికా భాషకు సాన్నిహిత్యం ఉంటుంది. ప్రయోజనాత్మక దిశలో భావాభివ్యక్తికి సందర్భానుసారంగా ఏ పదాలైనా ఉపయోగించవచ్చు అన్నారు.

డా. ఏనుగు నరసింహారెడ్డిగారు 'తెలంగాణ భాష – పరిపాలన' అంశంపై ప్రసంగిస్తూ ప్రజలు మాట్లాడే భాష, పరిపాలన జరిగే శాష వేరు. పూర్వం ప్రజలు పాళీ మాట్లాడితే పరిపాలన సంస్కృతంలో నడిచింది. ప్రస్తుతం ప్రజలు తెలుగు మాట్లాడుతుంటే పరిపాలన ఆంగ్లంలో నడుస్తుంది. సాలార్‌జంగ్ కాలంలో భూమి రికార్డులను అచ్చ తెలంగాణ తెలుగులో రాశారు. క్రమంగా అవన్నీ ఆంగ్లభాషలోకి మారాయి. స్వాతంత్ర్యం తరువాత తెలంగాణభాషను అధికార భాషగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మన సాహిత్యం బయటికి వెళ్లనందున, తెలుగు చదివారు లేనందున, ప్రభావవంతమైన భాషా సూచికలో తెలుగు లేదు. పరిపాలన కూడా తెలుగులో జరగాలన్నారు.





డా. కోయి కోటేశ్వరరావు 'తెలంగాణ భాషా సాహిత్యాల విశిష్టత – ఆంధ్ర పండితుల దృష్టి' అనే అంశంపై ప్రసంగిస్తూ భాషాభివ్యక్తికి వెనక కులం, ప్రాంతం, మతం ఉంటాయి. తెలంగాణ ఉద్యమం తెలుగు సాహిత్య మూలాలను పునర్నిర్వచించింది. తెలంగాణపై దేశీయ ముద్ర ఉంటుందంటూ వివిధ ఆంధ్ర పండితుల అభిప్రాయాలను, వారు అన్న మాటలను తెలిపారు.

గంజి శశిధర్ 'తెలుగు సినిమా – తెలంగాణ భాష' అనే అంశంపై మాట్లాడుతూ 'చిల్లర దేవుళ్లు' సినిమాలో తెలంగాణ భాష మొదటిసారిగా వినిపించింది. ఒకప్పుడు సినిమాల్లో పద్ధతి, సంస్కారమైన భాష ఉండేది. ప్రస్తుతం తెలంగాణ భాష సహజంగా వస్తూనే అన్ని భావాల్ని పలికించగలుగుతుంది. సినిమా రచయితలు ఆంధ్రవారు కావడంతో తెలంగాణ భాషా రచనలో కొన్ని తప్పులు చేశారని అన్నారు.

డా. పగడాల నాగేందర్ 'తెలంగాణ ఆధునిక వచన కవిత్వంలో భాష' అంశంపై ప్రసంగిస్తూ ఎవరైతే తెలుగు భాష కొరకు ఉద్యమాలు చేస్తున్నారో వారి పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదువుకొంటున్నారు. ఆధునిక కవిత్వాన్ని కూడా ఆధునిక తరీఖాలో రాసినవారు శ్రీశ్రీ అని చెప్తూ భద్రాచలం కథల వంటివాటిని ఉదాహరణలుగా చెప్పారు.

అనంతోజు మోహనకృష్ణ 'తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం – భాష అనే తన అంశాన్ని వివరిస్తూ వెట్టిచాకిరి విముక్తికై జరిగింది సాయుధపోరాటం. ఈ సాహిత్యం కథ, కవిత, నవల ఏ రూపాలలో నైనా ఉండొచ్చు కానీ ఇవి ప్రజలను చైతన్యపరిచాయి. పోరాటం ప్రత్యక్షంగా రచించినవారు కొందరు. సానుభూతి, సంఘీభావం తెలుపుతూ రాసినవారు కొందరు. కసినిబట్టి భాష ఉంటుందని



పాత్రోచిత సంబంధ విజయాలు, కథాకథన సంబంధ విషయాల గురించి తెలుపుతూ వాటిని ఉదహరించారు.

**నాల్గవ సదస్సు**

నాల్గవ సదస్సులో అధ్యక్షులుగా డా. ఏలె విజయలక్ష్మిగారు వ్యవహరించారు. డా. జి. అంజయ్య, డా. వై. రెడ్డి శ్యామల, డా. కాంచనపల్లి గో.రా, డా. వెల్దండి శ్రీధర్, డా. వాసరవేణి పరశురాంగార్లు పత్ర సమర్పకులుగా పాల్గొన్నారు.

డా. అంజయ్య తమ అంశమైన 'కాకతీయుల కాలం నాటి తెలుగు భాష – తీరుతెన్నులు'ను సభకు వివరిస్తూ వేంగి చాళుక్యులు, శాతాహనులు, కాకతీయుల కాలం నాటి భాషలో సామ్యం ఉందన్నారు. అలాగే వాటిని వివరిస్తూ వాటికి సంబంధించిన పుస్తకాలను కూడా సదస్సుకు తెలిజేశారు.

డా. వై. రెడ్డిశ్యామల 'మాండలికాల ఏర్పాటులో పదాంశ, సపదాంశాల ఎంపిక పాత్ర'ను వివరిస్తూ భాష పట్ల సున్నితత్వం, ప్రజాస్వామ్యం ఇప్పటికీ లేదు. మాండలికం చిన్నచూపుగానే ఉంటుంది. కాలాన్ని, ఆర్థికాన్ని అనుసరించి విభక్తి ప్రయ్యయాలలో కూడా మాండలికాలలో భేదం ఉంటుంది. ధ్వని స్థాయిలో అందరూ ఒకేరకమైన పద్ధతిని పాటిస్తున్నాం అని చెప్పి పదాంశ, సపదాంశాల ఉదాహరణలు ఇచ్చారు.

డా. కాంచనపల్లి గో.రా 'ఆధునిక వచన కవిత్వంలో తెలంగాణ భాష' గురించి మాట్లాడుతూ తెలంగాణ భాష ఒక రకంగా గ్రామ్యభాష. పేరుపై వచ్చిన అనేక గేయాలు, పాటలలో ప్రయాస లేకుండా ఉంది. దీన్ని తెలంగాణ భాషగా కాకుండా గిరిజన భాష అని చిన్నచూపు చూశారన్నారు.

డా. వెల్దండి శ్రీధర్ తమ అంశమైన 'కులవృత్తులు – భాష' అన్న అంశాన్ని వివరిస్తూ ప్రపంచీకరణ తర్వాత కులవృత్తులు, భాష నాశనమయ్యాయి. వాటిలోని పదాలను, వృత్తాలను తిరిగి నిఘంటువుల్లో భద్రపరచుకోవాలి. కులవృత్తులు పోయాయి. కనుక భాష కూడా పోయిందని తెలియజేస్తూ వివిధ కులవృత్తులు మరియు వాటిలోని మరుగునపడ్డ పదాలను ఉదాహరణలుగా చెప్పారు.

డా. వాసరవేణి పరశురాం బాలసాహిత్యం – భాష – ఛందస్సు – అలంకారాలు' అనే అంశంపై ప్రసంగిస్తూ బాలసాహిత్యంపై విస్తృతమైన పరిశోధన జరగాలి. భాష సరళంగా, సహజంగా రావాలి. ఉండాలి. బాల రచనలలో బాలభాషా ప్రయోగం చేయాలి. బాలలకు అర్థమయ్యే ఛందస్సు, అలంకారాలను ఉపయోగించాలో చెప్తూ బాలభాషకు కొన్ని ఉదాహరణలను తెలిపారు.

ఈ రెండు రోజుల సదస్సుకు 70కి పైగా పత్రాలు రావడం వల్ల ఒకే వేదికను అందరు పంచుకోవడం అవకాశం లేక సమాంతర సదస్సులు నిర్వహించడం జరిగింది. అదనంగా నిర్వహించిన రెండు సదస్సులకు డా. ఓర్సు కృష్ణయ్య, డా. వేల్పుల కుమారస్వామి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సమాంతర వేదికమీద డా. బోచ్కర్ ఓంప్రకాశ్, ముత్యంపేట గంగాధర్, డా. పి హంసమ్మ, డా. కడివెండి మమత, రాగుల సుధాకర్, డా. మాథ్యరి ఆనంద్, ఉప్పల పద్మ మొదలగు మంచి పత్రసమర్పకులు 20కి పైగా వారి వారి పత్రాలను సమర్పించారు. ఈ సమాంతర సదస్సు అయినప్పటికి ఇది మరో ప్రత్యేక సదస్సునే తలపించింది.

రెండు రోజులుగా భాషను అన్ని కోణాలలో అధ్యయనం చేసే అవకాశం కలిగించిన ఈ వేదిక ముగింపు సదస్సు మరింత రంజకంగా జరిగింది. వేదిక ఆహ్వానం మన్నించి అందరు అలంకరించిన తర్వాత ముందుగానే ఈ రెండు రోజుల్లోని ఏడు సెషన్స్‌ల పత్రాలను గురించి డా. అట్టెం దత్తయ్య నివేదికను సమర్పించారు. పదిహేను నిమిషాల ఈ నివేదికలో అంశాల వారిగా, వ్యక్తుల వారిగా, విశ్వవిద్యాలయాల వారిగా, ఆచార్యులు, పరిశోధకుల వారిగా విభాగించి అందించారు. అనంతరం ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు, ఆచార్య డి. రవీందర్ గారు తెలంగాణను సాధించుకున్న తర్వాత భాషమీద ఇన్ని కోణాలలో సమగ్రంగా సదస్సుగా అభివర్ణించారు. విశిష్ట అథితిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి. లక్ష్మీనారాయణగారు సదస్సును, అందులో ప్రసంగించినవారిని అభినందించారు. ఈ సదస్సుకు ఆత్మీయ అతిథిగా ప్రముఖ కవి, సినీగేయ రచయిత డా. సుద్దాల అశోక్ తేజ గారు రావడం మరింత ఆనందదాయకం. ఆశోక్ తేజగారు ఈ మధ్యకాలంలో 'ఆర్.ఆర్.ఆర్' (ట్రిపుల్ ఆర్) సినిమాకు రాసిన పాటలోని భాషను విశ్లేషించి, 'నవరసాల్లో తెలంగాణ భాష' అనే అంశంపై చక్కని ఉదాహరణలో పాట, మాట, విశ్లేషణలతో వందలాది ప్రేక్షకులతో ఎన్నిసార్లు చప్పట్ల అభినందనలు పొందారో. ఈ ఉపన్యాసం మొత్తం సదస్సుకే వన్నె తెచ్చిందని చెప్పుకోవడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. కళాశాల నియమాను సారంగా సభాధ్యక్షులుగా ఆచార్య బి.నారాయణ (ప్రధానాచార్యులు), గౌరవ అతిథిగా డా.సి.వి. రంజని (వైస్ ప్రిన్సిపాల్) సదస్సు సంచాలకులు డా. సాగి కమలాకర శర్మగారు ఈ సదస్సు ద్వారా నెరవేరిన లక్ష్యాలను, లోతైన పత్రాలను గుర్తుచేసుకున్నారు. ఈ సదస్సుకు డా. పి.నాగేందర్ ధన్యవాదాలు తెలపడంతో సదస్సు ముగిసింది. వీటితోపాటు ఈ సదస్సుకు సహకారాన్ని అందించినవారికి, రుచివంతమైన భోజనాలు పెట్టిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేయడంతో సదస్సు ముగిసింది.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (51) హైదరాబాద్ మే : 2022

## కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 23

# శుభోదయం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

"కె.విశ్వనాథ్ చలనచిత్రాలు– సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "శుభోదయం". చంద్రమోహన్, సులక్షణలు నాయకా నాయకులుగా నటించారు. ప్రతి ఒక్కరికీ చెందేటువంటి, ప్రతీ వ్యక్తి అలవర్చుకోవల్సిన ఒక మంచి లక్షణాన్ని ప్రధాన అంశంగా ఎన్నుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన, మా కర్మఫలహేతుర్భూ ర్మాతే సంగోస్త్వ కర్మణి" అనే భగవద్గీతలోని శ్లోకంతో చిత్రం ప్రారంభం అవుతుంది. ఆ శ్లోకంలోని విషయానికి అనుబంధంగా మనిషి చేయవలసిన విద్యుక్త ధర్మాన్ని భోదిస్తూ, మనిషిగా ఇతర జీవులతో విభేదిస్తూ వుండే మనిషిలోని బలహీనత ఏంటో తెలియజేస్తూ ఈ చిత్రం కొనసాగుతుంది.



### చిత్ర కథ

చంద్రం(చంద్రమోహన్) ఒక నిరుద్యోగ యువకుడు. అన్న(సాక్షి రంగారావు), వదిన(అన్నపూర్ణ)ల ప్రాపకంలో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తుంటాడు. కాని ఏ ఉద్యోగం చేసినా అందులో సంతృప్తి చెందే వైఖరి కాదు అతడిది. కారణం ఆ ఉద్యోగంలోని సాధక బాధకాల కన్నా అతడి "సోమరితనమే" అతడి ప్రధాన శత్రువు. ఉద్యోగాలు చేయలేక వదిన(అన్నపూర్ణ)ను ఓ పది, ఇరవై అడుక్కుని పార్కుల్లో కాలక్షేపం చేస్తూ గడిపేస్తుంటాడు. చంద్రం ప్రవర్తనకు అన్న మాత్రం విసిగిపోయి వుంటాడు. ఒకరోజు పార్కులో ఒక వ్యక్తి చంద్రానికి నీ జీవితంలోకి ఒక అమ్మాయి రాబోతోంది, వస్తూ వస్తూ చాలా డబ్బులు తీసుకురాబోతుందని చిలక జోస్యం చెప్తాడు. అది బలంగా నమ్మిన చంద్రం కలలు కంటూ కాలం వెళ్ళదీస్తుంటాడు. ఓరోజు ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ అని ఇంట్లో చెప్పి రోడ్డుపై పచార్లు వేస్తూ దారిలో కనబడిన ఒక పెళ్లికి వెళ్తాడు. ఆ పెళ్లి ఆ వూరిలో ఐశ్వర్యవంతుడైన రావుగారి పెద్ద కూతురు సుశీల పెళ్లి. రావుగారి రెండవ కూతురు గీత. ఆ పెళ్ళిలో నాటకీయంగా చంద్రానికి గీతతో చిన్న పరిచయం ఏర్పడ్తుంది. గీతే తన జీవితంలోకి రాబోయే, తన జీవితాన్ని మార్చే జ్యోతిష్యుడు చెప్పినది ఈ అమ్మాయే అని నిర్ణయించుకుంటాడు. అదే పెళ్లికి చంద్రం అన్న తను పనిచేసే షాపు యజమానితో పాటు వచ్చి వుంటాడు. ఆ పెళ్ళిలో చంద్రంను చూస్తాడు, కాని ఆ విషయం చంద్రానికి తెలియదు. ఇంటికి వెళ్ళగానే చంద్రం అన్న చంద్రాన్ని చదువుకొని కూడా ఇలా పిలవని పేరంటానికి వెళ్ళే సంస్కారం నేర్చుకున్నందుకు సిగ్గుగా లేదూ! అని నిలదీస్తాడు. అంతేకాక తను పనిచేసే చోట చంద్రాన్ని గుమాస్తాగా కుదుర్చుతాడు.

చంద్రం గుమాస్తాగా పనిచేసే చోటకు షాపింగ్ కోసం వచ్చిన గీతను చంద్రం దూరం నుండి పరిశీలించి ఆమె అభిరుచులను కనుక్కుంటాడు. నెమ్మదిగా ఆమెకు దగ్గరి మనిషిగా మారి గీత వాళ్ళ నాన్న ఆఫీసులో గీత రెకమండేషన్తో ఉద్యోగం సాధిస్తాడు. అంతేకాక వారి ఇంట్లోనే అద్దెకు వుంటాడు. గీత అక్క సుశీలది ఇల్లరికపు పెళ్ళి. ఆ కారణంచే గీత తండ్రి అల్లుడికి అతడు కోరుకున్న విధంగా కార్లు, ఆస్తులు ఇస్తూ వుంటాడు. ఇదంతా చూసిన చంద్రం ఎలాగైనా గీతను పెళ్లి చేసుకుంటే జ్యోతిష్కుడు చెప్పినట్లు తానూ ఆస్తులు అనుభవించాలని భావిస్తాడు. ఆ ఆలోచనతోనే తన ప్రవర్తనతో గీత తండ్రికి తనపై మంచి అభిప్రాయం ఏర్పడేలా చేసుకుంటాడు. ఒకరోజున గీత తండ్రి, గీత వద్ద పెళ్లి ప్రస్తావన తెస్తాడు. అప్పుడు గీత తండ్రితో తాను సద్గుణాలు, ఆదర్శ భావాలు కల్గిన చంద్రాన్ని ఇష్టపడ్తున్నట్లు చెప్తుంది. కూతురు భావాలను అర్థం చేసుకుని చంద్రంతో మాట్లాడి అతడితో గీతకు వివాహం చేస్తాడు. తాను అనుకున్నట్లే గొప్పింటి అమ్మాయిని వివాహం చేసుకోవాలనుకున్న తన కల నెరవేరిందని సంబరపడ్తాడు చంద్రం.

గీతతో వివాహం తర్వాత ఇక మనదంతా రాజసమే అనుకున్న చంద్రానికి తక్కువ కాలంలోనే విచిత్రమైన పరిస్థితులు ఎదురవుతాయి. పెద్దల్లుడిలా ఇల్లరికపు వివాహం కాదు కాబట్టి ఏ కార్లూ బహుమానంగా రావు. పొద్దున్నే నిద్రలేవగానే సకల సేవలు చేసే పని మనుషులు అందుబాటులో వుండరు. ఆఫీసులో యజమానిలా అధికారం చెలాయించడం కాకుండా తన మునుపటి

క్లర్క్ ఉద్యోగమే చేయాలనీ తెలుసుకుంటాడు. ఇవన్నీ అర్థం చేసుకున్న చంద్రానికి ఊపిరి ఆగినంత పని అవుతుంది. ఒకరోజు దారిలో జోస్యం చెప్పిన వ్యక్తి కనిపిస్తాడు. నువ్వు చెప్పిందేమిటి నా జీవితంలో జరుగుతున్నదేమిటి అని ఎడాపెడా వాయిస్తాడు. ఇలా ఆ జ్యోతిష్కుడు ఎదురయిన ప్రతిసారీ నీ జ్యోతిషంతో మోసపోయాను అనే కోపంతో చితకబాదుతుంటాడు.

ఒకవైపు గీత చంద్రం యొక్క ఆదర్శ భావాలు, వ్యక్తిత్వాన్ని ప్రేమించి పెళ్ళాడితే, కేవలం ఆమె ఆస్తి, ఐశ్వర్యంపై మోజుతో వివాహం చేసుకుంటాడు చంద్రం. వివాహం తర్వాత కాలుపై కాలేసుకొని సుఖాన్ని అనుభవించాలనే యావ చంద్రంది. కాని గీతతో వివాహం అయిన కొన్నాళ్ళకే చంద్రం ఆలోచనలకు విరుద్ధంగా తన పరిస్థితి మళ్ళీ మొదటికొస్తుంది. ఎలాగంటే గీత చంద్రంతో మనం మా నాన్న ఆస్తుల్లో చిల్లిగవ్వ కూడా తీసుకోకుండా స్వంతంగా జీవిద్దాం అని చెప్తుంది. అప్పటిదాకా ఆదర్శ భావాలు, స్వతంత్ర ఆలోచనలను నటిస్తూ వచ్చిన చంద్రాన్ని ముందు నుంచి నటిస్తూ వచ్చినందుకు నా గోతి నేనే తీసుకున్నట్లైందని విచారం చెందుతాడు. మరోవైపు దేనికీ పనికిరాకుండా పోతాడనుకున్న చంద్రం గొప్పింటి అమ్మాయిని వివాహం చేసుకున్నందుకు చంద్రం అన్నా, వదినలు సంతోషిస్తారు.

గీత చంద్రంతో చెప్పినట్లుగానే ఇంటినుండి బయటకు వచ్చి చంద్రంతో కలిసి చిన్న ఇంట్లో అద్దెకు దిగి వివాహ జీవితం కొనసాగిస్తుంది. చంద్రం మాత్రం తన అసహనాన్ని బయటకు చెప్పలేక భరిస్తూ వుంటాడు. గీత, చంద్రంలు ఇద్దరూ గీత వాళ్ళ నాన్న రావుగారి ఆఫీసులో క్లర్క్ ఉద్యోగాలు చేస్తూ వుంటారు. ఆ సందర్భంలో రావుగారి పెద్దల్లుడు మాత్రం ఇల్లరికం కారణంగా మామగారి ఆస్తులు అనుభవిస్తూ కంపెనీల్లో యజమానిగా వ్యవహరిస్తూ వుంటాడు. అంతేకాక చంద్రాన్ని తోడల్లుడులా కాకుండా కేవలం ఒక వర్కర్‌గానే చిన్నచూపుతో చూస్తుంటాడు. అది భరించలేక చంద్రం ఒకరోజు మామగారికి నువ్వే కాదు నేను కూడా అల్లుడినే, అలాగే ఆయన ఆస్తులకు కూడా అని గట్టిగా మందలిస్తూ అక్కడినుండి బయల్దేరతాడు. సరిగ్గా అదే సమయానికి అక్కడికి వచ్చిన చంద్రం మామగారు చంద్రం యొక్క అసహనాన్ని అర్థం చేసుకుని ఒకరోజు కూతుళ్ళను, అల్లుళ్లను పిలిచి తనకు వయసు పెరిగిపోయింది ఈ కంపెనీలు, వ్యాపారాలను నిర్వహించలేను. ఇద్దరు అల్లుళ్లకు సమానంగా ఆస్తులు పంచి తనకంటూ మిగిలిన ఆ ఒక్క బాధ్యత కూడా తీర్చుకోవాలనుకుంటున్నట్టు చెప్తాడు. ఆ మాటలు విని చంద్రం లోలోపల ఆనందానికి లోనవుతాడు. రావుగారు చెప్పినట్లుగానే తన ఆస్తులు, వ్యాపారాలను సమానంగా పంచుతాడు. చంద్రం ఇకనుండి తనదంతా రాజయోగమే అనుకుని మురిసిపోతాడు.

అంతా తాను అనుకుంటున్నట్టుగానే నవ్యంగా సాగుతుందనుకుంటున్న చంద్రానికి ఒక పెద్ద పిడుగులాంటి సంఘటన ఎదురవుతుంది. ఒకరోజు ఒక ఆశ్రమానికి చెందిన కార్యక్రమానికి భార్యా భర్తలైన గీత, చంద్రంలు హాజరవుతారు. ఆ ఆశ్రమంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఎంతోకొంత చేయూతనివ్వాల్సిన బాధ్యతను గూర్చి ప్రస్తావన తెస్తాడు గురూజీ. దానికిగాను ఆ కార్యక్రమంలో పాల్గొన్న అందరినీ సహాయం కోరతాడు. ఆ సందర్భంలో గీత తన యావదాస్తిని క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం ఆశ్రమానికి రాసిస్తుంది. ఆ విషయం తెలిసి గీతపై మండిపడతాడు చంద్రం. దానికి గీత మనకు కష్టపడి బతికే ధైర్యం వున్నప్పుడు ఈ ఆస్తిపాస్తులెందుకని బదులిస్తుంది. దాంతో చంద్రం గీతపై కోపం పెంచుకుంటాడు. అదే సందర్భంలో గీత గర్భవతి అని తెలుస్తుంది. తను అనుకున్న దానికి విరుద్ధంగా అవడమే కాక కుటుంబాన్ని నడపగలనన్న ధైర్యంలేక, దానికి తోడు గీతపై కోపంతో సన్యాసం తీసుకుంటాడు చంద్రం. సన్యాసం తీసుకున్న తర్వాత అక్కడ వుండే చిన్న, చిన్న కష్టాలను కూడా ఎదుర్కోలేనంత సోమరితనంతో జీవిస్తుంటాడు చంద్రం.

భర్త ఎక్కడికెళ్ళాడో తెలియని గీత ఒంటరిగా కాలం గడపాల్సొస్తుంది. తనకు పుట్టిన పాపను చూసుకొని తన బాధని మరిచి జీవిస్తుంటుంది. కొన్నాళ్ళకు గీతకు చంద్రం ఆశ్రమంలో వున్నట్లు శివగామిని ద్వారా తెలుస్తుంది. ఆశ్రమానికి వెళ్ళి తాను కూడా అక్కడ చిన్న, చిన్న సేవలు చేస్తూ జీవిస్తుంది. గీత ద్వారా ఆశ్రమ పెద్ద స్వామీజీకి కూడా విషయం తెలుస్తుంది. మరోవైపు కళ్ళ ముందు తన బిడ్డ కనపడ్తున్నా తాను చేసిన తప్పుకు తన భార్య గీతకు మొహం చూపలేక ఇబ్బంది పడ్తుంటాడు. కాని ఒకరోజు గీత ప్రణాళికతో పాపను చంద్రం చేతికి చేరేలా చేసి అక్కన్నుండి వెళ్తుంది. ఎంత ఎదురుచూసినా గీత రాకపోవడంతో భయపడ్తూ ఆమె కోసం వెతకడం మొదలెడతాడు చంద్రం. ఆ క్షణాల్లో చంద్రం తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెందుతాడు. చివరాఖరికి బిడ్డతో కలిసి గీతను చేరుకుంటాడు. పని చెయ్యకుండా దర్జాగా బతకాలని ఆశపడడం కంటే భార్యా, పిల్లలతో వుంటూ చేసే పని చిన్నదైనా వున్నదాంట్లో సంతృప్తిగా బతకడం ముఖ్యం అని తెలుసుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.


**చిత్ర విశేషాలు**

కె.విశ్వనాథ్ గారు "శుభలేఖ" చిత్రంలో వరకట్నం సమస్యను ప్రధానాంశంగా తీసుకొని చిత్రాన్ని నిర్మించగా "శుభోదయం" చిత్రంలో సోమరితనంతో వరకట్నం కోసం ఆశపడే యువకుడి మనస్తత్వాన్ని కథాంశంగా ఎన్నుకొని చిత్రాన్ని నిర్మించారు. నిజానికి చాలా చిత్రాల్లో వరకట్నం కోసం ఆశపడే వ్యక్తులను గూర్చి క్రూరత్వంతో వ్యవహరించే స్వభావాన్ని దృశ్యీకరణ చేస్తారు. కాని

ఈ చిత్రంలో కథానాయకుడి పాత్రకు సోమరితనాన్ని జతచేసి ఆ కోణంలో కష్టపడకుండా తన జీవితంలోకి వచ్చే అమ్మాయిని ఆసరాగా చేసుకొని దర్జాగా బతకాలనుకునే యువకుడి పాత్రను సృష్టించి సుతిమెత్తగా తాను చెప్పదల్చుకున్న విషయానికి హాస్యాన్ని జోడించి చెప్పారు దర్శకుడు. విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో కథ చెప్పే విధానం చురకలు అంటించినట్లుగా కాకుండా హాస్యంతో చెప్పినా, విషాదంతో చెప్పినా హృదయాన్ని కదిలించే విధంగా వుండడం ఆయన ప్రత్యేకత. కథను సూటిగా, సుతిమెత్తగా నొప్పింపక, తానొప్పక అనే రీతిగా చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి.

కథ అంతా సోమరితనంగా బతికే చంద్రం పాత్ర చుట్టూ సాగుతుంది. చేసే పనిని కుదురుగా చేయక సాకులు చెప్తూ ఏ పనినీ చేయకుండా నిరుద్యోగంలో బతికే యువతను, సోమరితనానికి అలవాటుపడిన యువతను గుర్తుచేస్తుంది. చంద్రం పాత్రలో చంద్రమోహన్ నటన చిత్రాన్ని చూసే ప్రేక్షకుడికి అతడిలో అమాయకత్వాన్ని, అతడిపై జాలిని, అతడి సోమరితనానికి కోపాన్ని, అమ్మాయిని బుట్టలో వేసుకోవడానికి అతడు వేసే వేషాలు హాస్యాన్ని ఇలా పలు రకాల భావోద్వేగాలు పుట్టించేదిగా వుంటుంది. గీత పాత్రలో సులక్షణ అమాయకమైన మోముతో, సంపన్న కుటుంబానికి చెందినదైనా నిగర్వంగా, నిరాడంబరంగా వుంటూ ఆదర్శాలు కల్గిన, ఉదార వైఖరి గల యువతిగా చక్కగా వుంటుంది. తన తండ్రి సంపన్నుడైనా ఆమె తన తండ్రి ఆఫీసులో క్లర్క్‌గా పనిచెయ్యడం, వివాహం తర్వాత కూడా తండ్రి డబ్బుకు ఆశపడకుండా అద్దె ఇంటిలో వుంటూ తన వైవాహిక జీవితాన్ని స్వంతంగా కొనసాగించాలనుకోవడంలో స్త్రీ సాధికారతను చూపే వ్యక్తిత్వం ప్రస్ఫుటమౌతుంది.

చిత్రంలో సాక్షి రంగారావు చంద్రమోహన్ కు అన్నగా నటించాడు. తమ్ముడిపై అసహనాన్ని ప్రదర్శిస్తూనే అతన్ని కాపాడుకునేందుకు చూపే ప్రేమ బాధ్యతను, అధికారాన్ని రెండింటిని వ్యక్తం చేసేలా వుంటుంది. విశ్వనాథ్ గారి ప్రతి చిత్రంలో సాక్షిరంగారావుది ఏదో ఒక పాత్ర వుండడమే కాక హాస్యంతో కూడినదై, దాని తాలూకు ప్రాముఖ్యాన్ని కల్గి వుంటుంది. చిత్రంలో మరొక ప్రధాన పాత్ర శివగామిని(మనోరమ). మనోరమ పాత్ర గీతకు సహోద్యోగి పాత్రలా వుంటుంది. గీతకు అన్ని విషయాల్లో నైతిక మద్దతు ఇచ్చే పాత్ర శివగామినిది. గీత భర్త చంద్రం గీతను ఆమెను గర్భవతి అనే ఇంగితం కూడా లేకుండా వదిలేసి వెళ్ళినప్పుడు శివగామినే ఆమెకు అండగా వుంటుంది. చిత్ర పతాక సన్నివేశంలో కూడా ఆశ్రమంలో పసిబాబును చంద్రం వద్ద వదిలేసి వెళ్ళి అతడికి తాను చేసిన తప్పు పట్ల పశ్చాత్తాపం కలిగేట్లు చెయ్యడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది శివగామిని.




ఇక ఈ చిత్రంలో ఒక కొత్త కోణం ఏంటంటే జీవితంపై విరక్తి వచ్చే ప్రతి మనిషి సన్యాసం తీసుకోవాలని భావిస్తారు. నిజానికి సన్యాసం అనేది మాటల్లో మాట్లాడుకునేంత చిన్న విషయం కాదు. నియమ, నిష్ఠలతో చిత్తశుద్ధిగా నిర్వహించాల్సిన పవిత్ర కార్యం అనే విషయాన్ని పరోక్షంగా తెలియపరిచారు దర్శకుడు. ఇక ఆశ్రమంలో చంద్రం అక్కడి కార్యక్రమాలను నిర్వహించడంలో పడే పాట్లు ప్రేక్షకుడిని కడుపుబ్బా నవ్విస్తాయి. ఈ చిత్రం అంతా కూడా పెద్ద, పెద్ద సంఘటనలు కుదుపులతో కాకుండా చిన్న , చిన్న మలుపులతో సున్నితమైన భావోద్వేగాలతో కొనసాగుతుంది.

ప్రధానంగా ఈ చిత్రం జ్యోతిషాన్ని నమ్మి ఏ పని చేయకుండా కాలానికి వదిలేసి సోమరిగా జీవించే యువకులకు, జీవితంలోకి వచ్చే అమ్మాయి వరకట్నం, ఆమె ఆస్తులకు ఆశపడే యువతకు చెంపపెట్టులాంటిది.

ఇక ఈ చిత్రానికి మాటలు జంధ్యాల అందించగా, సాహిత్యాన్ని వేటూరి సుందర రామ్మూర్తి అందించారు. చిత్రానికి సంగీతం కె.వి.మహదేవన్ అందించారు. అన్ని తరాల ప్రేక్షకులు ఆదరించే ప్రధాన పాట "కంచికి పోతావ కృష్ణమ్మా– ఆ కంచి వార్తలేవి కృష్ణమ్మా". "రాయైతేనేమిరా దేవుడు – హాయిగా వుంటాడు జీవుడు" అనే పాటలో దేవుడి ఠీవీని వర్ణిస్తాడు రచయిత. "నటనం ఆడెనే" అంటూ సాగే పాట సరిగ్గా చంద్రం పాత్ర గీత వద్ద పడే పాట్లను తెలియజేస్తుంది. చిత్రంలో మొత్తం ఎనిమిది పాటలుంటాయి.

**చిత్రం : శుభోదయం**

**తారాగణం : చంద్రమోహన్, సులక్షణ, సాక్షి రంగారావు, మనోరమ, అన్నపూర్ణ**

**మాటలు : జంధ్యాల**

**సాహిత్యం : వేటూరి**

**సంగీతం : కె.వి.మహదేవన్**

**స్క్రీన్ ప్లే– దర్శకత్వం : కె. విశ్వనాథ్**

# బమ్మెర పోతనకు అక్షరనీరాజనం!



తొలి తెలుగు స్వతంత్రకవి పాల్కురికి సోమనాథుడు, తొలి తెలుగు మధురకవి బమ్మెర పోతన పక్క పక్క గ్రామాల వారుగా జన్మించుట యాదృచ్ఛికమో, యోజనాత్మకమో?! తెలంగాణ ప్రభుత్వం పూనుకొని కవి ద్వయం జన్మస్థలాలను దర్శనీయ స్థలాలుగా అభివృద్ధి చేస్తున్నది. ఈ గ్రామాలకు సాహిత్య పర్యాటకులు పెరుగుతున్నరు. స్ఫూర్తి పొందుతున్నరు. సాహిత్య పర్యాటకుడుగా వచ్చిన వేములశ్రీ వేమన శ్రీచరణ్ సాయిదాస్ పొందిన స్ఫూర్తి మహాకవులపై అమూల్యమైన కవితా సంకలనాలు వెలువడుటకు కారణమైంది. **"భక్తాగ్రేసరుడు బమ్మెర పోతన - అక్షర నీరాజన కవితా సంకలనం"** ఆ విధంగా వెలువడినదే!

బహు విషయాలలో నైపుణ్యం, బహుళ ఛందస్సులలో ప్రావీణ్యం కలిగి వేలాది పద్యాలు వ్రాసిన, వ్రాస్తున్న కవి వేములశ్రీ. భాగవతాన్ని మణిపూసలు ప్రక్రియలో మనకు అందించ పూనుకొనిన ఆధునిక పోతన. అటువంటి వేములశ్రీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు కవుల చేత పోతన మీద కవిత్వం వ్రాయించి సంకలించ సంకల్పం కలిగింది. కోవిడ్19 నిర్బంధంలో 2020 సంవత్సరంలో స్వల్పకాలంలోనే 125 మంది కవులతో కవితలు తెప్పించి అచ్చు వేయించి, జనగామ జిల్లా బమ్మెరలో పోతన సమాధి చెంత ఆవిష్కరణ కూడా చేయించుట ఒక అద్భుతమే. ఏనుగు నర్సింహా రెడ్డి, మాకినీడి సూర్యభాస్కర్, ఐతా చంద్రయ్య, అమరకుల దృశ్యకవి, కురవి ఉమా మహేశ్వర రావు, పత్తిపాక మోహన్, శంకరమంచి శ్యాంప్రసాద్, వరుకోలు లక్ష్మయ్య, వడిచర్ల సత్యం, మీ లక్ష్మీకిరణ్ జబర్దస్త్, రాపోలు సత్యనారాయణ, పక్కి రవిశేఖర సత్యనారాయణ మూర్తి, గీతా శైలజ కూర్చిన ముందుమాటలు పుస్తకం ఔచిత్యాన్ని, ప్రాశస్త్యాన్ని అవగతం చేస్తయి. ఇంక పుస్తకంలోనికి ప్రవేశించి పఠనం సాగిస్తుంటే ఆశ్చర్యం కలుగక మానదు. వివిధ కవులు విభిన్న ప్రక్రియలలో విలక్షణంగా పోతన పూజ కోసం అల్లిన కవితా కదంబమాల అనిపిస్తుంది. కవులతో పాటు ముప్పది ముగ్గురు కవయిత్రులు కనిపిస్తరు. అందరిలోనూ పోతన పట్ల అత్యంత ఆదరమే. ఇందరిలో కొందరినే పేర్కొంటే మిగతా వారికి అపచారం చేసినట్లు భావించవలె. ఒక్కొక్కరిని, ఒక్కొక్క కవితను సమీక్షించాలంటే అది కూడా ఒక గ్రంథం అయ్యే ప్రమా/మోదం ఉన్నది. పలు ఛందస్సుల పద్యాలు, మాత్రా చందస్సుల ప్రయోగాలు, వచన కవితలు, ఒక గేయం చదివిన కొద్దీ ఆనందానుభూతి కలుగుతది. చాలా పద్యాలలో భక్తి, శబ్దాలంకారాలు వంటి పోతన ప్రభావం ప్రతిబింబిస్తున్నది. కొందరు తమ పద్యాలకు మకుటం చేర్చిన తీరు చూస్తే వారు పోతన మీద శతకాలు వ్రాయగలరు అనిపించింది. మాత్రా ఛందస్సులో వ్రాసిన వారు వాటి మధురిమలను కూడా పాఠకులకు పరిచయం చేసినరు! వచన కవితలలోనూ చాలా చోట్ల పద్యపు నడక, మాత్రా ఛందస్సు కనిపించింది. అక్కడక్కడ కొన్ని పాదాలు వాక్యప్రాయాలుగా అనిపించినా వాటిలోనూ ఒక మెరుపు గోచరిస్తుంది. ఈ సంపుటం నుంచి పోతన మీద చాలా సత్యోక్తులు, నినాదాలు కూడా ఏరుకోవచ్చు. చిననాటి చిచ్చర పిడుగు అంటూ పద్మ త్రిపురారి వ్రాసిన గేయం పిల్లలు పెద్దలు పాడుకొనే విధంగా ఉల్లాసభరితంగా ఉంది. పోతన వృత్తాంతం, కృతులు, వ్యక్తిత్వ వైశిష్ట్యం, విజ్ఞాన వైదుష్యం, కవిత్వ మాధుర్యం ఇట్లా అనేకానేక అంశాలతో సంపుటిలో ఒక సంపూర్ణత్వం గోచరిస్తది. బహుశా పోతన మీద వెలువడిన తొలి కవితా నీరాజన సంకలనం ఇదేనేమో! ఒక కవిత నిడివి ఒక పుటకు పరిమితం. కవిత సంఖ్య పుట సంఖ్య ఒకటే! భవిష్యత్ సంకలనాలకు ఇది ఒక మార్గదర్శిగా మారనున్నది.

**భక్తాగ్రేసరుడు బమ్మెర పోతన - అక్షర నీరాజన కవితా సంకలనం,**

సంపాదకుడు : **వేములశ్రీ వేమన శ్రీచరణ్ సాయిదాస్,**

తొలి ముద్రణ : నవంబర్ 2020,

ప్రచురణ కర్తలు : శ్రీ సాయి సరస్వతి విద్యా వికాస్, నంగునూరు, సిద్ధిపేట, తెలంగాణ రాష్ట్రం, పుటలు: XXV+128, వెల: రూ 116,

ప్రతులకు : చరవాణి 9652256429

**డాక్టర్ రాపోలు సత్యనారాయణ,**
పాలకుర్తి - 506146, తెలంగాణ, ఫోన్: 9440163211

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (55) UGC Care List Approved Journals
హైదరాబాద్ మే : 2022

# "ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి సంచిక" – ఒక పరిశీలన

**అంతటి బాలస్వామి,** పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం, ఫోన్ : 94900 69763



ఆధునిక కాలంలో ఒక ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని ప్రముఖ వ్యక్తుల గురించి కవులు, రచయితల గురించి, సంస్థలు సాధించిన విజయాల గురించి ప్రత్యేక సంచికలు వెలువడుచున్నవి. సాధారణంగా వ్యక్తులపై వెలువడిన సంచికలలో షష్టిపూర్తి, సప్తతి, ఆసీతి సహస్ర చంద్రదర్శన, శతజయంతి, కనకాభిషేక మొదలగు సంచికలు. వీటిని విశేష సంచికలని, అభినందన సంచికలని కూడా పిలుస్తారు. ఈ సంచికలలో ఉత్సవం జరుపుకోబోయే ఆయా వ్యక్తులు సాధించిన ప్రజ్ఞాపాటవాలను, రచనలను గూర్చి, వ్యక్తిత్వ వికాసం గూర్చి, సాహిత్య విమర్శతో కూడుకున్న వ్యాసాలు, జీవిత అనుభవాలను, సాధించిన విజయాలను గూర్చి మిత్రులు, శ్రేయోభిలాషులు, శిష్యులు అభినందన సందేశాల ద్వారా, వ్యాసాల ద్వారా, కవితల ద్వారా సంచికలకు శోభను చేకూర్చుతారు. ఆ క్రమంలో వెలువడినవి, వెలువడుచున్నవి షష్టిపూర్తి సంచికలు. తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంటున్నాయి అనడంలో సందేహం లేదు.

సంచిక అనే పదానికి తొట్టతొలి తెలుగు నిఘంటుకారుడు మామిడివెంకయ్య "చేర్చి కట్టిన కుట్టిన కొన్ని తాటాకులు"[1] అని తెలియజేయడం జరిగింది. అటు తరువాత వచ్చిన నిఘంటువులు కూడా దాదాపుగా ఇదే అర్థంలో వ్యక్తీకరించాయి. సంచిక అనే పదానికి ఆంగ్లంలో souvenir మరియు Special Issue అనే పదాలు వ్యవహరించబడుతున్నాయి. ఈ సంచికలు అనేక రకాలుగా వెలువడుతున్నాయి. అందులో కొన్ని పత్రికలు వెలువరించిన సంచికలు, కొన్ని ఆయా సంస్థలు వెలువరించిన సంచికలు, మరికొన్ని వ్యక్తిగత సంచికలు. మొదటి రకానికి చెందిన సంచికలు తాము స్థాపించిన వార్షిక, దశమవార్షిక సామాజికసేవను గూర్చి తెలుపుతాయి. మరికొన్ని సంస్థలు తమ ప్రగతిని, సాధించిన విజయ పరంపరను తెలియజేస్తూ ప్రకటించడం జరుగుతుంది. ఇవి రెండవ రకానికి చెందినవి. మరికొన్ని సంచికలు షష్ట్యబ్ది, సప్తతి, శతజయంతి, కనకాభిషేక, అభినందన మొదలైన సంచికలు మూడవ రకానికి చెందినవి. వ్యక్తిగత సంచికలలో షష్టిపూర్తి సంచిక ఒకటి. "ఒక వ్యక్తికి అరవై సంవత్సరాలు నిండిన శుభదినాన ఆయన అభిమానులు, శిష్యులు మొదలైన వారు పద్య గద్య రచనలతో సమర్పించే ఒక అభినందన గ్రంథం షష్టిపూర్తి సంచిక"[2]

మొట్టమొదటిసారిగా ఆంధ్రపత్రిక ఉగాది ఉత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని 1910 సంగాలో మొదటి సంచిక వెలువడినట్లు తెలుస్తుంది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ అనేక పత్రికలు సాహిత్య, విద్యా సంస్థలు సంచికలు వెలువరిస్తూ ఉన్నాయి. ప్రత్యేక సంచికలలో షష్టిపూర్తి సంచికలకు విశిష్టమైన స్థానం ఉంది. రాయలసీమ ప్రాంతం నుండి తెలుగు సాహిత్య పత్రికల ప్రత్యేక సంచికలపై పరిశోధన జరిగినట్లు తెలుస్తోంది. కానీ షష్టిపూర్తి, శతజయంతి మొదలైన అభినందన సంచికలపై పరిశోధనలు జరిగినట్లు తెలియదు.

'ఆంధ్ర పితామహ'గా కీర్తింపబడిన మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి సంచిక 1946లో శ్రీ మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి ఉత్సవ సంఘం, హైదరాబాద్ వారు ప్రచురించారు. తెలుగు ప్రజలను నిద్రావస్థ నుండి మేలుకొలిపి వారిలో దేశాభిమానము ఆత్మగౌరవం వృద్ధి చేసిన మహనీయులు మాడపాటి హనుమంతరావుగారు. వారి షష్టిపూర్తి సంచికకు అధ్యక్షులుగా రాజాబహదూర్ వెంకట రామిరెడ్డి, కార్యదర్శిగా కొండా వెంకటరంగారెడ్డిగారు వ్యవహరించారు. ఈ సంచికకు ఆదిరాజు వీరభద్రరావు సంపాదకులు. తెలంగాణ, సాంఘిక, ఆర్థిక, విద్య, గ్రంథాలయోద్యమం, పాఠశాలలు నెలకొల్పుటకు ఇతోధికమైన కృషి చేశారు. వీరు 1885 జనవరి 22న కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పొక్కునూరులో జన్మించారు.

నాలుగు సంవత్సరాల వయస్సులో వారి తండ్రి గారు స్వర్గస్థులైరి. వారి మేనమామల ఆదరణతో తెలంగాణలోని సూర్యాపేటలో అక్షరాభ్యాసం చేశారు. అక్కడే మూడు సంవత్సరాలు విద్యాభ్యాసం చేశారు. శ్రీ తిరునగరి నరసయ్యగారు వీరికి ప్రథమ గురువర్యులు. వారి మేనమామలు ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్ళిన ప్రతీసారి వారు కూడా వివిధ ప్రాంతాలకు మారవలసిన పరిస్థితి ఎదురైంది. మాడపాటివారి విద్యాభ్యాసం నల్లగొండ, జడ్చర్ల, హనుమకొండ, హైదరాబాదులో కొనసాగింది. కృష్ణా జిల్లాలో పుట్టినా తెలంగాణ ప్రాంత రచయితగా గుర్తింపు పొందాడు.

మాడపాటి వారి షష్టిపూర్తి సంచిక 393 పుటలతో, 24 వ్యాసాలతో, 8 గీతావళులతో, 4 అనుబంధాలతో నిర్మితమైంది. బహుశా తెలంగాణా రచయితపై వెలువడిన మొదటి షష్టిపూర్తి సంచిక కావొచ్చు! ఇందులో అమూల్యమైన వ్యాసాలున్నాయి. ఈ సంచికలోని వ్యాసాలను క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1.చరిత్ర - సంస్కృతికి సంబంధించిన వ్యాసాలు–13, 2. సాహిత్యవ్యాసాలు–4, 3. సామాజిక–రాజకీయ వ్యాసాలు–3, 4. భాషా శాస్త్రం వ్యాసాలు–2, 5.ఛందస్సుకు సంబంధించినవి వ్యాసాలు–1, 6.నాటకానికి సంబంధించిన వ్యాసాలు –1 ఉన్నాయి.

మాడపాటి గారి బాల్యజీవితం అనేక కుదుపులకు లోనయ్యింది. 1903లో మెట్రిక్యులేషన్ పరీక్షను హనుమకొండలో పూర్తిచేశారు. అంతకు నాలుగు సంవత్సరముల ముందే వారి పెద్ద మేనమామ, రెండేళ్ల ముందు చిన్న మేనమామ పరమపదించారు. వారి అన్నగారు తిరుమలరావు ద్రవ్య సహాయంతో ఆ కాలంలో నిజాం ప్రభుత్వం నెలకు ఐదు రూపాయల విద్యార్థి వేతనంతో చదువు కొనసాగించారు. 18 సంవత్సరాల వయస్సులోనే ఫారసీ, ఆంగ్లం, ఉర్దూ, తెలుగు భాషలలో మంచి పరిజ్ఞానం అలవర్చుకున్నారు.

హనుమకొండలోనే వారి నూతన శకం మొదలైందని చెప్పవచ్చు. అప్పట్లో మూడు ఉద్యమాలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. అందులో మొదటిది ఆంధ్రభాషా వికాస ఉద్యమం, రెండవది సంఘ సంస్కరణ ఉద్యమం, మూడవది రాజకీయ ఉద్యమం. ఈ ఉ ద్యమాల పట్ల ఆకర్షితులై మిత్రులతో కలిసి తన జీవితమంతా ఆ ఉ ద్యమత్రయం కొరకు కృషిచేశారు. హైదరాబాదు రాజ్యంలో (నేటి తెలంగాణ) ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషి చేసిన మాడపాటి 1917లో న్యాయవాద వృత్తిని చేపట్టి 1941వరకు విజయవంతమైన లాయర్‌గా కీర్తి గడించడమే కాకుండా తెలంగాణలో గ్రంథాలయాల అభివృద్ధికి తన సమయాన్ని ధారపోశారు. 'ఆంధ్రజనసంఘం' 'ఆంధ్రమహాసభ' వంటి ప్రజా సంఘాల స్థాపనలో వీరి కృషి అమోఘం. శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయం, శ్రీ రాజ రాజనరేంద్రుని భాషానిలయంకు తన ధనాన్ని వెచ్చించారు.

మాడపాటి వారు కవిగా, రచయితగా మంచి పేరు సంపాదించారు. వీరు రాసిన 13 కథలు 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911లో పుస్తక రూపంగా వచ్చాయి. వీరు రాసిన 'తెలంగాణ ఆంధ్రోద్యమం' రచయితగా శాశ్వతకీర్తిని సంపాదించిపెట్టింది. భారతదేశంలో ప్రప్రథమ బాలికా పాఠశాలలో ఒకటైన మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాల హైదరాబాదులోని నారాయణగూడలో స్థాపించడం జరిగింది. వీరి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం1955లో 'పద్మభూషణ్'తో సత్కరించి గౌరవించింది. ఈ బిరుదును అందుకొన్న తెలుగువారిలో ప్రథములు మాడపాటి వారు. వీరుచేసిన సాహిత్య కృషికి గుర్తింపుగా 1956లో ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

ఈ సంచికలో ఎన్నో విలువైన వ్యాసాలున్నాయి. గాడిచర్ల హరిసర్వోత్తమరావు 'గ్రంథాలయోద్యమము –ఆంధ్రోద్యమము' శీర్షికన ప్రకటించిన చరిత్ర–సంస్కృతికి సంబంధించిన వ్యాసంలో నైజాం ప్రాంతములో గ్రంథాలయోద్యమం ఏర్పడుటకు దారితీసిన పరిణామాలు మాడపాటివారి కృషిని ఈ వ్యాసంలో చర్చించారు. "నైజాం ఇలాకాలో తెలుగు ప్రజల వికాసానికి ఆంధ్ర జాతీయ భవిష్యత్తుకు స్వరూపమేర్పరుచుటకై గ్రంథాలయోద్యమము మొదట సాగినది. ఆంధ్ర జాతీయ హృదయం సువ్యక్తము చేయుటకు బ్రిటీషు ప్రాంతములో వలె నిచ్చట సదావకాశములు లేకపోవడం చేత గ్రంథాలయోద్యమము ఆ కొరతను కూడా తీర్చవలసి వచ్చి ఎక్కువ యుత్సాహముతో కృషి జరిగినది. ఆ కృషి ఫలితంగానే నైజాం ఇలాకాలోనూ ఆంధ్రమహాసభ యేర్పడినది. ఈ యన్ని విధములైన పరిణామముల చరిత్రలోనూ శ్రీ మాడపాటి హనుమంతరాయనిది ప్రధానపాత్ర"[3]. మరొక సాహిత్యవ్యాసంలో తల్లావజల శివశంకరశాస్త్రి 'పద్యచూడామణి' గ్రంథాన్ని తులనాత్మకంగా సమీక్షించారు. "రఘువంశ, బుద్ధచరిత, పద్యచూడామణులలో కొన్నికొన్ని సాదృశ్యాలు కనిపిస్తవి. కాళిదాసుని రఘువంశం చదివి అశ్వఘోషుడు బుద్ధచరితము రచించినాడు. ఉభయుల కావ్యములు పఠించి బుద్ధ ఘోషుడు పద్యచూడామణి చేసినాడు. పై కవులు సంగ్రహముగా చెప్పినవి ఇతడు విపులముగా వర్ణించినాడు. ఇతని కావ్యములో కథాంశముల కన్న వర్ణనలే ప్రాధాన్యము వహించినవి"[4].

క్రీ.శ.1650లో జరిగిన తళ్ళికోట యుద్ధం తరువాత ఆంధ్రదేశంలో సామాజిక రాజకీయ పరిస్థితుల గూర్చి సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక జీవనము' అనే శీర్షికలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఆకాలంలో ఆంధ్రదేశంలో ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు, తురకల ఆగడాలు ఎక్కువగా ఉండేవని అడిదం సూరకవి చాటువుల వలన తెలుస్తుంది. ఆనాటి కులాలను, వారిని ఆశ్రయించి బ్రతికే మరికొన్ని కులాలను తన రామలింగేశ్వర శతకంలో ఈ విధంగా వర్ణించినాడు.

**'జంగాల పాలు దేవాంగుల విత్తంబు**
**కాపు విత్తము పంబకాని పాలు**
**బలిజీల విత్తంబు పట్టెదాసరి పాలు**
**గొల్ల విత్తము పిచ్చుగుంటి పాలు**
**వ్యాపారి విత్తంబు వారకాంతల పాలు**
**కల్లు విత్తము రుంజకాని పాలు**
**పరజాలపాల్ శిష్టకరణాల సొమ్ము, ఘూ**
**ర్జరుల విత్తంబు తస్కరులపాలు**
**కవుల కీగల జాతి యొక్కటియు లేదు**
**వితరణము వైశ్యులకు పెండ్లి వేళ గలదు**
**కొంగుబరచిరి నృపతులాకూటి కొరకు**
**రామలింగేశ రామచంద్రపుర నివాస'[5]**

శ్రీ తిరుమల రామచంద్రగారు 'కతిపయాంధ్ర శబ్దచర్చ' అనే భాషాశాస్త్ర వ్యాసంలో నిత్య జీవితంలో మనం మాట్లాడుతున్న పదాలను సమీక్షించారు చెంబు – కంచం, రోలు – రోకలి, జల్లెడ – చేట, తెడ్డు – గరిటె మొదలగు పదాలు వాటి వ్యుత్పత్త్యర్థాల గురించి శబ్దచర్చలు చేశారు. అందులో రోలు – రోకలి ఉరళ్ గల్ (ఎటుబడితే అటు తిరిగే రాయి. రోలు రోకలి, రుబ్బుడురాయి, పాత్రం కూడా కావచ్చు) అనే ద్రవిడ శబ్దం ఉరోంగల్, ఉరల్, రోలు అని వర్ణ వ్యత్యయంతో అయింది. రోకలి కూడ ఉరళ్ కల్, రోళ్ కల్, రోకల్, రోకలి అయింది'[6] అలాగే శ్రీ కాళోజీ నారాయణరావు గారు 'కానుక గేయము'అను పాటలో మాడపాటి వారిని ఈ క్రింది విధంగా స్తుతించారు.

**"తాతకు అరువది యేండ్లు నిండెనని**
**తందనాలు పాడండోయ్**
**తాత యొనర్చిన మేలు తలుచుకొని**
**తాండవ నృత్యం చేయండోయ్**
**ఆంధ్ర గౌరవము తెలంగాణమున**
**అతడే నిలిపినవాడండోయ్**
**ఆంధ్ర పితామహుడని అందరిచే**
**ఆదరింపబడి నాడండోయ్**
**ఆంధ్రోద్యమమును తెలంగాణమున**
**నంకురింప చేశాడండోయ్**
**ఆంధ్ర మహాసభ పేర నందరకు**
**అమర తరువు అయినాడండోయ్"[7]**

మొదలైన పాదాలతో సాగుతుంది ఈ గేయం. ఇవే కాకుండా 'యతి ప్రాసములు' కేశవపంతుల నరసింహశాస్త్రి, "ఎర్రాప్రగడ అతని కవిత్వం"– ఖండవల్లి లక్ష్మీరంజనం, "తలరాత–నుదుటి వ్రాత" – డాక్టర్ చిలుకూరి నారాయణరావు, "ఓరుగల్లు మండలమున సారస్వత సేవ"– దేవులపల్లి రామానుజరావు, "కొరవిగోపరాజు సింహాసనద్వాత్రింశిక"– మల్లంపల్లి సోమశేఖరశర్మ, "ఉర్దూభాషా సారస్వతములు"– బూర్గుల రామకృష్ణారావు, "షితాబ్‌ఖాను" – ఆదిరాజు వీరభద్రరావు మొదలైన శీర్షికలతో ఉద్దండులైన పండితులు బిగువైన వ్యాసాలతో ఈ సంచికకు నిండుదనాన్ని చేకూర్చారు.

ముగింపు

ఈ షష్టిపూర్తి సంచికలో ఎన్నో వైవిధ్యభరితమైన వ్యాసాలున్నాయి. ఇందులో వ్యక్తిగతమైన వ్యాసాలు కాకుండా ఒక విషయానికి సంబంధించిన సమగ్ర అవగాహనను కలిగించే వ్యాసాలు ఉండడం మూలాన ఈ సంచికకు మరింత శోభను కూర్చాయి. ఈ సంచిక మొదట్లో మాడపాటివారి సంక్షిప్త జీవితచరిత్ర కూడా ఉంది. షష్టిపూర్తి సంచికలు వైయక్తిక జీవితం సాహిత్య జీవితాల అవగాహనకు ఇతోధికంగా ఉపయోగపడుతాయి. షష్టిపూర్తి జరుపుకోబోయే సాహితీవేత్త తన తరం, తన తరువాతి తరం వారికి స్ఫూర్తిని అందించడం, సాహిత్య చరిత్రకు విమర్శకు ఉపయోగపడే ప్రత్యేక వ్యాసాలను కూర్చడానికి కూడా దోహదం చేస్తాయి. కాబట్టి షష్టిపూర్తి సంచికలకు నేటి కాలంలో ప్రాధాన్యం ఏర్పడింది.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్ర దీపిక, గుంటూరు 2014, పుటసంఖ్య : 757.

2. జనమంచి శేషాద్రిశర్మగారి షష్టిపూర్త్యుత్సవ సన్మాన సంపుటము – వ్యాసం, మూసీపత్రిక, ఫిబ్రవరి,2022.

3. ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరాయ షష్టిపూర్తి సంచిక, హైదరాబాద్ 1946 పుటసంఖ్య:106


4. పై సంచిక పుటసంఖ్య:133.

5. పై సంచిక పుటసంఖ్య:87.

6. పై సంచిక పుటసంఖ్య:202.

7. పై సంచిక పుటసంఖ్య:318.

8. తెలంగాణా ఆంధ్రోద్యమము, సంపాదకులు : ఎం.ఎల్. నరసింహారావు. ప్రథమ ముద్రణ 1995.




'ఆంధ్ర పితామహ' హనుమంతరావు తెలంగాణా ఆంధ్రోద్యమ నిర్మాతలలో ప్రథమగణ్యుడు. ఆంధ్ర పితామహ బిరుదాంకితుడు. రచయిత, వ్యాసకర్త, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విధానమండలి తొలి అధ్యక్షులు. ప్రజాహిత కార్యసేవా తత్పరుడు.

సమీక్ష

# సుధాముని 'తెమ్మెర' కవితా సంపుటి

బి. శ్రీనివాస రెడ్డి, ఫోన్ : 810 631 2756

మిత్రుడు సుధామ ఎంతో మంచి భావుకుడు. అసలు పేరుకు యెసరు పెట్టి నల్లనయ్య చెలికాని పేరుతో ఖ్యాతిని గడిస్తున్నాడు. మాది యించుమించు 65 ఏళ్ళకు పైబడిన స్నేహబంధం. సుధామ విద్యార్థిగా వున్నప్పుడే 'యువమిత్ర' అనే లిఖిత మాసపత్రికను యెంతో ఓపికగా నిర్వహించేవాడు. స్వతహాగా చిత్రకారుడైనందున ఆ పత్రికకు అందమైన ముఖచిత్రాలు వేసి లోపలి కథనాలకు గూడా సమయోచితమైన బొమ్మలతో అలంకరించేవాడు. 'యువమిత్ర' లిఖితపత్రికను స్ఫూర్తిగా తీసుకుని ఔత్సాహికులు కొందరు తమ తమ లిఖితపత్రికల్ని వెలువరించిన సందర్భాలున్నాయి.

నా 'వోనాకలం' చిరుజల్లుల్ని శ్రీ సి. నారాయణరెడ్డిగారి మీద కురిపించి, వారిచేత 'వోనాకాలం' నా ప్రాణం తీసేసింది. సజీవ రచన అనే కితాబు నిప్పించిన వరుణుడిలాంటివాడు సుధామ. మాదొక 'మిత్రపంచకం'. అందులో యిప్పుడు ముగ్గురమే మిగిలాం.

చానాళ్ళ తరువాత అనుకోకుండా 'మెస్సెంజర్' ద్వారా కలిసిన సుధామ తన తెమ్మెరను నావైపు విసిరి, మిత్రమా! యిది ఎలా వుందో చెప్పమన్నాడు.

'తెమ్మెర' ఒకటి కాదు. మొత్తం ముప్పైయేడు. అలా అలా తడుముతూ ఆహ్లాదాన్ని కలిగిస్తూ వెళుతుంటాయి. ఇక తెమ్మెరలు కలిగించే ఆహ్లాదాన్ని అనుభవిద్దాం రండి.

'ఆగతానికి ఆహ్వానం' – ఆగతం అంటే వచ్చునది అనే అర్థం. కవిగారంటారు గదా! సేతుబంధనంలో గత జలాన్ని ఆపనట్లే వెళ్ళిపోయేదాన్ని పోనివ్వాలి. కన్నీళ్ళతో కాలాన్ని వెళ్లబుచ్చేకంటే, వచ్చేదాన్ని నీ శక్తినంతా కూడగట్టుకొని ఆహ్వానించమంటాడు. నీ గతాన్ని మరచిపోయి ఆగతాన్ని ఆహ్వానించి, అభిమానాన్ని పెంచి, అందరికి పంచి సమన్యాయం చేయమంటున్నాడు. ఇది అందమైన భావన.

'కవిలో' – ఉదయ కిరణం సంధ్యలో ఉరిపోసుకుంటుంది. నిజమే అప్పుడు అమావాస్య చీకటి వెన్నెల దుప్పటి మీద పరచకున్నప్పుడు యిక వెలుగెక్కడిది. సన్మానాలు, జ్ఞాపికలతో, గర్వంతో కొండ శిఖరమెక్కినా అదృష్టం కలిసి రానప్పుడు కిందకు రావల్సిందే అంటాడు. హృదయ సందేశం లేని, పవిత్ర సత్యం లేని ఏ కన్నీళ్ళైనా హృదంతరాలను ఛేదించుకుని రావో అవి నిజమైన కన్నీళ్ళు. కాపట్యపు వలలో దాగి నవ్విన నవ్వు నిజమైన నవ్వు కాదు. ఈ గొడవల ప్రపంచంలో నిజాయితికి గొడుకు పట్టే బడుగు జీవుల్లో తొడిగిన ఆర్ద్ర హృదయ జీవిని గురించి వ్రాసే కలం పూల తావిలో పరిమళాన్ని విస్తరిస్తుంది. అదే కవి కులీనుని కలం యొక్క బలం.

'హుద్ హుద్ తుఫాను' గురించి చెబుతూ స్వచ్ఛ హృదయంతో సహాయ సహకారాలందించి సోదర భావంతో ప్రశాంతతను పాదుకొల్పితే తుఫానొక నష్టం కాదు. అది కష్టం గూడా కాదు.

అగణిత సుగుణ సంధానం, ప్రభుత అనుసంధానం వుంటే ఎప్పటికైనా గెలిచేది 'గణతంత్రమే' కాని రణతంత్రం కాదు. రెండు తెలుగు రాష్ట్రాల గురించి వ్రాస్తూ, రెండింటి హృదయం ఒకటే, భాష ఒకటే. భావ ఐక్యమే కావాలి అంటాడు. బోధ చేసేవాడే బాధించే శాడిస్టు కాకూడదు. అమానవీయ ప్రకృతం పర్యావరణానికి వికృతం. ఇది ముమ్మాటికి నిజం

ఊరు నిలవాలి. మనిషి ముందుకు సాగాలి అంటే చుక్క నీరైనా వృధా కారాదు. జవం, జీవం, జలం సంరక్షించుకోవాలి జనం.

'ఆరుద్ర'గారి కూనలమ్మ పదాలను మరిపించే స్థాయిలో వున్నాయి కవిగారి 'భట్టుమావ పదాలు'. వీటిని యింకా యింకా కొనసాగించి పుస్తకరూపం తెస్తే బాగుంటుంది.

**"భర్త టార్చిలైటు**
**కొడుకు సెర్చిలైటు**
**శ్రీమతి నక్సలైటు**
**ఓ భట్టుమావ"**

ఎంతో భావస్ఫోరకంగా వున్నాయి. చివరగా, చలి కొరకు దుప్పట్లు, చవి కొరకు బొబ్బట్లు, కవికొరకు చప్పట్లు ఓ భట్టు మావ.

డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి గురించి వ్రాస్తూ సినారె స్మృతి చెరిగిపోని దరహాసం, తెలుగువాడి గుండె కింది శాశ్వత విలాసం అంటూ స్మరించుకున్నాడు.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7 (59) హైదరాబాద్ మే : 2022

'బాపు'ను చూసి – సృష్టికి ముందు హోంవర్క్ చేయడం నేర్చుకోమని బ్రహ్మకు వాళ్ళమ్మ చెబుతోంది. బొమ్మ అంటే బాపు బొమ్మ కదా! అని బాపు రమణల కలయికల పుట్టి పెరిగిన ఒక బుడుగు, ఒక పెసూనాంబ, రాధాగోపాళం కానరాక తెలియలేక తెలుగు వెలుగు వెలవెలబోయేవి కదా! తెలుగుతనం ఏమిటో తెలిసేదా మనకు సదా! అని బాపు రమణలను స్మరించుకున్నాడు.

ఉగాదికి నిర్వచనం ఇలా చెబుతున్నాడు. 'విస్తరించిన పొడి అక్షరాలుగా ఉడిగిపోయినా గాడి తప్పని దివ్యజీవనం అదే వృద్ధాప్యం. చివరగా అన్ని కవితల్లోకి తొంగి చూసినపుడు అన్నీ భావస్ఫోరకాలే, నిత్యసత్యాలే. సుధామ యింకా సరికొత్త కవితా సు – ధామమును చేజిక్కించుకోవాలని ఆశిస్తాను. సాహిత్యం పట్ల అనురక్తి కలిగినవారందరు చదవదగ్గ 'తెమ్మెర' కవితా సంపుటి.

**తెమ్మెర**
**(కవితా సంపుటి)**
**రచయిత : సుధామ**
**మూల్యం : రూ॥ 70/-**
**ప్రతులకు : స్నేహిత స్రవంతి, 612, సాదత్ టవర్స్ పద్మావతి ఎపార్ట్‌మెంట్, సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైద్రాబాద్ 500036**

**సమీక్ష**


# తెలుగు జాతి ప్రతినిధి మన పి.వి.

**ఘనపురం సుదర్శన్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్: 9000470542

జీవిత చరిత్ర రాయడమంటే తేయాకు నీటిని వడపోసినంత సులభమేం కాదు. అందుకు చాలా శ్రమించాలి. కొన్నిటిని తాత్కాలికంగా విస్మరించాలి. జీవితం అనగా, సుఖ దుఃఖాల సమ్మిళితమని, ఆటు పోటుల సంగమం అని, ఊహించడానికి వీలు కానిదని, ఊహించినా అనుకున్నది జరగనిదని' ఇలా ఎవళ్ళకు వాళ్ళు రకరకాల నిర్వచనాలు ధారపోస్తుంటారు. ఆత్మకథల కన్నా జీవిత కథల చరిత్రలు రాయడం అత్యంత సాహసం. అనివార్యం కూడా. ఇలా రాయడంలో కొన్ని కొలమానాలూ ఉంటాయి. అవి: ఏదో వంతుకు రాయడం, ఇతరుల మెప్పును పొందడం వంటివన్నమాట. కానీ జీవిత చరిత్ర రాస్తే తనకు (రచయిత) నచ్చేలా అది ఇతరులకు నచ్చి మెచ్చేలా ఉండాలి. అలాంటివే అసలైన జీవిత చరిత్రలవుతాయి. మిగతావి సారాంశం ఉన్న తేలిక వస్తువుల్లాంటివి అవుతాయి.

జీవిత చరిత్ర అంటే జీవితంలోని ప్రధాన ఘట్టాలను స్పృశిస్తూ అందచందాలతో రాయడం కాదు. అందరికీ అందని విషయ నాణ్యతను అందరికీ అందించడమే సిసలైన జీవిత చరిత్ర. అటువంటి నాణ్యమైన చక్కటి బయోగ్రఫీ "విలక్షణ పి.వి. నరసింహారావు జీవిత చరిత్ర". నాల్గుపదుల రాజకీయ, సాహిత్య, మేధోసంపత్తి ఆలోచనల అక్షర నిధి గల జీవిత గాథ. ఎవరికి వారు గుప్తనిధులు అన్న మాటను మరిచి అక్షర నిధియన్న ఈ గ్రంథం తాలూకు సారాన్ని కొంత సమయ భారాన్ని మోస్తూ తవ్వుకోవాలి. ఏక వాక్యంలో చెప్పాలంటే 'విన్నంత కన్నంత తెలియ వచ్చినంత' విషయం ఈ గ్రంథం సొంతం.

అందరికి కనిపించే పి.వి. వేరు. ఈ పుస్తకం చదివాక కనిపించే పి.వి. వేరు. నరసింహారావు జీవితంలో బాల్యం నుండి ప్రధాని పదవీకాలం ముగిసే వరకు జరిగిన ఘటనాఘటనలను తెలిపిన




**విలక్షణ పి.వి.**
**నరసింహారావుగారి జీవిత చరిత్ర**
రచయిత : **డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి**
మూల్యం : రూ॥ 395/-
ప్రతులకు : నీల్‌కమల్ పబ్లికేషన్స్ సుల్తాన్ బజార్, కోటి, హైదరాబాద్ – 1.
ఫోన్ : 9000 168953

గ్రంథం. ఇది మిగతా జీవిత చరిత్రల కన్నా, చాలా లోతుగా అధ్యయనం చేసి అందించిన ఈ పుస్తకం జీవిత చరిత్రలలో ఉత్తమ గ్రంథం అని అనక తప్పదు. సమాజం కప్పి ఉంచిన సహజ రహస్యాలను, తెలిసిన విషయాలే నిజమనుకొని నమ్మిన వారికి, తెలియని నిజాలను విప్పి చెప్పిన జీవిత పొత్తం ఇది.

పి.వి. స్వాతంత్ర్య సమరయోధుడు. నిజాం వ్యతిరేక పోరాటపు వందేమాతర ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర సరిహద్దులు దాటి, విద్యా బుద్ధులు నేర్చుకొని, సమాజ పోకడలను తనదైన శైలిలో పరిశీలించిన అతి సూక్ష్మ పరిశీలనాశీలి. వలస పోయిన వంగర గ్రామం నుండి హస్తినాపురానికి చేరిన మార్గమధ్యలో తన జీవితాన్ని ఏ నిమిషానికా నిమిషం జాగ్రత్తగా లిఖించుకున్నాడు. జరిగే రాజకీయ ఎత్తుగడలను, నేతల మాటల పొత్తులను అపర చాణక్యుడిలా గ్రహించాడు. రాజకీయాలకు మునుపు చాందా సరిహద్దుల్లో సాయుధుడైనా, విదేశీ సరిహద్దుల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను చర్చించేటప్పుడైనా సహనమే ఆయన సాధనమైంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2022


'మౌనేన కలహం నాస్తి' అన్నది ఎంత అక్షర సత్యమో, 'కర్మణ్యేవాధి కారస్తే' అన్నది కూడా అంత సత్యమని పీవీ జీవితాన్ని తరిచి చూస్తే అర్థమౌతుంది.

దేశానికి ప్రధాని అయినా ఆయన మౌలికంగా సాహిత్యవేత్త, పత్రికా సంపాదకుడు. ఇతను తెలుగు వారికి ప్రధానిగా ఎంత ప్రసిద్ధుడో, గొల్ల రామవ్వ కథకుడిగా అంత సుప్రసిద్ధుడు. భారతదేశానికి ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా ఎంత పరిచయస్తుడో, 'వేయిపడగల' అనువాదకుడిగా అంతే సుపరిచితుడు. ప్రజా సంక్షేమానికి ప్రణాళికలు రచిసున్న తనలో లోలో తిరుగుతున్న సాహిత్య పరనాసక్తిని మాత్రం ఆపలేదు. రాజ్యాలను ఏలిన కవులను, సాహితీ పిపాసులను మనం దూర చరిత్రలో చూసాం. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలను ఏలిన సాహితీమూర్తులను సమీప చరిత్రలోనూ చూసాం. వారే పి.వి. నరసింహారావు, అటల్ బిహారీ వాజ్ పేయి, ఇంకా ఎందరో.

నరసింహారావు హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు దగ్గర జూనియర్ లాయర్‌గా చేరినప్పటినుంచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంక్లిష్ట స్థితిగతుల నడుమ ముఖ్యమంత్రి అయ్యేంతవరకు తన సహజ సూత్ర ప్రవర్తనతో ముఖ్య నాయకులను కూడా ఆలోచింపచేసేలా చేశాడు. వీరి ఆలోచనను, తనలో అంతర్గతంగా ఉన్న చాణక్య రీతిని పసిగట్టిన కాంగ్రెసు అధిష్టానం కూడా ఒకానొక దశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రముఖులను కాదని పి.వి. కి ముఖ్యమంత్రిగా చోటిచ్చింది. తాను అసెంబ్లీలో సభ్యుడైనా, విదేశీ వ్యవహారాల మంత్రి అయినా, ప్రధాని అయినా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును చాటుకోవడంలో ముందు వరుసలో ఉండేవారు. చేసే పనిలో నిజాయితీ, నిబద్ధతను, అంకిత తత్వాన్ని అలవర్చుకున్న పి.వి. తన అంత్యశ్వాస వరకు అలాగే జీవించాడు.

# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-


**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

తాను కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు కొన్ని కొత్త శాఖలకు రూపం పోసి వాటి కొనసాగింపుకు చక్కటి ప్రణాళికా రచన చేసి భవిష్యత్ తరాల మంత్రులకు దేశ అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించాడు. పి.వి. జీవితాన్ని ఒక్కమాటలో చెప్పే అవకాశం వస్తే గనక, ఆయన రాజ్యతంత్రం తెలిసిన ప్రజాస్వామ్య రాజు, సంక్లిష్ట సమయంలోనూ సరైన ప్రణాళికలను రాయగల సామర్థ్యమున్న ఆధునిక అపర చాణక్యుడని చెప్పవచ్చు.


రెండు దేశాల మధ్య సామరస్య పూరిత వాతావరణం నిలవాలంటే ఆ దేశాలకు వారధులుగా ఉన్న విదేశాంగ మంత్రులు చాలా కీలకం. విదేశాంగ మంత్రులు తమ బాధ్యతను ఎంత సమర్ధవంతంగా నిర్వహిస్తే ఆ ఇరు దేశాల మధ్య శాంతి అంతగా నెలకొంటుంది. అణు ఒప్పందాలు, వివిధ ద్వైపాక్షిక ఒప్పందాలన్నవి కూడా ఇందుకు ప్రాముఖ్యం వహిస్తాయి. ఇలా భారత విదేశాంగ విధానంలో నరసింహారావు తనదైన ముద్రను చాటారు. ఇప్పటికి కూడా విదేశాంగ విధానానికి ఆయన పాటించిన విధానం మార్గదర్శకంగా నిలుస్తుంది. కారణం ఆయన దేశ భవితవ్యం గురించి ఆలోచించి భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో ఉన్నతంగా నిలపాలనుకోవడం. ఇది ఆయనలో నిరంతరంగా ప్రవహించిన ఆలోచనా ధార. ప్రధాని పీఠాన్ని అధిరోహించక మునుపు జాతి అభివృద్ధికి, ఆర్థిక పెట్టుబడులు ఎంత కీలకమో, వాటి సుస్థిరత కూడా అంతే కీలకమని గుర్తెరిగిన క్రాంతదర్శి.

ఈ పుస్తకం 27 అంశాలతో రూపొంది పి.వి. గారి జీవితాన్ని మన చేతిలో పెట్టింది. ఇక పుస్తక రచనా భాష విషయానికి వస్తే విసుగు పుట్టించేందుకు అవకాశమే లేకుండా విసుగు తనంతట తానే ఆమడ దూరంలో ఉంటుంది. అందరికీ అర్థమయ్యే సులభ రీతిలో, ఆకట్టుకునే శైలిలో ఉన్న ఈ గ్రంథం తెలుగులో పి.వి పై వెలువడిన గ్రంథాలన్నిటిలో కెల్లా ఉత్తమమైందని భావిస్తున్నాను. ఈ ఉత్తమ గ్రంథాన్ని ఎన్నో రాత్రులు, పగలు శ్రమించి దీక్షగా బూని మనకు అందించిన వారు డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి. ఇక దీని ముందుమాట, అంకితంతో సంబంధం ఉన్నవారు వారి వారి రంగాల్లో లబ్ధప్రతిష్టులు. ఈ గ్రంథాన్ని చదివితే 40 ఏళ్ల భారత రాజకీయ రంగాన్ని తెలుసుకున్నట్టే. ఈ పుస్తకాన్ని చదవండి. చదివించండి. పి.వి.ఘన చరితను మరింత మందికి తెలియపరచండి.







**తెలంగాణ కథ - వర్తమాన జీవన చిత్రణ**
డా. ఎం. దేవేంద్ర
వెల : 400 /-
**ప్రతులకు :** శ్రీరచన మారోజు పబ్లికేషన్స్, 12-5-35/ఎ/9, 4ఎఫ్6, బల్లాడ్ ఎస్టేట్, తార్నాక, సికిందరాబాద్ - 500 017.
ఫోన్ : 94906 82457




**అశ్రుతర్పణం (కీ.శే. టి.వి.కె. సోమయాజులు స్మృతి)**
రచన- సంపాదకత్వం : ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు. వెల : 400 /-
**ప్రతులకు :** రచయిత, శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య, నెం. 1708, 'సీతావధానం', 11వ క్రాస్, 1స్ట్ 'జి' మెయిన్, కెంగేరి సాటిలైట్ టౌన్, బెంగుళూరు - 560 060.
ఫోన్ : 9945422742



**తెలుగు వెలుగు శతకం**
- పెరుమల కైలాస్,
వెల : 50 /-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 14-76, ఓల్డ్ యస్.సి.కాలనీ, భిక్కనూర్, నిజామాబాద్ జిల్లా.
ఫోన్ : 8500609578



**వినిర్మాణం (తెలంగాణ అస్తిత్వ నిర్మాణ వ్యాసాలు)**
- డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి
వెల : 400/-
**ప్రతులకు :** రచయిత, ప్లాట్ నెం. 69, సాయి నగర్, డి.వి.కె. రోడ్, నల్లగొండ - 508 001.
ఫోన్ : 98856 82572 మరియు అన్ని ప్రధాన పుస్తకాలయాలు.



**పరావలయం (కవిత్వం)**
- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
వెల : 100 /-
**ప్రతులకు :** రచయిత, ప్లాట్ నెం. 67, ఫ్లాట్ నెం. 202, స్వప్నాస్ రామకృష్ణ హైట్స్, సారధి హౌసింగ్ సొసైటీ, మోతి నగర్, హైదరాబాద్ - 500 018. ఫోన్ 98490 82693

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | |
|---|---|
| 1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. 2875 - 00 |
| 2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. 1200 - 00 |
| 3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. 350 - 00 |
| 4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. 100 - 00 |
| 5. శాసన సంపుటి | రూ. 150 - 00 |
| 6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి | రూ. 100 - 00 |
| 7. షబ్నవీస్ శతజయంతి సంచిక | రూ. 100 - 00 |
| 8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | 90 - 00 |
| 9. త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. 75 - 00 |
| 10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. 75 - 00 |
| 11. దేవాలయ వాస్తుశిల్పము | రూ. 50 - 00 |
| 12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. 50 - 00 |
| 13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. 75 - 00 |
| 14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. 100 -00 |
| 15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. 100 - 00 |
| 16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. 175 - 00 |

## చిరునామా


**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# జ్ఞాపకాల చేపపిల్లలు







నా చిన్నతనంలో
మా మామలు అరకతోని
వరిమళ్ళు దున్నుతుంటే
నేను పెయ్యంత
బురదను పూసుకొని
గట్లమీద గంతులేస్తుంటే
ఆ సంబరం
నన్నో వరదగూడును చేసి
ఆకాశానికి అంటుకట్టేది

ఎద్దులు మొరాయిస్తుంటే
అరే ఎద్దు ఇనదేందిరో
వలపట..దాపట అని గద్దించుకుంట, బుదగరిచ్చుకుంట
సాళ్ళు దున్నటం
చిత్రమనిపించేది

సూరీడు నడినెత్తినకు రాంగనే
పొద్దుగడియారాన్ని చూసి
నాగలిడిసి
బురద చేతులు,కాళ్ళతోనే
ఎంగిలి పడుతున్న
వాళ్ళను చూస్తున్నంతసేపు
దేశం ప్రాణంపోసుకుంటున్న
మట్టిబొమ్మలా కనబడేది

చుట్టూ పచ్చనిచెట్లు
పెద్ద ఓడల బాయి
వానొత్తే తలదాసుకునె
కమ్మలగుడిసెలో కూసోని
మామిడికాయ చెక్కేసుకొని
తలో ముద్ద తింటాంటే
తనివితీరిపోయేది...

ఆ బాయికాడి
పంపుసెట్టు కాడ స్నానాలు చేయడం
గడ్డి వాముల సీతపలక్కాయలు మాగేయడం
గడికొక్కపాలి పండినయ లేవా అని
ఒత్తి ఒత్తి సూడడం
ఇప్పుడు నా కళ్ళల్లో మెదులుతున్న
దృశ్యచిత్రాలు..

ఆ గట్లపొంటి
చిట్టి చిట్టి రామ్ములకపండ్ల
ఏరుకొని తింటూ
మాపటికూరకు
బుడంకాయల దొరకబుచ్చుకొని
సంచినింపుకొని
బాటేంట చెప్పుకుంట పోయిన
ముచ్చట్లు,కథలు
నా గుండె సాళ్ళల్లో నాటబడ్డ
బతుకుచిత్రాలు...

ఆ పక్కనే ఉన్న
కుంటలో చేపలు పట్టడం
ఈతపళ్ళ చెట్టుదులపటం
ఇంకా ఎన్నెన్నో
నా మనసు వాగులో
ఇప్పటికీ ఈదుతున్న
జ్ఞాపకాల చేపపిల్లలు

**తండ హరీష్ గౌడ్**
ఫోన్ : 8978439551

# LEARN PLAY EXPLORE

30 YEARS

Glorious Service to Social Progress.

UPGRADED TO **CBSE**

Senior Secondary School





## Pre-Primary, Primary School

- Optimum class strength
- Child-friendly teaching by skilled teachers
- Safe educational toys to stimulate learning
- Activities include vocabulary enrichment, life skills, storytelling and acting.
- One-to-one attention
- Physical exercises, dance, singing, aerobics & field trips
- Regular Parent - Teacher interaction

## Middle & High School

- Optimum class strength
- Well-qualified and trained teachers
- State-of-the-art AV hall and labs
- Visual and Performing arts
- Well stacked Library
- Monthly Parent-Teacher interaction
- A good ground preparation of competitive & common entrance exams
- Yoga and Meditation for Physical & Mental balance

**We impart education by integrating proven, world-class teaching methods with modern infrastructure and technology.**

AI School

The latest pedagogy in classroom teaching



# SISTER NIVEDITA SCHOOL

Estd-1989

CBSE - Senior Secondary School

**Class I to XII**

THE PLAY SCHOOL®

Kindergarten Wing of SNS

**Nursery, LKG & UKG**

**CBSE Affiliation Code: 36300400**

# D.K.Road, AMEERPET, Hyderabad-500 016. Ph.: 040-2373 1518, 4230 1518, Mobile: +91 80967 38855, E-mail:snschoolamp@gmail.com

*For Your Child's Bright Future...*

*www.snschool.com*